బహిర్గతం కాని రంగులు
రూ॥140/-
పేజీలు:140
నవచేతన పబ్లిషింగ్ హౌస్

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

### ప్రభుత్వ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాపక్షం/హైదరాబాద్

మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ,లిటరసీ '2024 సంవత్సరానికి గాను అందజేసే అవార్డుల'కు ప్రభుత్వ జిల్లా,మండల పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది.

సంపుటి 07, సంచిక: 208 | శనివారం | 29-06-2024 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 8+8 | వెల రూ. 5.00

## కాంగ్రెస్‌లోకి కాలె

సిఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్న చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య



ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్‌ఎస్‌కు మరో షాక్ తగిలింది. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఢిల్లీలో సిఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్‌మున్నీ సమక్షంలో శుక్రవారంమ ఆయన కాంగ్రెస్ కండువా తరువాయి 2లో

## పది మందిని నాయకులుగా తీర్చిదిద్దుతాం

నాయకులు పార్టీని ప్రభావితం చేయలేరు

కొన్ని సార్లు అబద్ధ ప్రచారాలను నమ్మి ప్రజలు బొల్తాపడుతారు : కెసిఆర్

ప్రజాపక్షం/హైదరాబాద్



నాయకులు పార్టీని ప్రభావితం చేయలేరని,పార్టీనే నాయకులను తయారు చేస్తుందని బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అన్నారు. ఒకరు పోతే, పది మందిని నాయకులుగా పార్టీ తీర్చిదిద్దుతుందన్నారు. కొన్ని, కొన్ని సార్లు ప్రజాస్వామ్యంలో అబద్ధ తరువాయి 2లో

# బతుకు ఛిద్రం

షాద్‌నగర్ బూర్గల సౌత్ గ్లాస్ పరిశ్రమలో పేలిన రియాక్టర్

## ఐదుగురు కార్మికులు మృతి



15 మందికి తీవ్ర గాయాలు

కొందరి పరిస్థితి విషమం

మృతులు పెరిగే అవకాశం

ప్రజాపక్షం/షాద్‌నగర్

రంగారెడ్డి జిల్లాలోని షాద్‌నగర్‌లో పెను విషాదం చోటు చేసుకుంది. బుర్గుల సౌత్ గ్లాస్ కంపెనీల్లో రియాక్టర్ పేలడంతో ఘోర ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఐదుగురు కార్మికులు దుర్మరణం చెందారు. ఈ పేలుడుతో పరిశ్రమ వద్ద భీతావహ వాతావరణం నెలకొంది. గాజు పరిశ్రమ కావడంతో కార్మికుల మృతదేహాలు ఛిద్రమయ్యాయి. ఈ ఘటనలో 15మందికి గాయాలు కాగా.. పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలు అదుపు చేసేందుకు యత్నిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న శంషాబాద్ జోనల్ డిసిపి రాజేష్, అడిషనల్ డిసిపి రాంకుమార్ పోలీస్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని వెంటనే శంషాబాద్ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాగా, జిల్లా తరువాయి 2లో

## రేషన్ కార్డు ప్రామాణికం కాదు



రూ.2 లక్షల వరకు మాత్రమే రుణమాఫీ

నాలుగు రోజుల్లో మార్గదర్శకాలు విడుదల

ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇష్టాగోష్టి

ప్రజాపక్షం / హైదరాబాద్

తెలంగాణలో రైతుల పంట రుణమాఫీ కోసం నాలుగు రోజుల్లో మార్గదర్శకాలు విడుదల చేయనున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చెప్పారు. 'పంట రుణాల మాఫీకి రేషన్ కార్డు ప్రామాణికం కాదు. రేషన్ కార్డు కేవలం కుటుంబాన్ని గుర్తించడం కోసం మాత్రమే. రూ.2 లక్షల వరకు మాత్రమే రుణమాఫీ ఉంటుంది' అని సిఎం స్పష్టం చేశారు. బంగారు తాకట్టు పెట్టి తీసుకున్న రుణాలు మాఫీ కావని, భూముల పాస్ బుక్ ఆధారంగానే రుణ మాఫీ ఉంటుందన్నారు. రైతు రుణమాఫీ చేసిన తర్వాత రైతుబంధు ఇతర పథకాలపై దృష్టి పెడతామని సిఎం అన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సిఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మండలాలు, రెవెన్యూ డివిజన్ విషయంపై అసెంబ్లీలో చర్చించి కమిషన్ ఏర్పాటు చేస్తామని, కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన వాస్తవాలను కూడా అసెంబ్లీ ముందుకు తెస్తామని, చర్చల తర్వాత డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక, నిపుణుల సూచన మేరకు ముందుకు వెళ్తామని సిఎం చెప్పారు. ఐఎఎస్, ఐపిఎస్‌ల పోస్టింగ్‌లో రూల్స్ బ్రేక్ చేయం. కెసిఆర్ చేసిన తప్పులను మేం చేయబోమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ఖజానాకు ఆర్థిక భారం ఉన్నా సరే సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, బిసి కమిషన్ తరువాయి 2లో

## 'నీట్' వ్యవహారంపై దద్దరిల్లిన పార్లమెంట్

ఉభయసభల్లోనూ విపక్ష సభ్యుల ఆందోళనలు

వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన

పేపర్ లీకేజీపై చర్చ జరపాల్సిందేనని డిమాండ్



**న్యూఢిల్లీ :** 'నీట్' పేపర్ లీకేజీ వ్యవహారంపై పార్లమెంట్ దద్దరిల్లింది. ఈ అంశంపై చర్చించాలని డిమాండ్ చేస్తూ ఉభయసభల్లోనూ శుక్రవారం ప్రతిపక్ష సభ్యులు పట్టుబట్టారు. అయితే సభ్యుల ఆందోళనలతో లోక్‌సభ సోమవారానికి వాయిదా పడింది. ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభమైన తర్వాత స్పీకర్ ఓం బిర్లా విపక్షాలు ఇచ్చిన వాయిదా తీర్మానాలను తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో విపక్ష సభ్యులు తమ స్థానాల నుంచి లేచి, నీట్‌పై చర్చ జరపాలని డిమాండ్ చేశాయి. స్పీకర్ అందుకు అంగీకరించకపోవటం వల్ల విపక్ష సభ్యులు నినాదాలు చేశారు. అయితే ముందుగా మాజీ లోక్‌సభ స్పీకర్, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి మనోహర్ జోషి సహా 13 మంది సభ్యుల మృతికి సంతాపం ప్రకటించాలని సభ్యులకు సూచించారు. దీంతో వెనక్కి తగ్గిన ప్రతిపక్ష సభ్యులు సంతాప కార్యక్రమం అనంతరం మళ్లీ ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో నీట్ పరీక్ష లక్షలాది మంది విద్యార్థులకు సంబంధించినదని, దానిపై చర్చకు అనుమతి ఇవ్వాలని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తరువాయి 2లో

### చర్చ జరగాల్సిందే: రాహుల్



నీట్ పరీక్ష నిర్వహణలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై పార్లమెంట్‌లో గౌరవప్రదంగా మంచి చర్చ జరిగేలా చూడాలని ప్రధాని నరేంద్ర మోదీని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కోరారు. పార్లమెంట్ ఆవరణలో రాహుల్ మీడియాతో మాట్లాడారు. దేశంలో నీట్ తరువాయి 2లో

### నీట్ రద్దుకు తమిళ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం



**చెన్నై:** దేశ వ్యాప్తంగా వైద్య సీట్ల భర్తీ కోసం నిర్వహించే నీట్ యుజి 2024 పరీక్ష నిర్వహణపై దేశవ్యాప్తంగా గందరగోళం నెలకొంది. పరీక్షకు ముందే పేపర్ లీకేజీ జరిగినట్లు తరువాయి 2లో

## జలదిగ్బంధంలో ఢిల్లీ

పలు ప్రాంతాల్లోకి ఉప్పొంగిన వరదలు

విద్యుత్ సరఫరా నిలిపివేత : తీవ్ర ట్రాఫిక్ జామ్

అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్-1 పైకప్పు కూలి ఒకరు మృతి

24 గంటల్లో సఫ్దార్‌జంగ్‌లో 228.1 మిల్లీమీటర్ల వర్షపాతం







**న్యూఢిల్లీ :** నీటి సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న దేశ రాజధాని ఢిల్లీని శుక్రవారం కురిసిన భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి. వర్షాల వల్ల పలు ప్రాంతాల్లోకి వరదనీరు ఉప్పొంగింది. దీంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రోడ్లపైకి వరద నీరు రావడం వల్ల భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. భారీ వర్షాల వల్ల ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్1 పైకప్పులో కొంత భాగం కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఒకరు మరణించగా, మరో ఐదుగురు గాయపడ్డారు. గత 24 గంటల్లో సఫ్దార్‌జంగ్‌లో 228.1 మిల్లీమీటర్ల వాన పడింది. 88 ఏళ్ల తరువాత జూన్‌లో ఇంత వర్షం కురవడం ఇదే తొలిసారి. గురువారం రాత్రి కేవలం 3 గంటల వ్యవధిలో 148.5 మి.మీ. కురిసింది. నగరంలో చాలా చోట్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తడం వల్ల ట్రాఫిక్ పోలీసులు ఇబ్బందికరమైన మార్గాల వివరాలను ఎక్స్‌లో పోస్టు చేశారు. శాంతివన్ నుంచి ఐఎస్‌బిటి వరకు ఔటర్ రింగ్ రోడ్డు రెండు వైపులా ప్రయాణించలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. అనువర్త మార్గంలో కూడా ట్రాఫిక్‌కు ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు. మరోవైపు, ఢిల్లీ రైల్వే స్టేషన్‌లోకి వరద నీరు చేరడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మోకాళ్ల నీటిలో నడిచి వెళ్తున్నారు. ఢిల్లీలోని పలు మెట్రో స్టేషన్లలోకి కూడా వరద నీరు చేరడం వల్ల అసౌకర్యానికి తరువాయి 8లో




## బిజెపి పాలనలో ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయ్

మతోన్మాదులను హెచ్చరించిన ఎన్నికల ఫలితాలు

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జాతీయ కార్యదర్శి నారాయణ

ప్రజాపక్షం/ ఖమ్మం


బిజెపి పాలనలో దేశంలో ఆర్థిక అంతరాలు పెరిగిపోతున్నాయని, అతి కొద్ది మంది చేతుల్లో దేశ సంపద పోగుబడుతుందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ ఆరోపించారు. భవిష్యత్తులో భారత ఆర్థిక వ్యవస్థ కొందరి తరువాయి 2లో

## బుజ్జగిస్తున్నా... కారు దిగుతుండ్రు

బిఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఆగని వలసలు

త్వరలోనే మరి కొందరు ఎమ్మెల్యేలు?

ప్రజాపక్షం/హైదరాబాద్



పార్టీ ఫిరాయింపులకు అడ్డుకట్ట వేసేందుకు బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కెసిఆర్ రంగంలోనికి దిగినా ఫలితం లేకుండా పోయింది. తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని, తాను పూర్తి అండగా ఉంటానని, భవిష్యత్‌లో మంచి అవకాశాలు వస్తాయని సాక్షాత్తు కెసిఆర్ భరోసానిస్తున్నప్పటికీ పార్టీ ఫిరాయింపులకు అడ్డుకట్ట పడలేదు. ఎర్రవెల్లి వేదికగా ఎంఎల్‌ఎలు, ముఖ్యనేతలను బుజ్జగించినా తాజాగా చేవేళ్ల ఎంఎల్‌ఎ కాలేరు యాదయ్య ''కారు'' దిగడం బిఆర్‌ఎస్‌ను మరింత కలవర పెడుతోంది. ఇటీవల పోచారం శ్రీనివాస్ రెడ్డి, సంజయ్‌కుమార్ పార్టీ వీడిన తర్వాత మిగతా తరువాయి 2లో


## హేమంత్ సోరెన్‌కు బెయిల్



**రాంచీ :** భూ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో విచారణను ఎదుర్కొంటున్న జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు ఊరట లభించింది. ఈ కేసులో ఆయనకు రాష్ట్ర హైకోర్టు శుక్రవారం బెయిల్ మంజూరుచేసింది. 'ప్రాథమిక ఆధారాల పరంగా ఆయన ఏ నేరానికి పాల్పడలేదు. బెయిల్‌పై ఉన్నప్పుడు నేరం చేసే అవకాశాలు తరువాయి 8లో

## కెసిఆర్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్


**హైదరాబాద్:** కరెంటు కొనుగోళ్లు, భద్రాద్రి విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వ నిర్ణయంలో లోటుపాట్లను సమీక్షించడానికి జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి కమిషన్ ఏర్పాటుపై మాజీ సిఎం, బిఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు దాఖలు చేసిన పిటిషన్ విచారణ ముగిసింది. కెసిఆర్ పిటిషన్‌కు విచారణ అర్హత ఉందా లేదా అనే దానిపై సిజె ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. ఈ కేసుకు సంబంధించి ప్రభుత్వం తరపున ఎజి సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. కెసిఆర్ పిటిషన్‌కు విచారణ అర్హత లేదని తరువాయి 8లో



చైనా చేపట్టిన చాంగ్‌–ఈ మిషన్ విజయవంతంకాగా, చంద్రుడి ఆవలవైపు నుంచి సుమారు 2 కిలోల నమూనాలను భూమికి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. భూమి పైనుంచి కనిపించని రెండోవైపున దిగిన చైనా వ్యోమనౌక, అక్కడి నుంచి 1,935.3 కిలోల బరువైన నమూనాలను సేకరించిందని చైనా నేషనల్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (సిఎన్ఎస్ఎ)కు చెందిన లూనార్ ఎక్స్‌ప్లొరేషన్ అండ్ స్పేస్ ఇంజినీరింగ్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ గే పింగ్ ప్రకటించారు. గతంలో భూమికి వచ్చిన చంద్రుడి నమూనాలు (మట్టి, ధూళి)తో పోలిస్తే, ఇప్పటి నమూనా జిగటగా ఉందని చాంగ్–ఈ6 మిషన్‌కు అధికార ప్రతినిధిగా కూడా వ్యవహరిస్తున్న పింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. శాస్త్రవేత్తలు ప్రాథమిక పరీక్షలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కాగా, తొలుత తమ దేశ శాస్త్రవేత్త లు పరీక్షలు నిర్వహించిన తర్వాత, నమూనాలను ఇతర దేశాలకు అందుబాటులో ఉంచుతామని చైనా ఇది వరకే ప్రకటించింది.



ఉత్తర గాజా నుంచి వేలాదిమంది దక్షిణ ప్రాంతాలకు వలస వెళుతున్నారు. గాజా స్ట్రిప్‌లోని రఫా తదితర నగరాల వీధులన్నీ వలస వెళుతున్న ప్రజలతో కిక్కిరిసిపోయాయి. హమాస్ ఉగ్రవాదుల ఏరివేత పేరుతో సుమారు తొమ్మిది నెలలుగా గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తుండగా, వందలాది భవనాలు పూర్తిగా లేదా పాక్షికంగా ధ్వంసమయ్యాయి. పాఠశాలలు, ఆసుపత్రులు, జనావాసాలపైన కూడా ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపిస్తున్నది. ఇప్పటివరకూ కనీసం 37,000 మంది పౌరులు మృతి చెందినట్టు పాలస్తీనా వర్గాలు ప్రకటించాయి. గాజా ఉత్తర ప్రాంతంలో దాడులను ముమ్మరం చేస్తామని, కాబట్టి దక్షిణ ప్రాంతానికి తరలి వెళ్లాలని ఇజ్రాయెల్ హెచ్చరికలు జారీ చేయడంతో, వేలాదిమంది తమతమ నివాసాలను విడిచిపెట్టి, సురక్షిత ప్రాంతాలకు తరలుతున్నారు. వాహనాలు, గుర్రం బండ్లు, బగ్గీలు, ఆటో రిక్షాలు... ఏది అందుబాటులో ఉంటే దానిపై ప్రయాణిస్తున్నారు.



అంతరిక్షంలో రష్యా ఉపగ్రహం ఒకటి ముక్కలైంది. ఇది ఉపయోగంలో లేక పోవడంతో సమాచార వ్యవస్థకుగానీ, పరిశోధనలకుగానీ ఎలాంటి ఆటంకం ఏర్పడలేదు. అయితే, అంతర్జాతీయ స్పేస్ స్టేషన్‌కు ఈ ఉపగ్రహ శకలాల వల్ల ప్రమాదం వాటిల్లవచ్చన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అక్కడ స్పేస్‌వాక్ చేస్తున్న వ్యోమగాములను తక్షణమే తమతమ కేంద్రాల్లోకి వెళ్లాల్సిందిగా అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా హెచ్చరించింది. ఈ విధంగా గ్రహాలు ముక్కలుకావడం కొత్తేమీ కాదు. 2002 నాటికి అంతరిక్షంలో 5,465 క్రియాశీలక ఉపగ్రహాలు ఉన్నాయని నార్త్ అమెరికన్ ఏరోస్పేస్ డిఫెన్స్ కమాండ్ (ఎన్ఓఆర్ఎడి) ప్రకటించింది. సుమారుగా 27,000 ఉపగ్రహ శకలాలు కూడా రోదసిలో ఉన్నాయని తెలిపింది. వీటివల్ల భూగోళానికి పెద్దగా నష్టం లేకపోయినా, అంతరిక్ష ప్రయోగాలకు, స్పేస్ సెంటర్లకు మాత్రం ప్రమాదాలు తప్పకపోవచ్చని శాస్త్రవేత్తలు అంటున్నారు.



తీవ్ర ఉద్రిక్తతల మధ్య, ఇరాన్ అధ్యక్ష పదవికి శుక్రవారం పోలింగ్ జరిగింది. గతనెల జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో ఇబ్రహీం రైసీ మృతి చెందడంతో, అతని స్థానంలో కొత్త అధ్యక్షుడి ఎన్నిక అనివార్యమైంది. ఈ పదవి కోసం పలువురు దరఖాస్తు చేసుకోగా, ఇరాన్ సుప్రీం లీడర్, 85 ఏళ్ల అయతొల్లా అలీ ఖమేనీ ఆరుగురిని ఎంపిక చేశారు. వారిలో పార్లమెంటు స్పీకర్ మహమ్మద్ బాఘేర్ గాలిబాఫ్, అణు సంధానకర్త సయీద్ జలీలీ, కరడుగట్టిన సంప్రదాయవాది మొస్తఫా పూర్మొహమ్మది, టెహ్రాన్ మేయర్ అలీ రెజా జకానీ, అమరవీరుల ఫౌండేషన్ చీఫ్, ప్రస్తుత ఉపాధ్యక్షుడు అమీర్‌హుస్సేన్ ఘాజిజాదే‌హషేమీ ఉన్నారు. ఈ పోటీకి కేవలం ఒకే ఒక సంస్కరణ వాది మసూద్ పెజెష్కియాన్ ఎంపికయ్యారు. ఇరాన్ పార్లమెంటులో 'తబ్రిజ్'కు ప్రాతినిధ్యం వహిస్తున్న పెజెష్కియాన్ సంస్కరణ వాదిగా గుర్తింపు పొందారు. కాగా, శుక్రవారం సాయంత్రానికి పోలింగ్ ప్రక్రియ ముగిసింది.

# 25ఏళ్ల తర్వాత ఎన్నికల్లో రాణించిన స్వీడెన్ కమ్యూనిస్టు పార్టీ

**స్టాక్‌హోం:** స్వీడెన్ కమ్యూనిస్టు పార్టీ (ఎస్‌కెపి) ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో అద్భుత ప్రదర్శన ఇవ్వగలిగిందని ఆ పార్టీ నేత ఆండ్రియాస్ సోరెన్‌సెన్ ఒక ప్రకటన చేశారు. 25ఏళ్ల తర్వాత ఇది సాధ్యమైనట్లు చెప్పారు. 'దేశంలోని అన్ని ప్రాంతాల్లో పార్టీ రాణించింది. కొత్త ఓటర్లను ఆకర్షించింది. కమ్యూనిజం చచ్చిపోలేదని, తిరిగి పుంజుకునేలా అనువైనభూమిక దీనికి లభించిందని ఈ ఎన్నికల ఫలితాలతో స్పష్టమైంది. స్వీడన్ ఎన్నికల ప్రక్రియలో చిన్న పార్టీలకు ఆదరణ లభించలేదు. మా పార్టీ బ్యాలెట్లను దేశంలోని ప్రతి ఒక్క పోలింగ్ కేంద్రానికి మేమే చేరవేయాల్సిన బాధ్యత మాపైనే ఉంటుంది. చిన్న పార్టీలు ఈ ప్రక్రియ కోసం చాలా వనరులను వెచ్చించాల్సి వస్తుంది. లేకపోతే నిజమైన రాజకీయ పనికి అవి వినియోగమవుతాయి. ఇదే క్రమంలో మా బ్యాలెట్లను మాయం చేసేందుకు, తారుమారు చేసేందుకు ఆస్కారం ఉంటుంది. అలా జరిగితే మళ్లీ కొత్త బ్యాలెట్లు మేమే తీసుకెళ్లాలి. మాకు ప్రతి ఓటు ఎంతో విలువైనది. స్వీడిష్ ఎన్నికల వ్యవస్థ అప్రజాస్వామికమైనది. బడా పార్టీల కోసం రూపొందినది. ఈ వాస్తవాన్ని తోసిపుచ్చలేము. ఈసారి ఎన్నికల్లో మేము చేయగలిగినదంతా చేశాం. చాలాకాలం తర్వాత ప్రతి ఓటరును చేరుకోగలిగాం. అందుకే 25 ఏళ్ల తర్వాత పార్టీ అద్భుత ప్రదర్శన ఇచ్చిందని చెప్పగలం' అని ఆండ్రియాస్ సోరెన్‌సెన్ వెల్లడించారు.

## గాజాపై దురాక్రమణకు మద్దతివ్వొద్దు

### సైప్రస్ ప్రభుత్వానికి కమ్యూనిస్టుల డిమాండ్

**నికోసియా:** గాజాలో మారణహోమాన్ని కొనసాగిస్తున్న ఇజ్రాయెల్‌కు సహకరించడాన్ని తక్షణమే ఆపేయాలని తమ దేశ ప్రభుత్వాన్ని సైప్రస్ కమ్యూనిస్టులు డిమాండ్ చేశారు. రిపబ్లిక్ ఆఫ్ సైప్రస్ విమానాశ్రయాలను, సైనిక స్థావరాలను ఇజ్రాయెల్ వాడుకుంటోందని, ఇందుకు సైప్రస్ ప్రభుత్వం అనుమతిస్తోందని హెజ్బుల్లా లెబనాన్ దళాధిపతి ఇటీవల ఆరోపించారు. ది కమ్యూనిస్ట్ ఇనిషియేటివ్ ఆఫ్ సైప్రస్ (సిఐసి) ఒక ప్రకటనలో తమ ప్రభుత్వ తీరును ఖండించింది. గాజా మారణహోమంలో భాగస్వామ్యం కావద్దని, ఇజ్రాయిల్‌కు ఏ విధంగానూ సహాయ సహకారాలు అందజేయవద్దని డిమాండ్ చేసింది. తమ పోరాటం ఉగ్ర ఉచ్చులో చిక్కుకునే విధంగా... వినాశన మార్గంలోకి నెట్టబడుతోందని కోరింది. ప్రభుత్వ ప్రమాదకర విధానం గురించి సిఐసి అనేకసార్లు హెచ్చరించిందని ప్రకటన గుర్తుచేసింది. బ్రిటిష్ స్థావరాలు, యుకె హై కమిషన్ వద్ద చేసిన ఆందోళనలను ప్రస్తావించింది. 'స్థావరాలు... నాటో... సైప్రస్‌లో వద్దు' అన్న నినాదాన్ని పునరుద్ఘాటించింది. దేశ ప్రజల కోసం సైప్రస్ కమ్యూనిస్టులు పోరాటం ఆగబోదని తేల్చిచెప్పింది. సైప్రస్‌లోని బ్రిటిష్ స్థావరాల నిర్వీర్యానికి, ఇజ్రాయెల్‌కు మద్దతు ఉపసంహరణకు డిమాండ్ చేసింది. డిమాండ్ల సాధనకు పోరాటాన్ని కొనసాగిస్తామని ప్రకటించింది. హంతకులకు భూమిగానీ, గాలిగానీ, నీళ్లగానీ ఇవ్వరాదంటూ నినాదమిచ్చింది. స్వతంత్ర పాలస్తీనాకు ది కమ్యూనిస్ట్ ఇనిషియేటివ్ ఆఫ్ సైప్రస్ (సిఐసి) పిలుపునిచ్చింది.




## 'ఉగ్ర' జాబితా నుండి క్యూబా పేరును తొలగించాలి

### అమెరికాకు గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ డిమాండ్

**ఏథెన్స్:** ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశాల జాబితా నుంచి క్యూబా పేరును వెంటనే తొలగించాలని అమెరికాను గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కెకెఈ) యూరోపియన్ పార్లమెంట్ సంఘం డిమాండ్ చేసింది. 2021లో ట్రంప్ హయాంలో ఈ జాబితా రూపొందగా, బైడెన్ ప్రభుత్వం దానిని కొనసాగిస్తోంది. క్యూబాను ఉగ్రవాదానికి మద్దతిచ్చే దేశాల సరసన చేర్చడం ఆమోదయోగ్యం కాదని పేర్కొంది. క్యూబా ఉగ్రవాదానికి మద్దతివ్వలేదని, ప్రోత్సహించలేదని స్పష్టంచేసింది. క్యూబాకు, ఆ దేశ ప్రజలకు సంపూర్ణ మద్దతు, సంఘీభావాన్ని ప్రకటించింది. క్యూబాపై ఆంక్షలను ఉపసంహరించుకోవాలని కూడా అగ్రరాజ్యాన్ని కెకెఈ యూరోపియన్ పార్లమెంటు సంఘం డిమాండ్ చేసింది. ఉగ్రవాద జాబితా నుంచి క్యూబా పేరు తొలగించేలా అమెరికాపై ఒత్తిడి తేవాలని, గ్రీస్ ప్రభుత్వానికి, యూరోపియన్ పార్లమెంటుకు, ఈయూ దేశాల ప్రభుత్వాలకు పిలుపునిచ్చింది.

## రూటో రాజీనామాకు కెన్యా కమ్యూనిస్టుల డిమాండ్

**నైరోబీ:** కొత్త ఆర్థిక బిల్లుకు వ్యతిరేకంగా కెన్యాలో ప్రజాందోళన మిన్నంటింది. నిరసనలపై ఉక్కుపాదం మోపేందుకు రక్తపాతానికి సైతం రూటో ప్రభుత్వం వెనుకాడలేదు. ప్రభుత్వ వైఖరిని కెన్యా కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా ఖండించింది. అధ్యక్షుడు విలియం రూటో వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కెన్యా కమ్యూనిస్టు పార్టీ (సిపికె) కేంద్ర కార్యనిర్వాహక కమిటీ ఒక ప్రకటన చేసింది. దేశ ప్రజలు కోరినట్టు నడుచుకోలేని ప్రభుత్వం అక్కర్లేదని పేర్కొంది. నిరంకుశ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చింది. గిథురైలో అమాయకుల ఊచకోత కోసం మృత్యుదళాలను కబళించడమే కాకుండా పదిమందికిపైగా నిరసనకారుల కిరాతక హత్యకు రూటో ఆదేశాలిచ్చారని ఆరోపించింది. వీధుల్లో అమాయకుల రక్తం పారేందుకు కారణమైన రూటోను నిలదీయాల్సిందేనని ప్రకటన పేర్కొంది. పోలీసు అధికారులు రూటోకు తొత్తుల్లా మారారని, ప్రజలపై దమనకాండకు తెరతీశారని విమర్శించింది. రూటో అవినీతి పాలన అంతానికి పోరు తప్పబోదని పిలుపునిచ్చింది. ఆహారం, ఆరోగ్య సంరక్షణ, విద్య వంటి వాటిపై పన్నులను పూర్తి స్థాయిలో రద్దు చేయాలని, ఆర్థిక బిల్లు 2024ను తక్షణమే ఉపసంహరించుకోవాలని రూటో ప్రభుత్వాన్ని సిపికె డిమాండ్ చేసింది.

దేశ సార్వభౌమత్వంతో రాజీ తగదని, ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్, నాటో వంటి విదేశీ సంస్థల జోక్యాన్ని నిలువరించాలని కోరింది. గౌరవమైన ఉపాధి, సుస్థిర జీవనోపాధి, అధికరణ 43 ను ఆరు నెలల్లోగా అమలు చేయాలని డిమాండ్ చేసింది. నాణ్యమైన విద్య, వైద్యాన్ని ఉచితంగా అందించాలని, అధికారిక హింసను ఆపాలని, ప్రదర్శనలపై ఉక్కు పాదం మోపడాన్ని మానుకోవాలని, కార్మికులకు సముచిత పరిహారం ఇవ్వాలని, ప్రభుత్వ వ్యవస్థల ప్రైవేటీకరణను ఆపాలని ప్రకటన డిమాండ్ చేసింది. 'అధ్యక్షుడు రూటో... నీ సమయం ముగిసింది! నీ చేతులు అమాయకుల రక్తంతో తడిచాయి... నీ అవినీతి పాలనను కెన్యా ప్రజలు తిరస్కరిస్తున్నారు. రూటో ఇక గద్దె దిగిపో!! దేశ వ్యవహారంలో ఐఎంఎఫ్ జోక్యం వద్దు!! ప్రపంచ బ్యాంకు రావద్దు!! అని కెన్యా కమ్యూనిస్టు పార్టీ (సిపికె) నినదాలిచ్చింది.

## కారు దిగుతుండ్రు (మొదటి పేజీ తరువాయి)

ఎంఎల్‌ఎలు, ముఖ్యనాయకులు ఎవ్వరూ పార్టీ వీడకుండా కెసిఆర్‌తో పాటు బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ప్రయత్నించినా ఎంఎల్‌ఎ కాలె యాదయ్యను 'కారు' దిగకుండా ఆపలేకపోయారని ఆ పార్టీ సొంత నాయకులే చెబుతున్నారు. ఒకవైపు గులాబీ పార్టీ ఎంఎల్ ఎలతో అధికార పార్టీ ముఖ్యనేతలు సంప్రదింపులు జరుపుతుండగా, మరోవైపు బిజెపి కూడా తమ వంతు ప్రయత్నాలు మొదలు పెడుతున్నది. దీంతో బిఆర్‌ఎస్‌లో ప్రస్తుతం ఉన్న ఎంఎల్‌ఎలో చివరి వరకు ఎవరు ఉంటారు?, ఎవరు 'కారు' దిగుతారనేది రాజకీయ వర్గాల్లో చర్చనీయంశంగా మారింది. జూలైలో శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో అప్పటి వరకు బిఆర్‌ఎస్‌లోని కొందరు ఎంఎల్‌ఎలతో పాటు ఇది వరకే ఆ పార్టీని వీడిన ఎంఎల్‌ఎలతో కలిపి బిఆర్‌ఎస్‌ఎల్‌పిని సిఎల్‌పిలో విలీనం చేస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. త్వరలోనే మరి కొందరు బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు కూడా కాంగ్రెస్‌లో చేరుతారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. అయితే తాము కచ్చితంగా బిఆర్‌ఎస్‌లోనే ఉంటామని స్పష్టం చేస్తున్న బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు, ముఖ్యనాయకులే బిఆర్‌ఎస్‌ను వదిలి కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ఇదిలా ఉండగా బిఆర్‌ఎస్‌కు చెందిన కొందరు ఎంఎల్‌ఎలు, ముఖ్యనాయకులతో ఇదివరకే కాంగ్రెస్ ముఖ్యులు సంప్రదింపులు పూర్తి చేసినట్టు తెలిసింది. చివరకు సొంత జిల్లా, నియోజకవర్గానికి చెందిన నాయకులకు కూడా తెలియనివ్వకుండా జాగ్రత్త పడుతున్నారు.

## చర్చ జరగాల్సిందే: రాహుల్ (మొదటి పేజీ తరువాయి)

సమస్య అత్యంత ముఖ్యమైందని, అన్నింటికంటే ముందు దీనిపైనే పార్లమెంట్‌లో చర్చ జరగాలని రాహుల్ అన్నారు. విద్యార్థుల ఆందోళనలను ఉధృతం చేస్తున్నారని, వారు తీవ్ర ఆవేదన చెందుతున్నారని, అసలు ఏం జరుగుతుందో వారికి తెలియడం లేదని ఈ సమయంలో ప్రభుత్వం, ప్రతిపక్షాలు కలిసి ఉన్నాయని, మీ సమస్యపై చర్చిస్తున్నాయని పార్లమెంటు ద్వారా యువతకు సందేశం పంపాలని రాహుల్ సూచించారు. నీట్ అంశం అతి ముఖ్యమైనదిగా ఇండియా కూటమి భావిస్తుందన్నారు. నీట్ యువతకు సంబంధించి సమస్య అని, దీనిపై పార్లమెంట్‌లో గౌరవప్రదమైన చర్చ జరగాలన్నారు. నీట్‌పై ఉభయసభల్లోనూ చర్చించాలని ప్రతిపక్ష పార్టీల ఫ్లోర్ లీడర్లు గురువారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారన్నారు. యువతకు సంబంధించి సమస్య చాలా ముఖ్యమైనదని ఇండియా కూటమి భావిస్తున్నదని తాను దేశంలోని విద్యార్థులకు చెప్పదల్చుకున్నానన్నారు. దేశానికి యువతే భవిష్యత్తు అని చెప్పారు.

## ఏకగ్రీవ తీర్మానం (మొదటి పేజీ తరువాయి)

ఆరోపణలున్న నేపథ్యంలో.. ఈ అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరపాలని విపక్షాలు పట్టుబడుతున్నాయి. ఈ తరుణంలో తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నీట్ పరీక్షను రద్దు చేయాలని ఆ రాష్ట్ర అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానించింది. వైద్యసీట్లను భర్తీ చేసుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు కల్పించాలని, మునుపటిలా 12వ తరగతి మార్కుల ఆధారంగా సీట్లు కేటాయింపులు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టగా అధికారపక్షంతోపాటు విపక్ష నేతలు కూడా ఆమోదం తెలిపారు. ఇదే అంశంపై డిఎంకె ఎంపి కనిమొళి మాట్లాడారు. నీట్ పరీక్ష నుంచి తమిళనాడుకు మినహాయింపు ఇవ్వాలని పునరుద్ఘాటించారు. నీట్ పరీక్ష వద్దని తమిళనాడు పదేపదే చెబుతోందని గుర్తు చేసిన ఆమె.. నీట్ నిర్వహణ డొల్ల అని ఇప్పుడు రుజువైందన్నారు. ఈ పరీక్ష వల్ల విద్యార్థులు ఎంతో కోల్పోతున్నారని పేర్కొన్నారు.

## కాంగ్రెస్‌లోకి కాలె (మొదటి పేజీ తరువాయి)

కప్పుకున్నారు. ఇటీవల జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, తెలంగాణ మాజీ స్పీకర్, బిఆర్‌ఎస్ బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి హస్తం గూటికి చేరిన విషయం తెలిసిందే. దీంతో యాదయ్యతో కలిపి ఇప్పటివరకు ఆరుగురు బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. ఆరుగురు ఎంఎల్‌ఎలు పార్టీ వీడడంతో బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎల సంఖ్య ప్రస్తుతం 32కు పడిపోయింది. శాసనసభ ఎన్నికల్లో 39 మంది గెలుపొందగా, ఇటీవల జరిగిన కంటోన్మెంట్ శాసనసభ ఉప ఎన్నికల్లో సిట్టింగ్ స్థానాన్ని కోల్పయిన విషయం తెలిసిందే.

## బతుకు ఛిద్రం (మొదటి పేజీ తరువాయి)

అధికారులు సంఘటన స్థలాని పరిశీలించారు. జరిగిన సంఘటన పై వివరాలు సేకరిస్తున్నారు. కంపెనీలో జరిగిన ప్రమాదం వివరాలు తెలుసుకున్నారు. కంపెనీలో ఎంత మంది ఉన్నారు. ఎంతమందికి గాయాలు జరిగినవి అనే సమాచారం పూర్తి వివరాలు తెలియడం లేదు. పూర్తి వివరాలు గురించి పోలీసులు ప్రయత్నిస్తున్నారు. గ్యాస్ రియాక్టర్ బ్లాస్ట్ కావడం కంపెనీ యజామాని నిర్లక్ష్య ం కారణమని సహచర కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరికరాలు లేని కారణంగా ప్రాణ నష్టం జరిగిందని కార్మికులు వాపోతున్నారు. సంఘటప స్థలాని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహ్మలు వివిధ పార్టీల రాజకీయ నాయకులు వచ్చి సంఘన స్థలాన్ని పరిశీలించారు. బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

**గాయపడిన వారికి తగిన చికిత్స అందిచండి : సిఎం** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో సౌత్ గ్లాస్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రికి తరలించి తగిన వైద్య చికిత్సలు అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ప్రమాద స్థలంలోనే ఉన్న కలెక్టర్‌కు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ప్రమాదం గురించి తెలియగానే జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు. ప్రమాదంలో రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ, కార్మిక, పరిశ్రమలు, వైద్య బృందాలు ఘటనా స్థలంలోనే ఉండి సమన్వయంతో సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అదే విధంగా ఈ దుర్ఘటనపై బిఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## పెరుగుతున్నాయ్ (మొదటి పేజీ తరువాయి)

గుప్పెట్లో చేరడం ద్వారా ఆర్థికంగా దేశం ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం శుక్రవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో పోటు ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నారాయణ మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులు, మోడీ అనుకూల సంస్థలు కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని కూలగొడుతుంటే మరోపక్క పేదలు మరింత పేదలు అవుతున్నారని ఆయన ఆరోపించారు. ప్రపంచంలో పేదరికం గణనీయంగా పెరుగుతున్న దేశాల్లో భారతదేశం కూడా ఒకటన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ ఒక కుదుపుకు గురవుతుంటే ప్రధాని మోడీ మాత్రం అబద్దాలు చెబుతూ దేశం ఆర్థికంగా వెలిగిపోతుందని ప్రధాని మోడీ చంకలు గుద్దుకుంటున్నారని కాని వాస్తవ పరిస్థితులు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయని నారాయణ తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి గెలిచినప్పటికీ దాని పరిస్థితి చావు తప్పి కన్ను లోట్టబోయినట్లయిందని ఆయన తెలిపారు. బిజెపి 400 సంఖ్య ఎందుకు రాలేదో అర్థం చేసుకోవాలన్నారు.

మతోన్మాద శక్తులకు ఈ ఎన్నికలు ఒక గుణపాఠం లాంటివని ఏ మతాన్ని చూపి లబ్ది పొందాలని బిజెపి ప్రయత్నించిందని ఆయన తెలిపారు. అయోధ్య రామాలయాన్ని చూపి ఓట్లు దండుకోవాలని చూస్తే చివరకు రామాలయం ఉన్న ఎంపి స్థానం పైజాబాద్‌ను బిజెపి కోల్పోయిందన్నారు. ఈ ఎన్నికలు మతోన్మాద శక్తులకు ఒక హెచ్చరిక లాంటివని నారాయణ తెలిపారు. బలమైన ప్రతిపక్షం లోక్‌సభలో ఉండడాన్ని సిపిఐ స్వాగతిస్తుందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ప్రధాన సమస్యల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించాలని నారాయణ సూచించారు. రైతు బంధు, రుణమాఫీ తో పాటు ఇతర ప్రజా సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. బొగ్గు బ్లాకుల వేలాన్ని అడ్డుకునేందుకు జరుగుతున్న పోరాటాల్లో కాంగ్రెస్ పార్టీ ముందు వరుసలో నిలవాలన్నారు. కేంద్రా న్ని నిలువరించేందుకు ఇది సరైన మార్గమని ఆయన అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను బొగ్గు బావుల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని బొగ్గు బ్లాకుల వేలం పాటలను తక్షణం నిలుపుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ విస్తరణ బలోపేతం పై దృష్టి సారించనున్నామని నారాయణ తెలిపారు. గ్రామశాఖల బలోపేతమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించనున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ క్యాడర్‌ను సంసిద్ధం చేస్తున్నామని ఆయన తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టగా ఈ సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నా రు.

## దద్దరిల్లిన పార్లమెంట్ (మొదటి పేజీ తరువాయి)

స్పీకర్‌ను కోరారు. లోక్‌సభ సమావేశాలు ప్రారంభమైన వెంటనే విపక్ష సభ్యులు సభా కార్యకలాపాలు నిలిపి నీట్‌పై చర్చించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై ఈ అంశాన్ని లేవనెత్తవచ్చని, తగినంత సమయం కూడా ఇస్తామని స్పీకర్ తెలిపినా, ప్రతిపక్ష సభ్యులు శాంతించలేదు. విపక్షాలు ఎంతకీ శాంతించకపోవడం వల్ల స్పీకర్ సభను తొలుత మధ్యాహ్నం 12 గంటలకు తర్వాత సోమవారానికి వాయిదా వేశారు. ఆ తర్వాత సభ సమావేశమైనా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు. నీట్ వ్యవహారంపై చర్చ జరపాల్సిందేనని పట్టుబడుతూ వెల్‌లోకి దూసుకెళ్లారు. దీంతో స్పీకర్ బిర్లా, పార్లమెంటరీ వ్యవహారాలశాఖమంత్రి కిరణ్ రిజిజు కల్పించుకుని రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా నీట్ అంశంపై చర్చిద్దామని అన్నారు. పార్లమెంట్‌లో కొన్ని నిబంధనలు పాటించాలని, కమిటీలు వేయాల్సి ఉందని బిర్లా అన్నారు. అయితే వాటిపై విద్యార్థులకు అవగాహన లేదని కాంగ్రెస్ ఎంపి గౌరవ్ గొగోయ్ చెప్పారు. తమకు న్యాయం చేయాలని మాత్రమే డిమాండ్ చేస్తున్నారన్నారు. ఈ తరుణంలో కాంగ్రెస్, టిఎంసి, డిఎంకె సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి ఆందోళన చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ చేపట్టడానికి ముందు ఒక అంశంపై చర్చించాలని డిమాండ్ చేయడం ఇదే మొదటిసారి అని కిరణ్ రిజుజు పేర్కొన్నారు. ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా ప్రతిపక్షాలు లేవనెత్తిన అన్ని అంశాలకు సమాధానాలు ఇస్తామని ఆయన హామీనిచ్చారు. అయినా ప్రతిపక్ష సభ్యు లు తమ ఆందోళనను కొనసాగించారు. సభలో ఉన్న వారిని ప్రజలు ఎన్నుకున్నారని, వారు సమస్యలు లెవనెత్తవచ్చని, చర్చ జరపాలని డిమాండ్ చేయవచ్చని కానీ, సభా కార్యకలాపాలకు అడ్డు తగలవద్దని బిర్లా సభ్యులకు సూచించారు. రోడ్డుపై నిరసన తెలియజేయడం, సభల్లో ఆందోళన చేయడం మధ్య భేదం ఉందన్నారు. విపక్ష సభ్యులు తమ ఆందోళనను కొనసాగించడంతో సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

**రాజ్యసభలోనూ గందరగోళం**

నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై తక్షణమే చర్చ చేపట్టాలని డిమాండ్ చేస్తూ విపక్ష సభ్యులు రాజ్యసభలో కూడా గందరగోళం సృష్టించడం సృష్టించారు. దీంతో రాజ్యసభ కార్యకలాపాలు కూడా వాయిదా పడ్డాయి. నీట్ సమస్యపై చర్చ జరపాలని ప్రతిపక్ష సభ్యులు ఇచ్చిన నోటీసులను రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ ఆమోదించలేదు. చర్చ డిమాండ్‌ను ఆమోదించాలని రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే కోరినా చైర్మన్ అంగీకరించలేదు. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. వెల్‌లోకి దూసుకెళ్లిన ప్రతిపక్ష సభ్యులు తిరిగి తమ స్థానాల్లో కూర్చోవాలని చైర్మన్ కోరినా వారు నిరాకరించారు. ఒక ప్రతిపక్ష నేత వెల్‌లోకి రావడం ఎప్పుడూ జరగలేదన్నారు. దీంతో సభ వాయిదా తొలుత మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేయగా, ఆ తరువాత కూడా పరిస్థితుల్లో మార్పు లేకపోవడంతో సభను మరోసారి వాయిదా వేశారు. ఆ తరువాత కూడా చైర్మన్ వ్యాఖ్యలపై సంతృప్తి చెందిన ప్రతిపక్ష సభ్యులు సభను వాకౌట్ చేశాయి.

## ప్రామాణికం కాదు (మొదటి పేజీ తరువాయి)

పదవీకాలం ఆగస్టుతో పూర్తవుతుందని, కొత్త వారిని నియమించిన తరువాత కుల గణన చేస్తామని తెలిపారు.

**ధరణిలో మార్పులు, చేర్పులు :** ''కెసిఆర్ హయాంలో తీసుకొచ్చిన 'ధరణి'లో ఉన్న లోపాలు సరి చేసే పనిలో ఉన్నాం. ఆ తరవాత ఏ పేరు పెట్టినా నడుస్తుంది. కంప్యూటరైజ్ చేయాలా? లేక మాన్యువల్ పద్ధతి పాటించాలా? రెండే పద్ధతులు. ఏది చేయాలో అసెంబ్లీ ముందు పెట్టిన తర్వాతే నిర్ణయం ఉంటుంది. ఏ పాలసీ అయినా ముందు అసెంబ్లీలో ప్రవేశపెట్టి చర్చించిన తర్వాతే మార్పు చేర్పులతో తుది విధానాన్ని ప్రకటిస్తాం.

**రుణభారం తగ్గించుకునే పనిలో ఉన్నాం :** ''రాష్ట్రం రూ.7లక్షల కోట్ల అప్పుల్లో ఉంది. ప్రతి నెల రూ.7వేల కోట్ల అప్పులు కడుతున్నాం. రాష్ట్రం విడిపోయినప్పుడు నెలకు రూ.6,500 కోట్లు కట్టేవారు. గత ప్రభుత్వం 7 నుంచి 11 శాతం వడ్డీతో రుణాలు తెచ్చింది. రుణభారం తగ్గేలా రుణాల వడ్డీని తగ్గించుకునే పనిలో ఉన్నాం. ఒక్క వడ్డీ శాతం తగ్గినా రూ.700 కోట్లు ఆదా అవుతాయి. ఈ మేరకు కేంద్రంతో సంప్రదింపులు చేస్తున్నాం. బడ్జెట్‌కు ముందే రాష్ట్రానికి కావాల్సిన అంశాలను కేంద్రం దృష్టిలో ఉంచి ఎక్కువ నిధులు పొందే ప్రయత్నం చేస్తున్నాం అని సిఎం రేవంత్‌రెడ్డి వివరించారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశ పెట్టిన రెండు రోజుల తర్వాత తెలంగాణ బడ్జెట్ సమావేశాలుంటాయని సిఎం తెలిపారు. తెలంగాణ బడ్జెట్ వాస్తవ అంచనాలకు అనుగుణంగా ఉండాలని అధికారులకు చెప్పామని, అంచనాలకు మించి ఊహాజనిత లెక్కలతో బడ్జెట్ ఉండకూడని అధికారులను ఆదేశాలు ఇచ్చామన్నారు.

**లాభాల్లో టిజిఆర్‌టిసి :** 'బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం వల్ల రెవెన్యూ పెరిగింది. మహిళల ఉచిత ప్రయాణానికి సంబంధించిన నిధులు రూ.350కోట్లకు పైగా ప్రభుత్వం ఆర్‌టిసికి ప్రతి నెలా చెల్లిస్తోంది. 30శాతం నుంచి ఆక్యుపెన్సీ రేషియో 80 శాతానికి పెరిగింది. తద్వారా ఆర్‌టిసికి నిర్వహణ నష్టాలు తగ్గాయి అని అన్నారు. రాష్ట్రంలో విద్యుత్ కొరత లేదు. పంపిణీలో అంతరాయాలు మాత్రమే ఉన్నాయి' అని సిఎం పునరుద్ఘాటించారు. ''ఉచిత పథకాలను తప్పుపట్టడం సరికాదు. అవసరం ఉన్నవారికే సంక్షేమ పథకాలు అందాలి. మోదీ 10ఏళ్లలో రూ.16 లక్షల కోట్లు కార్పొరేట్లకు మాఫీ చేస్తే ఎవరు ప్రశ్నించరు?కానీ మహిళలు, రైతులు, పేదలకు ఇస్తే మాత్రం తప్పుపడుతున్నారు'' అని రేవంత్‌రెడ్డి అన్నారు. ''కాంగ్రెస్ బి ఫామ్ మీద గెలిచిన వారికి మాత్రమే పదవులు వచ్చాయి. టిపిసిసి చీఫ్‌గా రెండు ఎన్నికలు పూర్తి చేశాను. జూలై 7తో మూడేళ్లు పిసిసి పూర్తి కానుంది. పిసిసి, కేబినెట్ విస్తరణ నిర్ణయాలు ఒకే సారి ఫైనల్ అవుతాయి'' అని సిఎం చెప్పారు.

## తీర్చిదిద్దుతాం (మొదటి పేజీ తరువాయి)

ప్రచారాలను నమ్మి ప్రజలు బోల్తపడుతుంటారని, మొన్నటి ఎన్నికల్లో ఇదే జరిగిందని, అంతమాత్రాన నిరుత్సాహపడొద్దని సూచించారు. కోరుట్ల,జగిత్యాల నియోజకవర్గాలకు చెందిన బిఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులతో ఎర్రవెల్లిలో శుక్రవారం కెసిఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరికల్లాంటి యువ నాయకులను బిఆర్‌ఎస్ సృష్టిస్తుందన్నారు. రెట్టించిన ఉత్సాహంతో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేద్దామన్నారు. సమైక్యవాదులతో కలబడి, నిలబడి అత్యంత కష్టతరమైన తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన బిఆర్‌ఎస్‌శ్రేణులకు, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ఒక లెక్కనే కాదని చెప్పారు. పార్టీ నుంచి పోయి దొంగలతో కలుస్తున్న నాయకుల గురించి ఏ మాత్రం ఆలోచించాల్సిన అవసరం లేదన్నారు. తెలంగాణ ప్రగతి ప్రస్థానంలో చేరుకోవాల్సిన మైలురాళ్లు ఇంకా చాలా మిగిలే ఉన్నాయని, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను, కలలను నెరవేర్చగలిగే అవగాహన 'మనకు' మాత్రమే ఉన్నదని కెసిఆర్ అన్నారు.

**అధికారం ఉంటేనే పని చేస్తామంటే పద్ధతికాదు :** అధికారం ఉంటేనే పనిచేస్తామంటే పద్ధతికాదని, మనం ఏ హోదాలో ఉన్నప్పటికీ ప్రజలకోసం పనిచేయాల్సిందేనని కెసిఆర్ అన్నారు. అంతిమ లక్ష్యం తెలంగాణ ప్రజల సంక్షేమం, అభివృద్ధి మాత్రమేనన్నారు. జగిత్యాల నుంచి పోయిన వ్యక్తిని పార్టీనే తయారు చేసిందని, ఇప్పుడు అంతకన్నా మెరుగైన నాయకత్వాన్ని పార్టీ తయారు చేస్తుందన్నారు. ఈ సమావేశంలో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు, ఎంఎల్‌ఎలు వేముల ప్రశాంత్ రెడ్డి, సంజయ్ ,కౌశిక్ రెడ్డి, మాజీ ఎంఎల్‌ఎ బాల్క సుమన్, ఎ.జీవన్ రెడ్డి, జాజాల సురేందర్, గంప గోవర్ధన్, హన్మంత్ షిండే, ఎంఎల్‌ఎ ఎల్ .రమణ, జగిత్యాల జెడ్‌పి చైర్మన్ వసంత సురేష్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నేతలతో కెసిఆర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

# నీలం విజయకుమార్ మృతికి సురవరం సుధాకర్‌రెడ్డి సంతాపం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రముఖ కమ్యూనిస్టు నీలం రాజశేఖర్ రెడ్డి కుమారుడైన ప్రముఖ వైద్యులు, సంఘ సేవకులు డాక్టర్ నీలం విజయ కుమార్ మృతి పట్ల సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి సంతాపం తెలిపారు. డాక్టర్ విజయ్‌కుమార్ మృదుస్వభావి అని, సేవా తత్పరత కలిగిన వైద్యుడు అని ఒక సంతాప సందేశంలో ఆయన కొనియాడారు. విజయకుమార్ తనకు విద్యార్థి దశ నుండే తెలుసునని సురవరం సుధాకర్‌రెడ్డి తెలిపారు. హైదరాబాదులోని అశోక్‌నగర్‌లో నీలం రాజశేఖర్ రెడ్డి అద్దె ఇంట్లో నివాసం ఉండేవారని, వారి కుమారులు విజయ్ కుమార్, రవి కర్ణాటకలో వైద్య విద్యను అభ్యసించే వారని, వారు హైదరాబాద్‌కు వచ్చినప్పుడల్లా కలిసేవారని సుధాకర్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. విజయ్‌కుమార్ అనంతపురంలో మంచి నేత్ర వైద్యులుగా పేరొందారని, తాను, సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అనంతపురం వెళ్లినప్పుడల్లా వారి ఇంట్లో లేదా వికె ఇంట్లో బస చేసేవారమని తెలిపారు. ఇటీవల వరకు ఆయన వైద్యునిగా ప్రాక్టీస్ చేసి, వృద్ధాప్యం కారణంగా తన వైద్య సేవలను నిలిపివేశారని, ఆయన బ్రహ్మచారి అని సురవరం అన్నారు.

**సిఆర్ ఫౌండేషన్ సంతాపం**

ప్రముఖ కమ్యూనిస్టు చంద్ర రాజేశ్వరరావు (సిఆర్) ఫౌండేషన్ జనరల్ బాడీ సభ్యుడు, కీ.శే. నీలం రాజశేఖర రెడ్డి కుమారుడు నీలం విజయ కుమార్ మృతి పట్ల సిఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ కె.నారాయణ, ప్రధాన కార్యదర్శి మాజీ ఎంఎల్‌ఎ పల్లా వెంకట్ రెడ్డి, కోశాధికారి చెన్నకేశవరావు ప్రగాఢ సంతాపాన్ని ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. సామాజిక సేవ కార్యకలాపాలలో సమాజ అభ్యున్నతికి విజయ్‌కుమార్ జీవితాంతం కృషి చేశారని, ముఖ్యంగా సిఆర్ ఫౌండేషన్ కార్యకలాపాలకు తోడ్పాటు అందించారని వారు సంతాప సందేశంలో కొనియాడారు.

# పదవ తరగతి సప్లిమెంటరీ ఫలితాల్లో 73.03 శాతం ఉత్తీర్ణత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పదవ తరగతి అడ్వాన్స్‌డు సప్లిమెంటరీ పరీక్షల్లో 73.03 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. 46,731 మంది పరీక్షకు హాజరవ్వగా 34,126 మంది పాస్ అయ్యారు. ఉత్తీర్ణత సాధించిన వారిలో బాలికలు 76.37 శాతం, బాలురు 71.01 శాతం పాస్ అయ్యారు. ఈ మేరకు పదవ తరగతి ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ దరఖాస్తులకు జులై 8 వరకు అవకాశం కల్పించారు. అడ్వాన్స్ డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో నిర్మల్ జిల్లాలో వంద శాతం ఉత్తీర్ణత సాధించి మొదటి స్థానంలో నిలువగా, 42.14 శాతం ఉత్తీర్ణతతో వికారాబాద్ జిల్లా చివరి స్థానంలో ఉన్నది. ఆదిలాబాద్, పెద్దపల్లి, భూపాలపల్లి, హన్మకొండ, కరీంనగర్, సంగారెడ్డి, సిద్దిపేట, జనగాం, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 90 శాతానికి పైగా ఉత్తీర్ణత నమోదైంది. కాగా ఈనెల 3 నుంచి 13 వరకు సప్లిమెంటరీ అడ్వాన్స్‌డ్ పరీక్షలు నిర్వహించారు. ఫలితాలను, మరిన్ని వివరాలకు www. bse. telangana. gov.inవెబ్ సైట్‌ను సంప్రదించాలని ప్రభుత్వ పరీక్షల సంచాలకులు కృష్ణారావు తెలిపారు.



# ప్రజావాణిలో 494 దరఖాస్తుల స్వీకరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:**''ప్రజావాణి'' కార్యక్రమంలో వివిధ సమస్యల పైన సుమారు 494 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఇందులో రెవెన్యూకు సంబంధించిన సమస్యలపైన 125, హౌసింగ్ కు సంబంధించి 43, పౌరసరఫరాల శాఖకు సంబంధించి 71, హోం శాఖకు సంబంధించి 45, పంచాయతి రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖకు సంబందించి 47, ఇతర శాఖలకు సంబంధించి 48 దరఖాస్తులను ప్రజల నుంచి స్వీకరించారు.

హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి స్వీకరించారు.

కొందరు బాధితులతో ఆయన స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాగా ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్య ఇతర అధికారులు ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు.

# పేద మైనారిటీ పిల్లలలో 27శాతం డ్రాప్ అవుట్స్: హెచ్‌హెచ్‌ఎఫ్ సర్వేలో వెల్లడి

**ప్రజాపక్షం/హైదరాబాద్:**పేద మైనారిటీ పిల్లలలో 27శాతం డ్రాప్ అవుట్స్ ఉన్నారని హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ (హెచ్ హెచ్ ఎఫ్) ప్రతినిధి ముజ్తబా హసన్ అస్కారీ తెలిపారు. నాలుగు శాతం పాఠశాల విద్యకు దూరంగా ఉన్నారన్నారు. జల్పల్లి మునిసిపల్ పరిధిలోని ఎర్రకుంటలో వలస కార్మికుల పిల్లల కోసం ఏర్పాటు చేసిన హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ఫ్రీ ప్రైమరీ కమ్ బ్రిడ్జ్ స్కూల్ను సీడ్ యూఎస్‌ఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సయ్యద్ మజారుద్దీన్ హుస్సేనీ లాంఛనంగా ప్రారంభించారు.



ఈ సందర్భంగా ముజ్తబా హసన్ అస్కారీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యను అభ్యసించేందుకు పిల్లల ను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో మురికివాడల్లో సర్వే నిర్వహించినట్లు తెలిపారు. ఈ సర్వేలో పేద మైనారిటీ పిల్లలలో 27 శాతం డ్రాప్ అవుట్స్ ఉన్నట్లు తేలిందన్నారు. నాలుగు శాతం మంది పాఠశాల విద్యకు దూరంగా ఉన్నారన్నారు. పట్టణ మురికివాడల్లోని 756 ప్రభుత్వ పాఠశాలలను మ్యాప్ చేశామన్నారు.15 పైగా ప్రధాన మురికివాడల్లోని బలహీన వర్గాల పిల్లల విద్యాస్థితిపై సర్వే చేశామన్నారు. డ్రాపౌట్ పిల్లల తల్లిదండ్రులలో దాదాపు 65 శాతం మంది మహారాష్ట్ర, కర్ణాటక, బీహార్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారు ఉన్నారన్నారు.

# డిజె మాటున డ్రగ్స్ విక్రయాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:**పబ్బుల్లో డిజె (డిస్కోజాకి) మాటున డ్రగ్స్ విక్రయిస్తున్న ఓ ముఠా గుట్టును ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రట్టు చేశా రు. ఈ క్రమంలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 15.13 గ్రాముల డ్రగ్స్ ఎండిఎంఎను స్వాధీనం చేసుకున్నారు. డిజె నిర్వహకుడు అఖిల్ బంజారాహిల్స్‌లోని పబ్బుల్లో డిజె నిర్వహిస్తునే డ్రగ్స్ విక్రయాలు చేపట్టాడు. ఈ మేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్ తన సిబ్బందితో కలిసి శుక్రవారం పబ్బుపై దాడి చేశారు. ఈ సందర్భంగా అఖీల్ వద్ద ఉన్న



2.65గ్రాముల ఎండిఎంఎ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ డ్రగ్స్ ఎక్కడి నుంచి తీసుక వచ్చావని ప్రశ్నించగా ఇబ్రహింపట్నంకు చెందిన సన్నీ అనే వ్యక్తి ఇచ్చాడని సమాచారం ఇచ్చాడు. ఈ సమాచారంతో ఇబ్రహింపట్నంలోని సన్నీ ఇంట్లో కూడా ఎక్సైజ్ అధికారులు సోదాలు నిర్వహించగా అతడి వద్ద 12.48 గ్రాముల ఎండిఎంఎ డ్రగ్స్ లభించాయి. ఒక గ్రాము ఎండిఎంఎను రూ. 5000 వేలకు అమ్మకాలు జరుపుతారని నిందితులు తెలిపారు. ఈ డ్రగ్స్‌ను బెంగుళూరుకు చెందిన అలెక్స్ తీసుకొని వస్తాడని సమాచారంతో అతన్ని కూడా అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు కలిసి ఈ డ్రగ్స్‌ను విక్రయిస్తుంటారు. వీరి వద్దనే 326 గ్రాముల గంజాయి కూడ లభ్యమయ్యింది. ఈ డ్రగ్స్ పట్టుకున్న వారిలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్‌తోపాటు అధికారులు లక్ష్మారెడ్డి, బాలరాజ్, యాదగిరి, మహేశ్వరరావు, అరుణ్, కృష్ణలు పాల్గొన్నారు. డ్రగ్స్‌ను పట్టుకున్న ఎన్‌ఫోర్స్‌మెం ట్ సిబ్బందిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్‌రెడ్డి అభినందించారు.

## ఆదిలాబాద్ సిసిఐ సిమెంట్ పరిశ్రమ ప్రైవేటీకరణ

# నిర్ణయం వెనక్కు తీసుకోవాలి

మూసివేసిన పిఎస్‌యుల భూములను వెనక్కు ఇవ్వాలి

కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డి కుమారస్వామికి తెలంగాణ ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విజ్ఞప్తి

**ప్రజాపక్షం / హైదరాబాద్:** ఖాయిలా పడిన ఆదిలాబాద్ సిసిఐ సిమెంటు పరిశ్రమను ప్రైవేటుపరం చేసే నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని, ఈ పరిశ్రమను పునరుద్ధరించి స్థానికంగా ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలని తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామిని కోరారు. దాదాపు 4 లక్షల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం ఉన్న ఈ సిమెంటు పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం 2100 ఎకరాల సున్నపు రాతి గనులతో పాటు మొత్తం 2290 ఎకరాల భూమిని ఉచితంగా అందజేసిందని మంత్రి శ్రీధర్‌బాబు గుర్తు చేసారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న మంత్రి శ్రీధర్‌బాబు శుక్రవారం కేంద్రమంత్రితో సమావేశమై పలు అంశాలను చర్చించారు. తెలంగాణాలో పరిశ్రమల ఏర్పాటుకు అత్యంత అనుకూల



పరిస్థితులు ఉన్నందున కొత్తగా ఏర్పాటు చేయనున్న పరిశ్రమలను రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని తెలిపారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో తెలంగాణ రాష్ట్రం ముందుందని, ఇక్కడ భూములు, నీరు, విద్యుత్తు అవసరాల మేరకు అందుబాటులో ఉన్నందున పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్రమంత్రిని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు కోరారు. రాష్ట్రంలో శిక్షణ పొందిన మానవ వనరులకు కొదవ లేదని, ఐటిఐ, డిప్లొమా, ఇంజనీరింగ్ స్థాయిల్లో స్కిల్ మ్యాన్ పవర్ సమృద్ధిగా ఉందని వెల్లడించారు. రాష్ట్రాన్ని సందర్శించి ఇక్కడి అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలన్న శ్రీధర్‌బాబు అభ్యర్థనకు కుమారస్వామి సానుకూలంగా స్పందించారు. త్వరలో హైదరాబాద్‌కు వచ్చి తన దృష్టికి తెచ్చిన అన్ని విషయాలపై అధికారులతో చర్చిస్తానని కేంద్రమంత్రి హామీ ఇచ్చారు.

**భూములు వెనక్కు ఇవ్వాలి :** కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ (పిఎస్‌యు)లకు రాష్ట్ర ప్రభుత్వం అప్పట్లో కేటాయించిన భూములను వెనక్కు తిరిగి ఇవ్వాలని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు కేంద్ర మంత్రిని కోరారు. ప్రభుత్వరంగ సంస్థలలో కేంద్రప్రభుత్వం పెట్టుబడుల ఉపసంహరణ కార్యక్రమం కింద విక్రయించాలని నిర్ణయించినందున వీటి మిగులు భూములను తిరిగి అప్పగించాలని శ్రీధర్‌బాబు అభ్యర్థించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 70 సంవత్సరాల్లో అనేక ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేయగా వాటికి అప్పట్లో వేలాది ఎకరాల భూములను కేటాయించిన విషయాన్ని మంత్రి శ్రీధర్‌బాబు గుర్తు చేశారు.

# రూ.10 లక్షలకు ఆదాయ పన్ను పరిమితి


కేంద్రమంత్రి నిర్మల సీతారామన్‌కు వినతిపత్రం అందజేసిన టిజిఒ, టిఎన్‌జిఒ ప్రతినిధులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉద్యోగ, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయ, పెన్షనర్స్, కార్మికులకు ఆదాయపన్ను పరిమితిని రెండున్నర లక్షల రూపాయల నుండి రూ.10 లక్షల వరకు పెంచాలని టిజిఒ, టిఎన్‌జివో ప్రతినిధి బృందం కేంద్ర ఆర్థికశాఖ మంత్రిని కోరింది. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఏలూరి శ్రీనివాస రావు, టిఎన్‌జిఒ అధ్యక్షుడు మారం జగదీశ్వర్ నేతృత్వంలో టిఎన్ జిఒ అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యా ల సత్యనారాయణగౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కె.లక్ష్మ ణ్ తదితరుల ప్రతినిధుల బృందం న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ ను ఆమె చాంబర్‌లో శుక్రవారం కలిసి విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆదాయపన్ను పరిమితి, కొత్తపెన్షన్‌తో వచ్చే సమస్యలు తదితర ఉద్యోగులకు చెందిన అంశాలను ప్రతినిధి బృందం కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లింది. ప్రస్తుత పన్ను విధానంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్లు దాదాపుగా మూడు నెలల వేతనాన్ని ఆదాయ పన్ను పరిధి కింద కోల్పోతున్నారని, తద్వారా తాజా పరిస్థితుల్లో అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని వివరించారు. వైద్య, విద్య ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో ఆదాయపన్ను పరిమితిని అదనంగా రూ.7.5 లక్షలకు పెంచాలని,అలాగే సేవింగ్ పరిమితిని ప్రస్తుతం ఉన్న రూ.1.5లక్షల నంచి రూ. 4లక్షల వరకు పెంచాలని విజ్ఞాప్తి చేశారు. హౌసింగ్ రుణాలపైన వడ్డీని రూ.4.50 లక్షలకు పెంచాలని,మెడికల్ ఇన్సూరెన్స్ కు సంబంధించి రూ. 25 వేల పరిమితిని రూ. 50 వేలకు పెంచాలని కోరారు.

దేశవ్యాప్తంగా పనిచేస్తున్న ఉద్యోగులు 2004 నుండి నూతన పెన్షన్ విధానంలోకి మార్చారని, వివిధ రాష్ట్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరిని కూడా పాత పెన్షన్ విధానంలోనికి తీసుకురావాలని కోరారు. ఇప్పటివరకు ఉద్యోగులు తమ పెన్షన్ ఫండ్‌లో జమ చేసిన మొత్తాలను కూడా ఉద్యోగుల ఖాతాలో వేస్తూ, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని వారు కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్‌ను కోరారు.

**కమిటీ నివేదిక చూసిన తర్వాతే 'సిపిఎస్' రద్దుకు చర్య లు**

సిపిఎస్‌ను రద్దుచేసే అంశంలో కేంద్ర పరిధిలో



ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక వచ్చిన తర్వాత, వాటిని పరిశీలించి,సిపిఎస్ విధానాన్ని రద్దు చేసేందుకు చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ చెప్పినట్టు ఏలూరి శ్రీనివాసరావు, మారం జగదీశ్వర్ తెలిపారు.

ఆదాయ పన్ను పరిధి పరిమితి అంశంలో తప్పకుండా మోడీ ప్రభుత్వం వేతన జీవులను ఆదుకునే పద్ధతిలోనే అతి త్వరలో కొత్త విధానాన్ని తీసుకొస్తామని , ఎవ్వరూ ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని కేంద్ర మంత్రి హామీనిచ్చారని, అందుకు వారు హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో టిజివో నాయకులు రామారావు, నరహరి తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలికి బోర్డు

బొగ్గు గనులను సింగరేణి సంస్థకే అప్పగించాలి: ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి బోర్డును వెంటనే నియమించాలని తెలంగాణ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గత కొన్ని నెలలుగా క్లెయిమ్స్ ను పరిష్కరించి, పరిహారాన్ని అందించాలని, బొగ్గు గనులను సింగరేణి సంస్థకే అప్పగించాలనితెలిపింది. హైదరాబాద్, హిమాయత్‌నగర్, ఎస్. ఎన్.రెడ్డి భవన్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో గన్నారపు రమేష్ అధ్యక్షతన తెలంగాణ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆఫీసు బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్‌రాజ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం కార్మిక చట్టాల్లో మార్పులను తీసుకొస్తూ, ప్రభుత్వరంగ సంస్థల ను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. కార్పొరేట్ పెట్టుబడుదారులకు అనుకూల విధానాలతో కార్మిక హక్కులను కాలరాస్తుందని ధ్వజమెత్తారు.



అసంఘటితరంగంలో పనిచేస్తున్న లక్షలాదిమంది కార్మికులకు సమగ్ర సంక్షేమంలో భాగంగా ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నిధులను కార్మికుల సంక్షేమానికే ఖర్చు పెట్టాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ గౌరవాధ్యక్షులు ఉజ్జిని రత్నాకర్‌రావు మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను త్వరితగతిన పరిష్కరించి, తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు. గత ప్రభుత్వంలో సంక్షేమ బోర్డు, పాలకమండలి లేకుండా బోర్డు నిధులను అక్రమంగా ఇతర పథకాలకు దారిమళ్ళించారని విమర్శించారు. గత కొన్ని మాసాలుగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల నష్ట పరిహారాన్ని తక్షణమే అందించాలని, నిర్మాణ పనుల నుండి సెస్సు వసూలు చేసి కార్మికుల సంక్షేమానికి ఉపయోగించాలని సూచించారు. రాష్ట్రంలో లక్షలాదిమంది కార్మికులను సంక్షేమ మండలిలో సభ్యులుగా నమోదు చేయాలని, వలస కార్మికులకు రక్షణ కల్పించాలని, కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో డిసిఎల్, ఎసిఎలను నియమించాలని, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్‌ను ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఆన్‌లైన్ ద్వారా తలెత్తుతున్న ఇబ్బందులను కార్మిక శాఖ అధికారులు తొలగించి, వాటిని పరిష్కరించాలని కోరారు. నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జులై జరగను న్న శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆందోళనలు నిర్వహించాలని సూచించారు. వెల్ఫేర్ బోర్డును ఒక పథకం ప్రకారం నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.ప్రవీణ్ కుమార్, కోశాధికారి జి.పరమేష్, ఉప ప్రధాన కార్యదర్శి గాదె లక్ష్మి నారాయణ, ఉపాధ్యక్షులు ఆకుల శ్రీను, కార్యదర్శులు గాజంగుల రాజు, కె.మల్లేష్, నూనె వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ ఆదాయం పెంపు యోచనలో ప్రభుత్వం

సంక్షేమ పథకాల కోసం తప్పని పరిస్థితి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎక్సైజ్‌శాఖ ద్వారా ప్రస్తుతం ప్రభుత్వానికి ఏటా వస్తున్న రూ.36 వేల కోట్ల ఆదాయాన్ని రూ.50 వేల కోట్లకు పెంచే యోచనలో ప్రభుత్వం ఆలోచనలు చేస్తున్నట్లు తెలిసింది. ఇందుకోసం ప్రభుత్వం పావులు కదుపుతున్నట్లు సమాచారం. మద్యం ధరలను పెంచడంతో పాటు అమ్మకాలను సైతం పెంచేందుకు కావాల్సిన కారచరణపై ఎక్సైజ్ శాఖలో కసరత్తు జరుగుతున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మెనిఫెస్టోలో పేర్కొ న్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రాష్ట్ర ఆదాయం పెరగాల్సి ఉంది. ఇందుకోసం ప్రభుత్వ శాఖలలో ఆదాయ మార్గాలపై అన్వేషణ కొనసాగుతుంది. రెవెన్యూ శాఖకు సంబంధించి ఒకపక్క భూముల విలువల ధరలను పెంచడంతో పాటు రిజిస్ట్రేషన్ ఫీజులు కూడా పెంచాలని ప్రభుత్వం భావిస్తుంది. ఈ క్రమంలోనే ఎక్సైజ్ శాఖ నుంచి వచ్చే ఆదాయాన్ని కూడా పెంచాలనే యోచనలో ఉందని తెలిసింది.ఇందుకోసం సమర్థవంతమైన అధికారిని ఎరికోరి ఎక్సైజ్ శాఖకు బదిలీ చేశారనే వాదన వినిపిస్తుంది. ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శిగా విధు లు నిర్వహిస్తున్న ఐఎఎస్ అధికారి సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీని ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శిగా నాలుగు రోజుల క్రితమే బదిలీ అయిన విషయం తెలిసిందే. బాధ్యతలు చేపట్టిన మరుసటి రోజే రిజ్వీ నాంపల్లిలోని అబ్కారి భవన్‌ను సందర్శించి ఎక్సైజ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించా రు. తాను నూతనంగా ఎక్సైజ్ శాఖకు బదిలీ కావడంతో ఆ శాఖ పనివిధానం తెలుసుకునేందుకే సమావేశం నిర్వహించాన ని రిజ్వీ చెబుతుండగా మరో పక్క ఎక్సై జ్ శాఖ ఆదాయ మార్గాలపై కూడా చర్చించినట్లు సమాచారం. మద్యం ధరలను ఎంత వరకు పెంచాలి, అలాగే మద్యం తయారి కంపెనీలు ఎప్పటి నుంచే ధరలు పెంచాలని డిమాండ్ చేయడం, వైన్ షాప్‌ల కమీషన్ తదితర అంశాలపై అధికారులు పరిగణలోకి తీసుకోని తర్జనబర్జన పడుతున్నట్లు తెలిసింది. తెలంగాణ ప్రభుత్వానికి మొత్తం 51 కంపెనీల నుంచి లిక్కర్ సరఫరా కొనసాగుతుండగా ఇందులో 20 కంపెనీలు స్థానికంగా ఉండగా ఇతర రాష్ట్రాలలో 31 కంపెనీలు ఉన్నాయి. ఇక బీరు సరఫరా చేసే కంపెనీలో మొత్తం 13 ఉండగా ఇందులో ఆరు స్థానికం కాగా ఏడు కంపెనీలు ఇతర రాష్ట్రాలలో ఉన్నాయి. ఇక విదేశీ మద్యం సరఫరా చేసే మొత్తం కంపెనీలు 27 కాగా ఇవన్ని కూడా ఇతర రాష్ట్రాలలో ఉన్నవే. లిక్కర్‌లో మొత్తం 779 మద్యం బ్రాండ్‌లు ఉండగా బీర్‌కు సంబంధించి 86 మద్యం బ్రాండ్‌లు ఉన్నాయి.

ఇక విదేశీ మద్యం బ్రాండ్‌లు 1091 వర కు ఉన్నాయి. ఈ అన్ని బ్రాండ్‌లలో ఏ ఏ బ్రాండ్‌లకు అమ్మ కాలలో డిమాండ్ ఉందో వాటిపై ధరలను పెంచే అవకాశాలు ఉన్నాయి. వినియోగదారులపై 15 శాతం నుంచి 20 శాతం వరకు పెంచే అవకాశాలపై అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఏదిఏమైనా స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే ఈ ధరలను నిర్ణయించే అవకాశాలు ఉన్నాయి. మద్యం అమ్మకాలు పెంచి ప్రభుత్వానికి ఆదాయం పెంచాలంటే నాటుసారా, గంజా యి, డ్రగ్స్, తదితర మత్తు పదార్థాల అక్రమ రవాణా, అమ్మకాలను అరికట్టాల్సి ఉంది. వీటిపై ముమ్మర దాడులు చేసేందుకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇప్పటికే దృష్టి సారించి అన్ని జిల్లాలలో నిఘా పెట్టింది. రెండు నెలల్లో వీటిని పూర్తిగా రూపుమాపుతామని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

**మూడేళ్ల నుంచి లిక్కర్ అమ్మకాలు ఇలా...**

| | |
|---|---|
| 2022–23లో | 351.81 లక్షల పెట్టెలు |
| 2023–24లో | 362.85 లక్షల పెట్టెలు |
| 2024–25 (మే వరకు) | 80.68 లక్షల పెట్టెలు |
| మూడింటి లిక్కర్ అమ్మకాలు | రూ.35145.06 కోట్లు |

**మూడేళ్ల నుంచి బీరు అమ్మకాల వివరాలు...**

| | |
|---|---|
| 2022–23 | 478.73 లక్షల పెట్టెలు |
| 2023–24 | 548.00 లక్షల పెట్టెలు |
| 2024–25మే వరకు | 131.66 లక్షల పెట్టెలు |
| అమ్మకాల విలువ | రూ.3649.07 కోట్లు |

తెలంగాణ ప్రభుత్వం
**రోడ్లు & భవనాల శాఖ**
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
NIT No. DB/HD/e-procurement-NIT-02/2024-25, తేది:24.06.2024 ప్రకారం వరంగల్ జిల్లాలో 03 పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారం నుండి ఆన్‌లైన్ టెండర్లను ఆహ్వానించడమైనది. టెండరుదారులకు టెండర్ షెడ్యూళ్లను తేది: 01.07.2024న మ.3.00గం.ల నుండి www.eprocurement.gov.inలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆఖరి తేది: 08.07.2024. మరిన్ని వివరాలకు www.eprocurement.gov.inలో చూడవచ్చు.
సం/- జిల్లా (R&B) అధికారి, (ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్) వరంగల్ జిల్లా.
DIPR R.O. No.: 196-DP/CL/ADVT/1/2024-25 Date: 28-06-2024



# ప్రజలు బిజెపికి మెజారిటీ తగ్గించినా మోదీ వ్యవహారశైలిలో మార్పురాలేదు

టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్

**ప్రజాపక్షం / హైదరాబాద్:** ఎన్నికలలో మోదీకి ప్రజలు పూర్తి మెజారిటి ఇవ్వనందున ఆయన వ్యవహారశైలిలో మార్పు వస్తుందని ఆశించినవారికి నిరాశనే మిగిలిందని, ఆయనలో ఎలాంటి మార్పు రాలేదని టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు జి.నిరంజన్ విమర్శించారు. ప్రతిపక్షాలకు లోకసభలో డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చి అందరినీ కలుపుకుని పోతారని ఆశిస్తే అది కూడా నిష్ఫలమైందన్నారు. లోకసభ స్పీకర్ ఎన్నిక జరిగిన మొదటి రోజుననే స్పీకర్ ఓం బిర్లా ద్వారా ఎమర్జెన్సీపై తీర్మానం చదివించడం, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంట్‌లో చేసిన ప్రసంగంలో కూడా ఎమర్జెన్సీ ప్రస్తావన చొప్పించి కాంగ్రెస్‌ను టార్గెట్ చేసే ప్రయత్నం చేయడం దురదృష్టకరమన్నారు.

ఎమర్జెన్సీ తరువాత 1977లో జరిగిన ఎన్నికలలో ఇందిరా గాంధీ ఓడిపోయినా, తిరిగి 1980లో జరిగిన ఎన్నికలలో గెలిచి ప్రధానమంత్రి అయిన విషయం మాత్రం వారి నోటి వెంట రాకపోవడం శోచనీయమన్నారు. పార్లమెంట్‌లో రాష్ట్రపతిని స్వాగతించే సమయంలో రాజముద్రను ముందుగానే వుంచి స్వాగతించడం రాచరిక వ్యవస్థకు నిదర్శనమన్నారు.

బ్రిటిష్ వారిది రాచరిక వ్యవస్థ కాబట్టి అది వారికి చెల్లునేమో కానీ, ప్రజాస్వామ్య భారత దేశ వ్యవస్థలో ఈ సంప్రదాయం అనుసరించడం శోచనీయమన్నా రు. రాష్ట్రపతి ప్రసంగంలో కూడా నీట్ బాధితులైన విద్యార్థులకు స్వాంతన కలిగే చర్యలేవీ లేదని, 24 లక్షల మంది విద్యార్థులు తమ భవిష్యత్‌పై ఆందోళనతో అల్లాడుతుంటే ప్రధాని నోరు మెదపకపోవడం ఆయనకే చెల్లుతుందని నిరంజన్ విమర్శించారు.

తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (భూసేకరణ) శాఖ
ఫారం-6
(చూడుము రూల్ 19 యొక్క సబ్ రూల్ -1 మరియు చట్టం-30/2013 లోని సెక్షన్ 11(1))
ప్రాథమిక ప్రకటన

G1/3888/2024 తేది:15.06.2024
ఫైల్ నెం: డి/256/2024 తేది:14.06.2024

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, నల్లగొండ గారి ఆదేశానుసారం నల్లగొండ జిల్లా, నల్లగొండ మండలం మర్రిగూడ గ్రామంలో భూమి విస్తీర్ణం **4039 చ.గ..** భూమి ప్రజాప్రయోజనార్థం మర్రిగూడ-చర్లపల్లి జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం కొరకు ఈ దిగువ చూపిన భూమి అవసరం ఉన్నదని భావించినందున, భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం- 2013 లోని సెక్షన్ 11(1) అనుసరించి ప్రకటన జారీచేయనైనది.

తెలంగాణ ప్రభుత్వం, భూసేకరణలో సముచిత పరిహారం పొందే హక్కు మరియు పారదర్శకత, పునరావాసం మరియు పునర్ ఉపాధికల్పన చట్టం, 2013 (చట్టం నెం. 30 ఆఫ్ 2013) లోని అధ్యాయము II & III నిబంధనలు మినహాయిస్తూ, తెలంగాణ ప్రభుత్వం జి.ఓ.యం.యస్. నెం.12 రవాణా, రోడ్లు & భవనముల (ఆర్.II) శాఖ తేది.15.03.2024 జారీ చేసింది.

కావున, ఈ ప్రాజెక్టు క్రింద నల్లగొండ జిల్లా, నల్లగొండ మండలం, మర్రిగూడ గ్రామములో **విస్తీర్ణం 4039 చ.గ.** గల భూమి ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీచేయనైనది.

గ్రామం: మర్రిగూడ మండలం: నల్లగొండ జిల్లా: నల్లగొండ

| క్ర. సం. | [illegible] | [illegible] | [illegible] | [illegible] | భూమిని కోల్పోయే హక్కుదారు / ఆసక్తిదారు / రైతు పేరు | నిర్మాణాలు |
|---|---|---|---|---|---|---|
| 1 | 30/2 | పట్టా | తరి | 54 | తెలియదు | |
| 2 | 30/2 | పట్టా | తరి | 67 | మందడి అనిత భర్త ముత్తిరెడ్డి | |
| 3 | 30/2 | పట్టా | తరి | 101 | మందడి అనిత భర్త ముత్తిరెడ్డి | |
| | ఉప మొత్తం | | | 222 | | |
| 4 | 83/2 | పట్టా | తరి | 32 | మందడి అనిత భర్త ముత్తిరెడ్డి | |
| 5 | 83/2 | పట్టా | తరి | 200 | దయాసాగర్ రెడ్డి | |
| 6 | 83/2 | పట్టా | తరి | 33 | పాదూరి శిరీష భర్త శ్రీకాంత్ రెడ్డి | |
| 7 | 83/2 | పట్టా | తరి | 67 | లింగాల ధర్మేందర్ రెడ్డి తండ్రి జోగా | |
| 8 | 83/2 | పట్టా | తరి | 55 | రోడ్డు | |
| 9 | 83/2 | పట్టా | తరి | 100 | పుల్లా గోవర్ధన్‌రెడ్డి తండ్రి నారాయణరెడ్డి | |
| 10 | 83/2 | పట్టా | తరి | 67 | పటేల్ సునీత | |
| 11 | 83/2 | పట్టా | తరి | 33 | గుర్రం సువర్ణ | |
| 12 | 83/2 | పట్టా | తరి | 100 | మందడి మాధవ రెడ్డి | |
| 13 | 83/2 | పట్టా | తరి | 200 | మందడి జానారెడ్డి | |
| 14 | 83/2 | పట్టా | తరి | 117 | మూరుపాక అంజయ్య తండ్రి లచ్చయ్య | |
| 15 | 83/2 | పట్టా | తరి | 67 | మహేందర్ | |
| 16 | 83/2 | పట్టా | తరి | 67 | మణిగారడి సుధాకర్ శెట్టి తండ్రి మజయ్యశెట్టి | |
| 17 | 83/2 | పట్టా | తరి | 83 | పి. భరత్ కుమార్ తండ్రి శంకర్ | |
| 18 | 83/2 | పట్టా | తరి | 58 | అంజయ్య | |
| | ఉప మొత్తం | | | 1279 | | |
| 19 | 84/3 | పట్టా | ఖుష్కి | 529 | సోమగాని ఆదిత్య సామ్రాట్ తండ్రి శంకర్ గౌడ్ | |
| 20 | 84/3 | పట్టా | ఖుష్కి | 82 | సోమగాని ఆదిత్య సామ్రాట్ తండ్రి శంకర్ గౌడ్ | ఏసిసి షీట్ రూమ్ (మడిగా) |
| 21 | 84/3 | పట్టా | ఖుష్కి | 267 | బొబ్బల శశిరేఖ భర్త భాస్కర్ రెడ్డి | మడిగా |
| 22 | 84/3 | పట్టా | ఖుష్కి | 122 | మందడి వెంకట్ రెడ్డి తండ్రి భగవంత రెడ్డి | ఆర్.సి.సి. & ఏ సి సి షీట్ రూమ్ |
| 23 | 84/3 | పట్టా | ఖుష్కి | 41 | రోడ్డు | |
| 24 | 84/3 | పట్టా | ఖుష్కి | 249 | నాంపల్లి మనోహర్ తండ్రి రామనర్సయ్య | ఆర్.సి.సి. షట్టర్స్ |
| 25 | 84/3 | పట్టా | ఖుష్కి | 106 | వి.ఆదిరెడ్డి తండ్రి రామ్‌రెడ్డి | |
| 26 | 84/3 | పట్టా | ఖుష్కి | 105 | ఇదుకుల మంజుల భర్త పద్మాకర్ | జి.ఇ.రూఫ్ షట్టర్స్ |
| 27 | 84/3 | పట్టా | ఖుష్కి | 161 | ప్లాట్ నెం.17, 18, 19 | |
| 28 | 84/3 | పట్టా | ఖుష్కి | 68 | ప్లాట్ నెం.15, 16 | |
| 29 | 84/3 | పట్టా | ఖుష్కి | 359 | ప్లాట్ నెం. 2 నుండి 14 వరకు | ప్లాట్ నెం. 13 మరియు 14, ఏ.సి.సి షీట్ షట్టర్స్ |
| 30 | 84/3 | పట్టా | ఖుష్కి | 62 | అతేం రాజేశ్వరి భర్త భిక్షం | ఆర్.సి.సి. |
| 31 | 84/3 | పట్టా | ఖుష్కి | 147 | పిట్టంపల్లి రోడ్ | |
| | ఉప మొత్తం | | | 2294 | | |
| 32 | 86/3 | పట్టా | ఖుష్కి | 120 | మేక లలిత భర్త వెంకట్ రెడ్డి మరియు యెల్లండి నందిని భర్త నర్సిరెడ్డి | |
| 33 | 86/3 | పట్టా | ఖుష్కి | 120 | గట్టు నర్సిరెడ్డి తండ్రి పుల్లారెడ్డి | |
| | ఉప మొత్తం | | | 240 | | |
| | వెరసి మొత్తం | | | 4039 | | |

ఇట్టి నోటిఫికేషన్ భూసేకరణ, భూనిర్వాసితుల పునరావాసం మరియు పునరుద్ధరణ చట్టం, 2013 (నెం.30/2013 లోని నియమములోని సెక్షన్ 11(1) ప్రకారం సంబంధిత భూ యజమానులకు సరియైన భూ నష్టపరిహారం చెల్లించుటకు గాను నోటిఫికేషన్ జారీచేయనైనది.

భూమి యొక్క ప్లాను మరియు వివరములు జిల్లా కలెక్టర్, నల్లగొండ మరియు భూసేకరణ అధికారి మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి, నల్లగొండ, తహశీల్దార్, నల్లగొండ గారి కార్యాలయములలో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా కార్యాలయము పనిదినములలో మరియు పని వేళలలో తనిఖీ చేసుకోవచ్చు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, నల్లగొండ గారు రెవెన్యూ డివిజనల్ అధికారి, నల్లగొండ గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించి సెక్షన్ 12 ప్రకారం పైన చూపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే, భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టటానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణ కొరకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, నల్లగొండ గారి ముందస్తు అనుమతి లేకుండా, ప్రాథమిక ప్రకటన జారీచేసిన తేదీ నుండి ఆ ప్రకటనలో ఉదహరింపబడిన భూములకు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకాలు, తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు.

భూసేకరణ విషయములో సంబంధించిన భూ యాజమానులు ఏదైనా అభ్యంతరములున్న యెడల చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం జిల్లా కలెక్టర్, నల్లగొండ గారికి లిఖిత పూర్వకముగా ప్రకటన జారీ చేసిన 60 (అరవై) దినముల లోపల తెలియజేయవలసి ఉన్నది.

సం/- రెవెన్యూ డివిజనల్ అధికారి & భూసేకరణ అధికారి, నల్లగొండ
సం/- అదనపు జిల్లా కలెక్టర్ (రెవెన్యూ) నల్లగొండ
సం/- జిల్లా కలెక్టర్ నల్లగొండ

DIPR RO NO. 88/LA/PP/Advt/Pub/2024-25

ప్రజాపక్షం
శనివారం, జూన్ 29

# తాండవిస్తున్న ద్వేషం

"భారతదేశంలో మతమార్పిడి వ్యతిరేక చట్టాలు, ద్వేషపూరిత ప్రసంగాలు, మైనారిటీ సముదాయాల నివాసగృహాలు, ఆరాధనా ప్రదేశాల కూల్చివేత ఆందోళన కరంగా పెరుగుతున్నాయి'. ఈ మాట అన్నది ఏ మోదీ విరోధియో, బిజెపి ప్రభుత్వ వ్యతిరేకో కాదు. నరేంద్రమోదీ ప్రభుత్వంతో చెట్టాపట్టాలు వేసుకునేని తిరిగే, ప్రశంసలు గుప్పిస్తూ దాన్ని తమ వ్యూహంల్లో బిగించే స్నేహబంధం నెరపుతున్న అమెరికా ప్రభుత్వ విదేశాంగ శాఖ కార్యదర్శి (మన పరిభాషలో మంత్రి) ఆంటోనీ బ్లింకెన్. మత స్వేచ్ఛపై అంతర్జాతీయ వార్షిక నివేదికను వాషింగ్టన్‌లో బుధవారం విడుదల చేసినప్పుడు ఆయన నరేంద్రమోదీ ప్రభుత్వానికి కర్ణకఠోరమైనవి వ్యాఖ్య చేశారు. అంతర్జాతీయ మత స్వేచ్ఛపై వారి విదేశాంగ శాఖ వార్షిక నివేదిక విడుదల చేస్తూ ఉంటుంది. దళసరి చర్మం గల ప్రభుత్వాలు తమపై విమర్శలను ఈ చెవితో విని అవతలి చెవితో వదిలేస్తుంటాయి. మనది పెద్ద దేశం కాబట్టి నోరుతెరచి దాన్ని తిరస్కరిస్తూ ఉంటుంది. అప్పుడప్పుడు కొన్ని ప్రతి విమర్శలు చేస్తుంది.

భిన్న మతాలు, కులాలు, ఆచార వ్యవహారాలతో కూడిన మనదేశంలోని భిన్నత్వాన్ని గౌరవిస్తూ మన రాజ్యాంగం పౌరులకు తమకు నచ్చిన మతంలో చేరే, దాన్ని ప్రచారం చేసే హక్కు ఇచ్చింది. దేశ సమగ్రత, భిన్నత్వంలో ఏకత్వాన్ని రక్షణ కల్పిస్తూ సెక్యులరిజాన్ని(లౌకికత) హామీ ఇచ్చింది. మనదేశంలో అనేక వందల సంవత్సరాల పాటు హిందూ రాజులతో పాటు మొగలాయిలు,ముస్లింరాజులు, బ్రిటీష్‌వారు తదితరులు పరిపాలించి నందున ఇది అనేక మతాలకు సంగమ క్షేత్రమైంది. ఈ నేలపై జన్మించిన బౌద్ధం పొరుగు రాజ్యాలకు తరిమివేయబడింది. సిక్కుమతం ఇక్కడే ఆవిర్భావం చెంది వర్ధిల్లుతున్నది. ఈ లౌకికతత్వానికి, ఈ దేశాన్ని హిందూ జాతి దేశంగా మార్చాలని ప్రయత్నిస్తున్న శక్తులకు సంఘర్షణ అనంతంగా జరుగుతోంది. దేశంలో లౌకికవ్యవస్థకు నిబద్ధమైన ప్రభుత్వం ఉన్నప్పుడు హిందూత్వశక్తులు పెచ్చరిల్లినా చాలా మేరకు మత సామరస్యం ఉంటుంది. అయితే గత 10 సంవత్సరాలుగా పచ్చి హిందూత్వ శక్తులు అధికారంలో ఉన్నందున మైనారిటీలపై దాడులు, అణచివేత, ప్రార్ధనాలయాలపై దాడులు పెరిగాయి. మైనారిటీలు అభద్రతలో ఉన్నారు. అనేక రాష్ట్రాల్లో ఆహారం, దుస్తులు, వృత్తులపై ఆంక్షలు, హత్యలు చూస్తున్నాం. దాదాపు 10 రాష్ట్రాలు మత మార్పిడి వ్యతిరేక చట్టాలు చేశాయి. గోరక్షణ పేరుతో హింస పెరిగింది. 'లవ్ జిహాద్' అంటూ యువతీ యువకుల వైవాహిక జీవిత స్వేచ్ఛపై దాడి జరుగుతోంది. బిజెపి ప్రభుత్వాలున్న రాష్ట్రాల్లోనే ఈ హింస హెచ్చుగా ఉంది. ఇది నిరాకరించలేని వాస్తవం. ఉమ్మడి పౌరస్మృతి తమ తదుపరి ఎజెండా అంటున్న బిజెపి ఉద్దేశం హిందూ పౌరస్మృతి, అగ్రవర్ణ, ఆచార వ్యవహారాలను అన్యమతాలపై విధించటమే. దీన్ని ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు, గిరిజన నాయకులు వ్యతిరేకిస్తున్నారు. మొన్నటి ఎన్నికల్లో గనుక బిజెపికి అది కోరుకున్న370 సీట్లు వచ్చివుంటే పార్లమెంటు ఈ తొలి సమావేశంలోనే ఉమ్మడి పౌరస్మృతి బిల్లు వచ్చి ఉండేది. ఓటర్లు కర్ర కాల్చి వాత పెట్టినట్లు బిజెపిని మైనారిటీలోకి నెట్టటంతో మోదీ సంకీర్ణ ప్రభుత్వం మొన్న పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగంలో ఆ విషయం ప్రస్తావన కూడా చేయలేకపోయింది. కాగా, బ్లింకెన్ తమ ప్రసంగంలో ఇండియాలోనే కాదు, అనేక దేశాల్లో వ్యక్తులపై దాడులు, ప్రార్థనాప్రదేశాల మూసివేత పెరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మత సముదాయాలను ఉన్న చోట్ల నుండి బలవంతంగా తొలగిస్తున్నారని, మత విశ్వాసాల కారణంగా జైల్లో పెడుతున్నారని అన్నారు. గాజా యుద్ధం మొదలయ్యాక అమెరికాలో కూడా యూదులు, ముస్లింలపై దాడులు పెరిగాయని అంగీకరించారు. భారతదేశంలో 2023లో మతమార్పిడి నిరోధక చట్టాల కింద క్రైస్తవులు, ముస్లింలను అరెస్టు చేశారని, కొన్ని సందర్భాల్లో మత మైనారిటీలను వేధించటానికి చట్టాలను దుర్వినియోగం చేస్తున్నారని కూడా అన్నారు.

అంతర్జాతీయ మత స్వేచ్ఛపై అమెరికా రాయబారి రషద్ హుస్సేన్ మాట్లాడుతూ, భారత్‌లో బలవంతపు మత మార్పిడి ఆరోపణలతో గుంపులు ప్రార్థనా స్థలాలపై దాడి చేసినప్పుడు పోలీసులు వారికి దన్నుగా నిలబడ్డారని, కొన్ని చోట్ల బాధితుల్నే అరెస్టు చేశారని క్రైస్తవ సముదాయాలు ఫిర్యాదు చేశాయన్నారు. ఇటువంటి ఆరోపణలు ప్రతివార్షిక నివేదికలో ఉంటున్నాయి. అయినా ప్రభుత్వం చెవికెక్కించుకోదు, అమెరికా ప్రభుత్వం కనీసం హెచ్చరికలు కూడా చేయదు. దోస్త్‌లో కుస్తీ అంటే ఇదే!

# కేరళ 'కేరళం'గా మారుతుందా?




'కేరళ' రాష్ట్రం పేరును 'కేరళం'గా మార్చాలని అక్కడి వాసన సభ తీర్మాన్ని ఆమోదించింది. ఈ నిర్ణయాన్ని కేంద్రానికి పంపింది. ఇప్పుడు పార్లమెంటు ఈ తీర్మానంపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. మళయాళ ఉచ్చరణలో సమలేఖ నాన్ని చేర్చి సంపూర్ణత్వాన్ని చేకూర్చినట్టు కేరళ తన తీర్మానంలో పేర్కొంది. భారత రాజ్యాంగం లోని 3వ అధికరణ కింద, ఒక రాష్ట్రం పేరు ను మార్చే అధికారం పార్లమెంటుకు ఇచ్చింది. ఒక రాష్ట్రానికి సంబంధించిన సరహద్దులు, పేరు మార్చ డానికి రాజ్యాంగం ఒక స్పష్టమైన విధానాన్ని ఖరారు చేసింది. పేరు మార్చే ప్రక్రియను పార్లమెంటు లేదా సంబంధిత రాష్ట్ర అసెంబ్లీ ప్రారంభించవచ్చు. కేంద్రం ప్రతిపాదిస్తే, రాష్ట్రాల అమోదం అవసరం లేదు. కానీ, సహజంగా రాష్ట్రాలే అసెంబ్లీలలో తీర్మానాలు చేసి పార్ల మెంటుకు పంపుతాయి. ఆ ప్రతిపాదనను పార్లమెంటు ఆమోదానికి ప్రవేశపెడతారు. ఏదైనా అసాధారణ పరిస్థితుల్లో తప్ప, పార్లమెంటు ఇలాంటి ప్రతిపాదనలకు ఆమోద ముద్ర వేస్తుంది. అయితే, అంతకు ముందే రైల్వే మంత్రిత్వ శాఖ, ఇంటెలిజెన్స్ బ్యూరో, పోస్టల్ శాఖ, సర్వే ఆఫ్ ఇండియా, రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా వంటి ఏజెన్సీల నుంచి 'నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్' (ఎన్‌ఒసి) అవసరం. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈ ఏజెన్సీల నుంచి ఎన్‌ఒసిని పొందిన తర్వాత, తన అనుమతిస్తుంది. ఆ తర్వాత బిల్లు పార్లమెంటులో ఆమోదానికి వెళుతుంది.

# కేంద్రపాలిత ప్రాంతమే పరిష్కారమా?



మణిపూర్‌లో ఆందోళనలు, హింసకు ఇంకా తెరపడలేదు. కుకీజో గిరిజనులు ఎక్కువగా ఉన్న కొండ జిల్లాలను కేంద్ర పాలిత ప్రాంతం (యుటి)గా ప్రకటించాలన్న డిమాండ్ ఇటీవల కాలంలో జోరందుకుంది. మణిపూర్‌లోని అతిపెద్ద జాతి సమూహాల్లో కుకీలది మూడో స్థానం. రాష్ట్ర జనాభాలో వారు 16 శాతం మంది ఉన్నారు. దక్షిణ కొండ ప్రాతాల్లో నివసించే థాడౌ, గాంగ్టే, హమార్, పైట్, సిమ్టే తెగలు కూడా ఉన్నాయి. నాగా తెగల మాదిరిగానే ప్రతి కుకీ సమాజం దాని సొంత భాషను కలిగి ఉంది. చాలా మంది క్రైస్తవ మతాన్ని స్వీకరించారు. అప్పట్లో బ్రిటిష్ వలస రాజ్యం లో మిషనరీల ప్రభావంతో క్రిస్టియానిటీ పుచ్చుకున్న వారు, ఇప్పటికీ అందులోనే కొనసాగు తున్నారు. అయితే, కొన్ని కుకీ సమూహాలు స్థానిక మతాలకు కట్టుబడి ఉన్నాయి. మణిపూర్‌లో లోయ, కొండ ప్రాంతాల్లో వేరువేరు పరిస్థితులు కనిపిస్తాయి. కొండ ప్రాంతాల్లో అత్యధిక శాతం గిరిజనులే ఉండగా, ఇంఫాల్ మైదానంలో మైతీల ఆధిపత్యం కొనసాగుతున్నది. రాష్ట్రంలో కేవ లం 10 శాతంగా ఉన్న ఈ మైదాన ప్రాంతంలోనే 90 శాతం మంది నివసిస్తు న్నారు. మైతీలకు గిరిజనులుగా గుర్తింపు లేకపోవడంతో, వారు కొండ ప్రాంతాల్లో ఆస్తులు కొనడానికి అర్హతను కోల్పోయారు. దీనితో తమను గిరిజన జాబితాలో కలపాలని మైతీలు ఎంతోకాలంగా డిమాండ్ చేస్తున్నారు. 40 స్థానాలున్న మణిపూర్ అసెంబ్లీలో 60 శాతం మంది మైతీలే కావడంతో, రిజర్వేషన్ బిల్లుకు సులభంగానే ఆమోద ముద్ర లభించింది. అయితే, ఈ నిర్ణయాన్ని కుకీ, నాగా వంటి గిరిజన జాతులు వ్యతిరేకించడంతో సమస్య మణిపూర్ హైకోర్టుకు చేరింది. అక్కడ మైతీలకు అనుకూలంగా తీర్పు వచ్చింది. అసెంబ్లీ తీర్మానాన్ని రద్దు చేయడానికి నిరాకరించిన మణిపూర్ హైకోర్టు, మైతీలను గిరిజన జాబితాలో చేర్చాలని సూచిస్తూ, కేంద్రానికి నోట్ పంపింది. ఈ తీర్పుకు అనుకూలంగా మైతీలు సంబరాలు చేసుకోగా, వ్యతిరేకంగా గిరిజనులు ఆందోళనలు చేపట్టారు. పలు ప్రాంతాల్లో ఈ నిరసనలు హింసకు దారి తీస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో, ఇటీవల సమావేశమైన కుకీ సమూహం, తమ ప్రాంతాన్ని యుటిగా ప్రకటించాలని కోరుతూ కేంద్రానికి ప్రతిపాద పంపింది. దీనిపై ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుందో చూడాలి.

# ప్రమాదంలో విద్యారంగం

## 'ప్రజాపక్షం'తో ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి దినేష్ శ్రీరంగరాజన్ ముఖాముఖి

కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఆధిపత్య ధోరణితో దేశంలో విద్యారంగం ప్రమాదంలో పడింది.. అందుకు దేశంలో నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలే నిదర్శనం.. నూతన జాతీయ విద్యానం 2020 తో కేంద్రీకృత విద్యావిధానం అమలు చేస్తూ విద్యా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారు. అందులోనూ సామాజిక న్యాయాన్ని పాటించడం లేదు.. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివిన విధ్యార్థులు మెడికల్ సీట్లు సాధించకపోవడం.. కార్పోరేట్ విద్యను ప్రోత్సహించడం అందుకు నిదర్శనం.. దేశంలో శాస్త్రీయ విధానం అమలు జరగాల్సిన అవసరముంది. అందుకు ఏఐఎస్ఎఫ్ ఆద్వర్యంలో విద్యారంగ వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలు నిర్వహించేందుకు సంసిద్ధంగా ఉన్నాం.. అంటూ ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ శ్రీరంగరాజన్ తెలిపారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతుల్లో తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా శిక్షణ తరగతులకు హాజరైన ఈ సందర్భంగా ప్రజాపక్షంతో ముఖాముఖిగా మాట్లాడారు.. ఆయన మాటల్లోనే..

**జాతీయ విద్యా విదానానికి వ్యతిరేకించాలి**

ప్రపంచ వ్యాప్తంగా మార్క్సిజం సిద్దాంతాలే ఎక్కువగా మనుగడలో ఉన్నాయి. శాస్త్రీయ విధానం అమలు జరుగుతోంది. కానీ ప్రజాస్వామ్య భారతదేశంలో జాతీయ విధ్యా విధానం2020 తెరపైకి తెచ్చారు. నాణ్యమైన విద్య అందడం లేదు.. సిలబస్‌లో సబ్జెక్ట్‌లే బోధిస్తున్నారు. కేవలం చదువు ఉద్యోగాల కోసమే అన్నట్లుగా విద్యను బోధిస్తున్నారు. సమాజంలో జ్ఞానాన్ని సంపాదించుకున్నవారే మనుగడ సాధిస్తారు. అది శాస్త్రీయ విద్యావిధానంలోనే సాధ్యమవుతుంది. జాతీయ విద్యావిదానంతో కేంద్రీకృత విద్యావ్యవస్థను మోడీ ప్రభుత్వం అమలు చేస్తోంది. ఢిల్లీ కేంద్రంగా నిర్ణయాలు తీసుకుంటోంది. కార్పోరేట్, కమ్యూనలైజేషన్, సెంట్రలైజేషన్ ద్వారా విధ్యార్థులను ఫిల్టర్ చేస్తున్నారు. స్కూల్ ఎడ్యుకేషన్ నుంచే అది మొదలవుతోంది. బడుగు బలహీన వర్గాలకు చెందిన విధ్యార్థులకు పూర్తిగా అన్యాయం జరుగుతోంది. ఉన్నత వర్గాలకే న్యాయం జరుగుతోంది. సామాజిక న్యాయానికి వ్యతిరేకంగా విద్యావిధానం అమలవుతోంది.

**ఐదేళ్లలో ఇక కామన్ ఎంట్రన్స్ టెస్టులే..**

వచ్చే ఐదేళ్లలో దేశంలోని మోదీ ప్రభుత్వం అన్ని రాష్ట్రాల యూనివర్సిటీలలో ఉన్నత విద్యకు కామన్ ఎంట్రన్స్ పరీక్షలు నిర్వహించేందుకు సిద్దమవుతోంది. నీట్ పరీక్షపై దేశవ్యాప్తంగా ఆందోళన చెందుతున్న క్రమంలో తమిళనాడులో మొదటి రోజు నుంచే వ్యతిరేకిస్తూ వస్తోంది. 2010 నుంచి వ్యతిరేకం పోరాడుతోంది. అది ఎలిజిబుల్ టెస్ట్.. ఎంట్రన్స్ కాదు.. ప్రైవేట్ మెడికల్ కాలేజీలలో డొనేషన్లను నియంత్రించ డానికే నీట్ పరీక్ష ప్రవేశపెట్టారు. ఆ తర్వాత కూడా ప్రైవేట్ మెడికల్ కాలేజీలలో లక్షలాది రూపాయల డొనేషన్లు కట్టి సీట్లు పొందాల్సిన దుస్థితి. ఇది భారత మౌళిక రాజ్యాంగ సూత్రాలకు వ్యతిరేకం. క్వాలిటీ ఎడ్యుకేషన్ సైతం లేదు. మల్టిబుల్ చాయిస్ మెథడ్‌లో నీట్ పరీక్ష నిర్వహిస్తుండగా అప్పటి వరకు ప్రశ్నలకు జవాబు రాసే పద్దతిలో చదువుకున్న విధ్యార్థి ఎలా రాయగలుగుతారు. బోధన, అభ్యాసన వేర్వేరుగా ఉండే క్రమంలో కేంద్రీకృత విద్యావిధానంతో విద్య ప్రాధాన్యత పోతుంది. తద్వారా కోచింగ్ సెంటర్లు పుట్టుకొస్తున్నాయి. విద్యను కేంద్రీకృతం చేయడంతో వారి చేతుల్లో రాష్ట్రాల హక్కులు కోల్పోతున్నాయి. విద్యావిధానం అస్తిత్వం కోల్పోయే ప్రమాదం ఉంది.



**రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించాలి**

తమిళనాడులో ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో సీట్లు ఇవ్వాలని 7.5 శాతం రిజర్వేషన్ కల్పించింది. తద్వారా అక్కడ 720 మందికి ప్రభుత్వ మెడికల్ సీట్లు సాధించడం గర్వకారణం. ఇండియా కూటమిలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జాతీయ విద్యా విధానంతో పాటు నీట్ పరీక్షకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మాణించి కేంద్రానికి నివేదించాలి. రాష్ట్రంలో ఎడ్యుకేషన్ పాలసీ తీసుకురావాలి. రాష్ట్ర ప్రభుత్వాలకే నీట్ పరీక్ష బాధ్యతలు అప్పగించాలి. ఇప్పటికే కర్ణాటక ప్రభుత్వం కమిటీ వేసింది. తెలంగాణ ప్రభుత్వంలో 10 శాతం ప్రభుత్వ మెడికల్ సీట్లు ఇచ్చేందుకు కృషి చేయాలి. అప్పుడే గ్రామీణ పేద మధ్యతరగతి కుటుంబాలకు గొప్పఅవకాశం లభిస్తుందని విజ్ఞప్తి చేస్తున్నా...

**ఏఐఎస్ఎఫ్ బలమైన నిర్మాణం**

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్మాణాత్మకంగా బలోపేతమై విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాడాలి. దేశంలో క్లిష్టపరిస్థితులు నెలకొన్నాయి. విద్యారంగానికి పదేళ్లలో చేసిందేమీ లేదు. మోదీ ప్రభుత్వంలో సెక్యులరిజం, సామాజిక న్యాయం ప్రమాదకరంగా మా రింది. ఏఐఎస్ఎఫ్ విధ్యార్థులు బాగా చదువుకుని జ్ఞానం పెంచుకోవాలి. బలమైన సంఘంగా నిర్మాణం కావాలి. పాలక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి. క్యాంపస్‌లలో ఏఐఎస్ఎఫ్ విధ్యార్థి జెండా ఎగురవేయాలి..

**విభజిస్తూ పాలిస్తున్న మోదీ ప్రభుత్వం**


బిజెపి ప్రభుత్వానికి భారత ప్రజలు బలమైన సందేశమిచ్చారు. బిజెపిలో ఆదిపత్య ధోరణి, వ్యతిరేక విధానాలపై ప్రజలు సరైన తీర్పునిచ్చారు.మోదీ,అమిత్‌షాతో ప్రజాస్వామ్యం,రాజ్యాంగం, సెక్యులరిజంప్రమాదకరంగా మారింది. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ఏఐఎస్ఎఫ్ అగ్రభాగంలో ఉంటుంది. విద్య, వైద్యం,నిరుద్యోగం,ఎంప్లాయిమెంట్,ధరలపెరుగుదలకు వ్యతిరేకంగా ప్రజలు ఓట్లేసారు. ముస్లింలకు వ్యతిరేకంగా మోడీ వ్యవహరించారు. యూపి, మహారాష్ట్ర, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ఇండి యా కూటమికి స్పష్టమైన మెజారిటీ వచ్చింది. నైతికంగా బిజెపి ఓడిపోయింది. తెలంగాణయూనివర్సిటీలో పర్మినెంట్ విసిలు నియమించాలి. ఇంచార్జి విసిలే దిక్కయ్యారు.అన్నియూనివర్సిటీలోటీచింగ్, నాన్ టీచింగ్ రిక్రూట్‌మెంట్ చేయాలి. బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలి. తెలంగాణలో నీట వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మాణం చేయాలి.

–పంజాల శ్రీనివాస్,
ప్రజాపక్షం కరీంనగర్‌ప్రతినిధి

# రైతులను దగాచేస్తున్న కాషాయ పాలకులు


ఎం. కోటేశ్వరరావు

మూడవసారి నరేంద్ర మోదీ ప్రధాని పదవి చేపట్టారు. ఎంతో వేగంగా పని చేస్తారనే ప్రచారం పెద్ద ఎత్తున చేశారు. దానికి పక్కా నిదర్శనం అంతకు ముందు పదవీ కాలంలో జమ్మూకాశ్మీరుకు రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 370ని ఎంత వేగంగా రద్దు చేశారో దేశం చూసింది. 2019 జూలై చివరి వారంలో అసాధారణ రీతిలో కాశ్మీరులో భద్రతా దళాలను మోహరించారు. ఆగస్టు రెండవ తేదీ శుక్రవారం అమర్‌నాథ్ యాత్రీకులకు ముప్పు ఉందంటూ యాత్ర నిలిపివేయాలని భద్రతా హెచ్చరిక కాశ్మీరు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. ఆదివారం రాష్ట్ర మంతటా 144 సెక్షన్ ప్రకటించారు, ఇంటర్నెట్ నిలిపివేశారు. సోమవారం ఆర్టికల్ 370ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దానికి ముందు అదేరోజు రాష్ట్రపతి ఉత్తర్వు వెలువడింది. వెంటనే మంత్రివర్గ సమావేశం, అనంతరం అదే రోజు దాని మీద రాజ్యసభలో బిల్లును ప్రవేశపెట్టారు. సభ్యులకు దాని కాపీలు ఇవ్వలేదు. ఉదయం పదకొండు గంటలకు సభ సమావేశమైతే గంటన్నరలో అంటే 12.30లోగా 57పేజీల పత్రం మీద కావాలంటే సవరణలు ప్రవేశపెట్టవచ్చంటూ చెప్పారు. వాటిని చదివేందుకు కూడా ఆ సమయం చాలదు. అదే రోజు సభలో ఆమోదం కూడా పొందారు. మరుసటి ఏడాది కరోనాను అవకాశంగా తీసుకొని మూడుసాగు చట్టాలనూ అంతే వేగంగా ఆమోదించి అమలు చేసేందుకు పూనుకున్నారు. వేగంగా పనిచేసే నాయకత్వ ఘనత గురించి నరేంద్రమోదీ భక్తులు, గోదీ మీడియా పండితులను అడిగితే చాంతాడంత జాబితాను మన ముందుంచుతారు. రైతుల మహత్తర ఉద్యమం కారణంగా స్వాతంత్ర్యానంతరం దేశంలో తొలిసారిగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాలను క్షమాపణ చెప్పి మరీ 2021లో ఉపసంహరించుకోవడం కూడా వేగంగా జరిగినట్లే! ఈ వేగం కోట్లాది మంది రైతులు కోరుతున్న, గతంలో నరేంద్రమోదీ కూడా డిమాండ్ చేసిన కనీస మద్దతు ధరలకు చట్టబద్దత కల్పించేందుకు ఎందుకు లేదు ? రెండు సంవత్సరాల క్రితం ఎంఎస్‌పితో సహా రైతాంగ సమస్యలపై నియమించిన కమిటీ నుంచి ఇంతవరకు తాత్కాలిక నివేదికను కూడా ఎందుకు తెప్పించుకోలేదు ? ఇష్టంలేని పెళ్లికి తలంబ్రాలు పోసినట్లుగా ప్రభుత్వ తీరు ఉంది. మూడు సాగు చట్టాలను 2021 నవంబరులో రద్దుచేసినప్పుడు వెంటనే ఒక కమిటీని వేస్తామన్నారు. వెంటనే అంటే ఎనిమిది నెలలు, 2022 జూలై 12న కమిటీని వేశారు. ఆలస్యం ఎందుకంటే కొన్ని రాష్ట్రాలలో ఎన్నికల కారణంగా ఎన్నికల సంఘం అనుమతి ఇవ్వలేదని, సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కెఎం) నుంచి స్పందన కోసం ఎదురుచూడాల్సి రావటం అని వ్యవసాయ మంత్రి సాకులు చెప్పారు. ఆ కమిటీకి నివేదించిన అంశాలు, కమిటీలో ప్రతిపాదించిన వ్యక్తుల పట్ల అభ్యంతరాలు తెలుపుతూ మోర్చా తన ప్రతినిధులను పంపేందుకు తిరస్కరించింది. కేంద్ర ప్రభుత్వంఎన్నికల కమిషన్ మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలను అందించాలని సమాచార హక్కు కింద కోరగా అలాంటి రికార్డులు లేవని సమాధానం ఇవ్వటాన్నిబట్టి అసలు బండారం వెల్లడైంది. అంతేకాదు రైతు సంఘాలతో సంప్రదింపుల సమాచారం కూడా లేదని 2023 డిసెంబరు నాలుగవతేదీన మరో సమాచార హక్కు ప్రశ్నకు సమాధానం వచ్చింది. ఇక ప్రభుత్వం నియమించిన కమిటీ తీరుతెన్నులను చూస్తే ఎస్‌కెఎం ఎందుకు బహిష్కరించిందో వివరణ అవసరం లేదు. మొత్తం 29 మంది సభ్యులలో ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వ సంస్థలు, కాలేజీల్లో పనిచేసేవారే 18 మంది ఉన్నారు. మిగిలిన పదకొండుమంది అధికారేతర సభ్యులలో ఎస్‌కెఎం నుంచి ముగ్గురిని నియమిస్తామని ప్రభుత్వం ప్రతిపాదించింది. మరో ఎనిమిది మంది అధికారపార్టీ కనుసన్నలలో వ్యవహరించే రైతు ప్రతినిధులే ఉన్నారు. ఈ కమిటీకి అధ్యక్షుడు సంజయ్ అగర్వాల్. వివాదాస్పద మూడుసాగు చట్టాలను ప్రతిపాదించినపుడు వ్యవసాయశాఖ కార్యదర్శి, మరో సభ్యుడు ఇఫ్‌కో చైర్మన్ దిలీప్, ఇతగాడు గుజరాత్ బీజేపీ మాజీ ఎంపీ. మరొకరు ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ బికెఎస్ జాతీయ కార్యవర్గ సభ్యుడైన ప్రమోద్ చౌదరి, ఐదవ సభ్యుడు సయ్యద్ పాషా పటేల్ మహారాష్ట్ర బీజేపీ మాజీ ఎంఎల్‌సి, ఇలా అందరూ గత సాగుచట్టాలను అడ్డంగా సమర్ధించిన వారితోనే నింపిన తరువాత ఎస్‌కెఎం గళానికి అవకాశం ఎక్కడ ఉంటుంది.



ఇక ఈ కమిటీ తొలి పద్దెనిమిది నెలల కాలంలో 35 సమావేశాలు జరిపినట్లు, ఎప్పుడు నివేదిక సమర్పిస్తుందో చెప్పకుండా పార్లమెంటుకు ప్రభుత్వం జవాబిచ్చింది. ఫిబ్రవరి తరువాత మరో రెండుసార్లు సమావేశమైంది. ఈ కమిటీ అనేక ఉపసంఘాలను ఏర్పాటు చేసింది. వాటి నివేదికలు ఇవ్వాలని కోరినా అందుబాటులో లేవన్నదే ప్రభుత్వ సమాధానం. గతంలో స్వామినాధన్ కమిషన్, తరువాత మోదీ ఏర్పాటు చేసిన 2016 కమిటీ కూడా అనేక అంశాలను చర్చించింది. అందువలన కొత్త కమిటీ చర్చల పేరుతో కాలయాపన తప్ప మరొకటి కాదు. వాటి సిఫార్సులకు వ్యతిరేకంగా మూడు సాగుచట్టాల్లోని అంశాలు ఉన్నాయి. అయినా మోదీ వాటిని ఉపసంహరిస్తూ 2021లో చేసిన ప్రసంగంలో రైతులకు కొత్త ఆశలను రేకెత్తించారు.2014 ఎన్నికల సమయంలో బీజేపీ చేసిన వాగ్దానానికి వ్యతిరేకంగా మోదీ సర్కార్ సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. 75వ స్వాతంత్ర్యదినోత్సవం (2022) నాటికి రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని 2016 ఫిబ్రవరి 28 బడ్జెట్ సందర్భంగా మోదీ చెప్పారు. అదే ఏడాది ఏర్పాటుచేసిన అశోక్ దలవాయి కమిటీ 2012–13 ఎన్‌ఎస్‌ఎస్‌ఓ అంచనా ప్రాతిపదికన 2015–2016లో ఒక రైతు రాబడి ఏడాదికి రు.96,703, నెలకు రు.8,058 ఉంటుందని అంచనా వేసి 2022–23నాటికి అది రు.2,71,378 లకు రు.22,610 ఉండాలని, దాన్ని సాధించాలంటే ఏటా 10.4శాతం పెరుగుదల ఉండాలని చెప్పింది. ఇప్పుడు ఎంత ఉందో ఎక్కడా ప్రభుత్వం ప్రకటించలేదు. అయితే 2018–19లో 77 రైతు కుటుంబాల పరిస్థితి అంచనా సర్వే ప్రకారం రాబడుల మొత్తాలు రు.1,22,616; రు.10,218 ఉన్నట్లు తేలింది. ఈ నివేదికను 2021లో విడుదల చేశారు. దీని ప్రకారంచూస్తే వార్షిక పెరుగుదల కేవలం 2.8శాతమే ఉంది. పదేండ్ల పాలనలో సగటు మూడు శాతం కంటే తక్కువ. అయితే ఏ ప్రాతిపదికన లెక్కించారో చెప్పకుండా కొన్ని పంటలకు 2022 ఆర్థిక సంవత్సరంలో రాబడి రెట్టింపు ఉన్నట్లు ఎస్‌బిఐ పరిశోధనా విభాగం చెప్పిన అంకెలను బీజేపీ పెద్దలు ఊరూవాడా ప్రచారం చేశారు. గోదీ మీడియా దాన్ని ఇంకా ఎక్కువ చేసింది. నిజంగా అంత పెరిగి ఉంటే రైతాంగం ఈ ఎన్నికల్లో అనేక చోట్ల బీజేపీ, దాని మిత్రపక్షాలను ఎందుకు మట్టికరిపించినట్లు ? అనేక చోట్ల రైతులు కనీస మద్దతు ధరలకంటే తక్కువకే అమ్ముకుంటున్నారు. రైతుల రాబడి రెట్టింపు ఎంతవరకు వచ్చిందన్న ప్రశ్నకు 2023 డిసెంబరులో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ స్పందిస్తూ వ్యవసాయం రాష్ట్రాల అంశం గనుక అవి చూసుకుంటాయని దాట వేశారు. మూడుసాగు చట్టాలను రాష్ట్రాలతో సంప్రదించకుండా వాటి ఆమోదం లేకుండా అమలుకు పూనుకున్నప్పుడు ఈ అంశం గుర్తులేదా? రైతుల్లో పెరుగుతున్న అసంతృప్తిని గమనించి గత ఎన్నికలకు ముందు కొంతమంది రైతులకు నెలకు రు.500, ఏడాదికి ఆరువేల చొప్పున పిఎం కిసాన్ నిధి పేరుతో ఇస్తున్నారు. ఐదేండ్లలో పెరిగిన వ్యవసాయ ఖర్చులతో పోల్చితే ఇది ఏమూలకూ రాదు. ఈ మొత్తాన్ని ఎనిమిది వేలకు పెంచనుందనే లీకులను వదిలి రైతాంగాన్ని మభ్యపెట్టేందుకు చూసింది. ఇప్పుడు దాని గురించి మాట్లాడటం లేదు.

వర్తమాన ఖరీఫ్ పంటలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలను ఇటీవల ప్రకటించింది. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గతేడాది ఏడు శాతం పెంచగా ఇప్పుడు ఓట్లతో నిమిత్తం లేదు గనుక 5.4శాతం మాత్రమే పెంచారు.

తాజా ఎన్నికల్లో 159 గ్రామీణ నియోజకవర్గాలలో ఓడిపోయిన బీజేపీ దాన్నుంచి ఎలాంటి పాఠం నేర్చుకోలేదన్న సంయుక్త కిసాన్ మోర్చా వ్యాఖ్యను గమనించాలి. ఈ సందర్భంగా పదేండ్ల యూపీఏ పాలనలో పెరిగింది ఎంత, రాబడిని రెట్టింపు చేస్తామన్న నరేంద్రమోదీ ఎంత పెంచారు అన్నది మీడియాలో చర్చకు వచ్చింది. దీన్ని గోదీ మీడియా మూసిపెట్టేందుకు చూసింది. ప్రభుత్వ సమాచారం ప్రకారమే మచ్చుకు సోయాబీన్‌కు గత పాలకులు, 175, పత్తికి 115శాతం పెంచగా, మోదీ పదేండ్లలో 80,79శాతాల చొప్పునే పెంచారు.

# చారిత్రక మూలాలున్న నగరం 'తమ్లుక్'

దేశంలోని అతి పురాతన, చారిత్రక మూలాలున్న నగరాల్లో తమ్లుక్ ఒకటి. ప్రస్తుత పశ్చిమ బెంగాల్‌లోని ఈ నగరం, ఒకప్పటి తామ్రలిప్త లేదా తామ్రలిప్తి ప్రాంతంలో ఉంది. పురాతన సుహ్మో రాజ్యానికి రాజధానిగా ఉండేది. క్రీస్తుశకం 7, 8 వ శతాబ్దాలలో ఇది గొప్ప వాణిజ్య కేంద్రంగా విరాజిల్లింది. ఇటీవల తవ్వకాల్లో అప్పటి చరిత్రకు సంబంధించిన ఆనవాళ్లు కూడా లభించడంతో, తుమ్లుక్ వార్తల్లోకి ఎక్కింది. చంద్రకేతునగర్ అనే పురాతన పట్టణ అవశేషాలు కూడా ఇక్కడి త్వకాల్లో బయటపడినట్టు పురాతత్వ శాస్త్రవేత్తలు ప్రకటించారు. పాన్ (తమలపాకు) ఎక్కువగా ఉత్పత్తయ్యే ప్రాంతాల్లో తుమ్లుక్ ఒకటి, ఇక్కడి నుంచి తమలపాకులు వివిధ ప్రాంతాలకు ఎగుమతి అవుతాయి. ఈ నగరానికి ఐతిహాసిక చరిత్ర కూడా ఉందని స్థానికుల విశ్వాసం. వారి కథనాల ప్రకారం, మహాభారత కాలంలో పాండవులు అశ్వమేధ యాగాన్ని పూర్తి చేసిన తర్వాత విడిచిపెట్టిన గుర్రాన్ని తామ్రలిప్త యువరాజు అడ్డుకున్నాడు దీనితో పాండవులు, తామ్రలిప్తి యువరాజు మధ్య యుద్ధం జరిగింది. అయితే, యువరాజు సంధి కుదుర్చుకోవడంతో ఉద్రిక్తతలకు తెరపడింది. ఇక్కడి ప్రసిద్ధ కాళీ దేవాలయం బర్గభీమ మందిరాన్ని పాండవుల్లో ఒకడైన భీముడు ఇక్కడ నిర్మించాడని నమ్ముతారు. అందుకే ఈ ప్రాంతాల్లో ఏటా భీమ్ మేళ జరుగుతుంది. స్థానికుల నమ్మకాలు ఎలా వున్నా,తామ్రధ్వజ రాజు పాలనలో రాజ్యం ఉచ్ఛస్థితికి చేరిందని చారిత్రక ఆధారాలు ఉన్నాయి. తామ్రలిప్తి సమీపంలోని ఘట్శిల గనుల నుంచి భారీగా రాగిని వెలికితీసేవారు, రాజ్య ఖజానాకు ఈ గనులు కీలకంగా మారాయి. రూపనారాయణ నది బంగాళాఖాతంలో కలిసే ముందు ఈ ప్రాంతం మీదుగా ప్రవహిస్తుంది. రాగితో పాటు, పట్టు, పత్తి, నీలిమందు, మట్టి పాత్రలను శ్రీలంక, ఆగ్నేయాసియా దేశాలకు ఎగుమతి చేసేందుకు వీలుగా తామ్రలిప్తి వద్ద నౌకా కేంద్రాన్ని నిర్మించారు. సరుకులను నిలువ చేసుకోవడానికి పెద్దపెద్ద భాండాగారాలు ఉండేవి. కళింగ రాజ్యంపై అశోక చక్రవర్తి దాడి చేసే క్రమంలో తామ్రలిప్తి ఓడరేవు నగరాన్ని స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నించినట్టు స్థానికులు విశ్వసిస్తారు. వారి వాదనకు నిదర్శనంగా బౌద్ధమతానికి సంబంధించిన పలు ఆనవాళ్లు ఇక్కడ బయటపడ్డాయి. బుద్ధిని జాతక కథల్లో తామ్రలిప్తి ప్రస్తావన ఉంది. అదే విధంగా ఫాహియాన్, హ్యూయెన్ త్సాంగ్, ఇట్సింగ్ వంటి ప్రసిద్ధ చైనా యాత్రకులు తమతమ రచనల్లో దీని గురించి పేర్కొన్నారు. క్రీస్తు శకం 2వ శతాబ్దంలో భారత్‌లో పర్యటించిన రోమన్ తత్వవేత్త, యాత్రికుడు ప్లినీ తామ్రలిప్తిని 'తాలుక్టే' అని అభివర్ణించాడు. అంతగా వెలిగిపోయిన తామ్రలిప్తి క్రీస్తుశకం 7వ శతాబ్దం చివరి నాటికి క్షీణించడం ప్రారంభించింది. రూపనారాయణ నది కూడా తన మార్గాన్ని మార్చుకొని, తూర్పువైపు వెళ్లి భగీరథి (హుగ్లీ)లో కలిసింది. పాత నదీ ప్రవాహం ఎండిపోవడంతో, నౌకాశ్రయం ప్రాధాన్యతను కోల్పోయింది. ఆ తర్వాత కాలంతో పాటు శిథిలమై, మట్టిలో కలిసిపోయింది. ఇప్పుడు ఆ నాటి ఘన చరిత్రను గుర్తుతెచ్చే ఆనవాళ్లు బయటపడడం విశేషం.



## ఫార్మా కంపెనీల అనుమతుల రద్దు చేయిస్తా

ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



ప్రజాపక్షం/మునుగోడు : మునుగోడు నియోజకవర్గంలోని కిష్టాపురం, గట్టుప్పల గ్రామాలలో నిర్మించ తలపెట్టిన ఫార్మా కంపెనీల అనుమతులను రద్దు చేయిస్తానని ఎంఎల్ఏ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం మునుగోడు క్యాంప్ కార్యాలయంలో యాదాద్రి నల్లగొండ జిల్లాలకు చెందిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, పరిశ్రమల శాఖ అధికారులు, లేబర్ డిపార్ట్మెంట్ అధికారులతో ఎంఎల్ఏ ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి సమీక్ష చేశారు. మునుగోడు నియోజకవర్గంలో కాలుష్యం వెద జల్లే రెడ్ కేటగిరీ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. ఇప్పటి వరకు ఎన్ని కంపెనీలపై చర్యలు తీసుకొని నోటీసులు ఇచ్చారు అని ఆరా తీశారు. పరిశ్రమలు ఇచ్చే సిఎస్ఆర్ నిధులు ఎక్కడెక్కడ ఖర్చు చేస్తున్నారని, ఇక్కడ ఉన్న పరిశ్రమల్లో స్థానికులకు ఎంత మందికి ఉపాధి కల్పించారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజల జీవితాలకు హానీ కలిగించే ప్రమాదకరంగా ఉన్న ఫార్మా కంపెనీలను ఎట్టి పరిస్థితులలో అనుమతులు ఇచ్చేది లేదని అన్నారు. మునుగోడు నియోజకవర్గంలో ఉన్న కాలుష్యం వేధ జల్లే పరిశ్రలపై పూర్తి స్థాయి సమాచారం కోసం వారం రోజుల్లో సమీక్ష చేస్తానని అన్నారు. ఈ సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

## హాస్టల్స్ భవనలు నిర్మించండి

ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రాముయాదవ్ డిమాండ్



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: హుజురాబాద్ నియోజకవర్గంలో శిథిలావస్థలో ఉన్న బిసి బాలుర, బాలికల హాస్టల్స్ నూతన భవనాలు నిర్మించాలని, అలాగే నూతన గ్రంథాలయం ఏర్పాటు చేయాలని అఖిల భారత విధ్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్ కోరారు. శుక్రవారం హుజురాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హుజురాబాద్ బిసి హాస్టల్, బాలికల హాస్టల్స్ శిథిలావస్థలో ఉన్నాయని, ఇప్పుడు హాస్టల్స్ అద్దె భవనాల్లో నడుస్తున్నాయని, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. హాస్టల్స్‌కు నూతన భవనాలు, నూతన గ్రంథాలయం నిర్మాణ విషయమై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి దృష్టి పెట్టాలని కోరారు. ఎమ్మెల్యే సొంత గ్రామమైన వీణవంక మండలానికి సంబంధించిన ఎంజెపి గురుకుల పాఠశాల హుజురాబాల్‌లో అద్దె భవనంలో కొనసాగుతుందని, వీణవంకలో నూతన భవన నిర్మాణానికి కృషి చేయాలన్నారు. బిసి హాస్టల్ అద్దె భవనం మెయిన్ రోడ్డు పక్కన ఉండడం వల్ల విద్యార్థులు పాఠశాలకు వెళ్లే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అందువల్ల విద్యార్థులు చదువుకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. హుజురాబాద్ నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో మౌళిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం హాస్టల్ మెస్ చార్జీలు పెంచాలని, స్కాలర్‌షిప్, ఫీజురీయంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి రాపెల్లి రోహిత్, కృష్ణ, మణి, ప్రవీణ్, రాజు, వెంకటేష్ తదితరులున్నారు.

## హెచ్ఎండిఎ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/భువనగిరి: హైదరాబాద్ స్వర్ణ జయంతి భవన్ కార్యాలయంలో హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌ను భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. హెచ్ఎండిఏ పరిదిలోని భువనగిరి ప్రాంత అభివృద్ధి గురించి భువనగిరి పట్టణంలో రోడ్ల సుందరీకరణ పోచంపల్లి, బీబీనగర్, భువనగిరి చెరువులను మినీ ట్యాంక్ బండ్ల పనుల పురోగతిపై చర్చించారు. మూసి ప్రక్షాలనపై మూసి రివర్ ఫ్రంట్ మేనేజింగ్ డైరెక్టర్ అమ్రపాలితో చర్చించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## సంపద వనాలపై అధిక దృష్టి

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



ప్రజాపక్షం/ఆత్మకూర్(ఎస్): సంపద వనాలపై ఎక్కువ దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలో కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. కోటినాయక్‌తండా, పాత సూర్యాపేట, దుబ్బతండా గ్రామాల్లో సంపదవనాలు పరిశీలించి చనిపోయిన మొక్కల స్థానాల్లో సత్వరమే మొక్కలు నాటాలని సూచించారు. ఉపాధిహామీ పనుల్లో భాగంగా నర్సరీలలో పనిచేస్తున్న కూలీలతో మాట్లాడి వేతనాలు సక్రమంగా అందాలని ఎంపిడివోను అదేశించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మీకంగా తనిఖీచేసి ధరణి పెండింగ్ దరఖాస్తుల వివరాలు తెలుసుకుని అట్టి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి పిల్లలకు ఏకరూప దుస్తులు అందచేయకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్థార్ వినోద్‌కుమార్, ఎంపిడివో ఎం.డి ఖాసీం, ఎంపివో సంజీవ్, జిపి కార్యదర్శులు భాస్కర్, సుధాకర్, స్వప్న, ఏపివో ఈశ్వర్ పాల్గొన్నారు.

## ధరణి సమస్యలను పరిష్కరించాలి

కలెక్టర్ హనుమంత కే జండగే



ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి: ధరణి మద్యుల్ ఉన్న అన్ని రకాల దరఖాస్తులను ఎలాంటి పెండింగ్ లేకుండా వెంటనే వేగవంతం చేసి సమస్యలను పరిష్కరించి ప్రజలకు పారదర్శకమైన పరిపాలనను అందించాలని యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతు కె జెండగె కొండిబా అధికారులను ఆదేశించారు. శుక్రవారం పోచంపల్లి తహసిల్దార్ కార్యాలయాల్లో ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ధరణి పెండింగ్ దరఖాస్తులను, ధరణి రిజిస్ట్రేషన్లను పరిశీలించారు. ధరణి ఫైల్స్, రెవెన్యూ రికార్డులు, భూ రికార్డులను అపరిస్కృత ఫైళ్లను ఆయన పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారాలను, భూ రిజిస్ట్రేషన్ల విషయంలో స్లాట్ బుకింగ్‌లను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మార్వో శ్రీకాంత్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ నాగేశ్వర రావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ గుత్తా వెంకట్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఈ కార్యక్రమంలో ఉన్నారు.

# నల్లగొండ డిసిసిబి చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

చైర్మన్ పదవిని మరోసారి కైవసం చేసుకున్న కాంగ్రెస్

రెండు మూడు రోజులలో ఎన్నిక



ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి : నల్లగొండ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ లిమిటెడ్ (డిసిసిబి) చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో డిసిసిబి డైరెక్టర్లు 19 మందికి గాను 18 మంది బిఆర్ఎస్ డైరెక్టర్లు ఉండగ కాంగ్రెస్‌కు చెందిన ఒక్క డైరెక్టర్ ఉన్నారు. అయితే ఇటీవల మారిన రాజకీయ పరిణామాలు రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోవడంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో స్థానిక సంస్థల చైర్మన్ గిరిని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుంది. అందుకు అవిశ్వాసానికి తెరలేపారు. డిసిసిబి చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డిపై గత 18 రోజుల క్రితం డిసిసిబి డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో 14 మంది డైరెక్టర్లు అవిశ్వాసం పెట్టాలని జిల్లా సహకార అధికారి కిరణ్‌కు తీర్మానం కాపీని అందజేశారు. అవిశ్వాసం పెట్టాలన్న డైరెక్టర్లంతా క్యాంపు రాజకీయాలు చేస్తూ 18 రోజుల తరువాత తిరిగి శుక్రవారం బ్యాంకు సమావేశ మందిరంలో అవిశ్వాసం తీర్మానంపై నిర్వహించిన ప్రత్యేక సమావేశంకు హాజరయ్యారు. అవిశ్వాసానికి 19 మంది డైరెక్టర్లకు గాను అవిశ్వాసం పెట్టిన 14 మంది డైరెక్టర్లతో పాటు వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి మొత్తం 15 మంది డైరెక్టర్లు హాజరయ్యారు కావడంతో చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. దీంతో మహేందర్‌రెడ్డి చైర్మన్ పదవి కోల్పోవడంతో వైస్ చైర్మన్‌గా ఉన్న ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి తాత్కాలిక డిసిసిబి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అయితే సోమవారం లేదా మంగళవారం చైర్మన్ ఎన్నిక జరగనున్నది.

**పార్టీలకతీతంగా రైతు సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్తాం**

రాజకీయాలకు అతీతంగా రైతు సంక్షేమమే ధ్యేయంగా బ్యాంకును ముందుకు తీసుకుపోతామని డిసిసిబి డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డిసిసిబి చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బ్యాంకును దినదిన అభివృద్ధి చేస్తూ రైతులకు అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. గత పాలకులు డిసిసిబిని రాజకీయ రంగు కలిమి ఇష్టానుసారంగా వ్యవహరించారని అన్నారు. తాము రాజకీయాలకు అతీతంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. అవిశ్వాసానికి మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తం కుమార్ రెడ్డి, మాజీ మంత్రులు కుందూరు జానారెడ్డి, రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, డైరెక్టర్లంతా సహకరించారని, ఈ సందర్భంగా వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో డిసిసి అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్ రెడ్డి, డిసిసిబి డైరెక్టర్లు పాశం సంపత్ రెడ్డి, అంజయ్య, గుడిపాటి సైదులు, వీరస్వామి, కొండా సైదులు, కోడి సుష్మ, కరుణ, అనురాధ, అందేల లింగయ్య యాదవ్, రామడుగు ద్రయ్య, జూలూరు శ్రీనివాస్, జయరాం నాయక్, బంటు శ్రీను,పలువురు కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్, ఎన్ ఎస్ యుఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేశ ఆర్థికాభివృద్ధికి పివి పునాది

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : మాజీ ప్రధాని స్వర్గీయ పివి నరసింహారావు జయంతి సందర్భంగా శుక్రవారం కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కరీంనగర్ డిసిసి అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి పురుమల్ల శ్రీనివాస్ హాజరై పలువురు నాయకులతో కలిసి పివి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కవ్వంపల్లి మాట్లాడుతూ దేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి పరిచిన ఆర్థిక పితామహుడు పివి నరసింహారావు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు వైద్యుల అంజన్ కుమార్, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, శ్రావణ్ నాయక్, పులి అంజనేయులు గౌడ్, కొరివి అరుణ్ కుమార్, వెన్న రాజమల్లయ్య, బొబ్బిలి విక్టర్, ముస్తాక్ హైమద్, పడిశెట్టి భూమయ్య, వంగల విద్యాసాగర్, కంకణాల అనిల్ కుమార్ గుప్తా, వెన్నం రజిత, కాడె శంకర్, రామిడి రాజిరెడ్డి, నూనె గోపాల్ రెడ్డి, నాగుల సతీష్, జనగామ సతీష్ రావు, తదితరులున్నారు.

# వేగవంతంగా టన్నెల్ పనులు పూర్తి

కలెక్టర్ నారాయణరెడ్డి



ప్రజాపక్షం/నల్లగొండ : ఎస్ఎల్ బిసి ఏఎమ్ఆర్‌పి 1వ టన్నెల్ ఔట్లెట్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అయన జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తో కలిసి ఎస్ఎల్ బిసి, ఎఎమ్ఆర్‌పి 1వ టన్నె ల్ ఔట్ లెట్‌ను సందర్శించారు. జిల్లా కలెక్టర్ ట న్నెల్ ప్రాజెక్టు కార్యాలయంలో ప్రాజెక్టు ఇంజనీర్లు, ప్రాజక్ట్ నిర్మాణం చేపట్టిన జయప్రకాష్ అసోసియేట్స్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులతో టన్నెల్ నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించా రు. ఏజెన్సీ ప్రెసిడెంట్ అనిల్ కుమార్ జిల్లా కలెక్టర్‌కు ఎస్ఎల్ బిసి, ఎఎమ్ఆర్‌పి టన్నెల్ వన్ ఔస్టేట్ పథకంపై వివరిస్తూ ప్రపంచంలోనే ఇది అతిపెద్ద ఐదవ పొడవైన టన్నెల్ అని, 10 మీ టర్ల డయాతో చేపట్టిన ఈ టన్నెల్ మొత్తం పొ డవు 43.93 కిలోమీటర్లు ఉందని తెలిపారు. ఈ టన్నెల్ ద్వారా 4,000 క్యూసెక్కుల నీటిని తీసుకువెళ్లే సామర్థంతో డిజైన్ చేయడం జరిగిందని, గరిష్టంగా 5570 క్యూసెక్కుల నీటి సామ ర్థం ఈ టన్నెల్‌కు ఉంటుందని, శ్రీశైలం ప్రాజెక్టు ఎడమకాలువ ద్వారా రూ.1925 కోట్ల అం చనా వ్యయంతో టన్నెల్ నిర్మాణం చేపట్టగా, స వరించిన అంచనాల ప్రకారం ప్రాజక్ట్‌కు రూ.4 658. 59 కోట్లు పెరిగిందని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్‌పిలు నాగర్ క ర్నూల్ జిల్లా పరిధిలో ఉన్న మన్నెవారి పల్లి ఎస్ఎల్‌బిసి టన్నెల్ ఒకటవ ఔట్ లెట్ ను సందర్శించారు. అనంతరం డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (నక్కలగండి ప్రాజెక్టు)ను సందర్శించా రు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఆర్‌డిఓ శ్రీ రాములు, టన్నెల్ ఏజిక్యూటివ్ ఇంజనీర్ జి జె వి సత్యనారాయణ, డి ఈ చక్రపాణి, లలిత, అ సిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మ హేందర్, ర వి రాజ్ ,జయప్రకాష్, అసోసియేట్స్ లిమిటెడ్ ప్రా జెక్టు ఏజెన్సీ ఏజిఎంలు దీపక్ జైన్, వీరేంద ర్ సింగ్, చందంపేట తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపిపి పార్వతి తదితరులు ఉన్నారు.

## ప్లాట్ల పంపిణీకి కలెక్టర్ హామీ

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏషాల అశోక్ వెల్లడి



ప్రజాపక్షం/భువనగిరిరూరల్: సిపిఐ పోరాటా ల ఫలితంగా లబ్ధిదారులకు ప్లాట్ల పంపిణీకి కలెక్టర్ హామీ ఇచ్చారని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏషాల అశోక్ తెలిపారు. శుక్రవా రం కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన ధ ర్నా ని ర్వహించి అదనపు కలెక్టర్ రెవెన్యూ బెల్ షాలో మ్‌ని కలిసి మెమోరాండం అందజేశారు. ఈ పోరాటం ఫలితంగా వారం రోజుల లోపు స ర్వే చేసి లబ్ధిదారులకు స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏషాల అశోక్ మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా స ర్వేనెంబర్ 118 2.88 సెంట్ల భూమి బొమ్మాయిపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ఖాళీగా ఉన్నదని ఇట్టి భూమి రైతు నుండి ప్రభుత్వం కొనుగోలు చేసిందని తెలిపారు. బలహీన వర్గాలకు ఇంటి నివేషణ స్థలాలు ఇవ్వాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించిందని దానిని అమలు చేయడంలో అప్పటి ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యారని అశోక్ అన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత, సిపిఐ పట్టణ కార్యదర్శి పుట్ట ర మేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షు లు దాసరి లక్ష్మయ్య, 11వ వార్డు సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి చింతల పెంటయ్య, మండల కౌన్సిల్ సభ్యులు మరిపెల్లి రాములు, నాయకు లు షర్ఫుద్దీన్, దొడ్డి బాలయ్య, కూరం పో షాలు, పర్వతం బాలకృష్ణ, కడారి అండాలు చిలుకూరి భారతమ్మ, చింతల అమృత, దాసరి విజయ పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీకి వైద్యుల అంగీకారం

డాక్టర్లతో అదనపు కలెక్టర్ చేసిన చర్యలు సఫలం



ప్రజాపక్షం/నల్లగొండ : జిల్లా కేంద్ర ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గత మూడు రోజులుగా ప్రభుత్వ డాక్టర్లు వర్సెస్ జిల్లా అధికార యంత్రాంగంకు కూల్‌వార్ సాగింది. ఆసుపత్రిలో మెరుగైన వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు రోగులకు అందే వైద్యంపై వివరాలను తెలుసుకునేందుకు జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి సంబంధిత అధికారులతో తనిఖీ ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేస్తూ ఆసుపత్రిని తనిఖీలు చేసేందుకు ఉత్తర్వ్యూలు జారీ చేశారు. దీనిపై ప్రభుత్వ, మెడికల్ కళాశాల డాక్టర్లు , ప్రొపెసర్లు , వైద్య సిబ్బంది ఆసుపత్రికి సంబంధం లేని అధికారులతో జిల్లా కలెక్టర్ తనిఖీలు చేయించడంపై ఆగ్రహం వ్యక్తం చేసి నిరసనకు దిగారు. శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర, జెడ్ పి సిఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి ఆసుపత్రిని తనిఖీ చేయడానికి వెళ్తే తనిఖీలు చేయొద్దంటూ డాక్టర్లంతా ఆరోగ్య సేవలు నిలిపివేసి నిరసన దిగారు. దీంతో జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి స్పందించి ఆసుపత్రి డాక్టర్లు, ప్రొపెసర్లతో అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర కలిసి చర్చలు జరుపాలని ఆదేశించడంతో శుక్రవారం నలుగురు సభ్యులతో కూడిన వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫసర్లు, తెలంగాణ డాక్టర్ల బోధన సిబ్బంది అసోసియేషన్ బృందం, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్రతో కలిసి ఛాంబర్‌లో చర్చలు జరిపారు. వైద్యులతో జరిపిన చర్చలు సానుకూలంగా ఉండటంతో తాము చేపట్టిన నిరసనను విరమించుకుంటున్నట్లు ప్రభుత్వ డాక్టర్లు ప్రకటించారు. అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి. పూర్ణచంద్ర మాట్లాడుతూ తనతో డాక్టర్ల బృందం జరిపిన చర్చలు సఫలమయ్యాయని తెలిపారు. చర్చల సందర్భంగా జిల్లా అధికారులతో ఆసుపత్రి పర్యవేక్షకులు ఏర్పాటు చేసిన ఒక ఆర్ఎంఓ తో కలిపి తనిఖీ చేసేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని వారు ఒప్పుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. వైద్య బృందంతో జరిపిన చర్చల ప్రకారం ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎంపిక చేసిన ఆర్ఎంవోతో కలిసి రేపటినుండి జిల్లా అధిలారులు యధావిధిగా ఆస్పత్రిలో ప్రజలకు అవసరమైన పరిపాలనపరమైన విభాగాలను తనిఖీ చేస్తారని అదనపు కలెక్టర్ తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌తో చర్చలు జరిపిన వారిలో మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫసర్ జె. శ్రీకాంత్ వర్మ, ఎల్ రమేష్, ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫసర్ , అసోసియేషన్ అధ్యక్షులు కిరణ్ కుమార్, జోనల్ కార్యదర్శి,సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫసర్ గిరిధర్ నాయక్ ,జి.జి.హెచ్ పర్యవేక్షకులు ప్రొఫసర్ నిత్యానందం లు ఉన్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

రిలయన్స్ స్టోర్స్‌లో నకిలీ గుడ్ల విక్రయం

కలకలం కథనానికి అధికారుల స్పందన



ప్రజాపక్షం ఎఫెక్ట్

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి: పోచంపల్లి రిలయన్స్ స్మార్ట్ పాయింట్‌లో నకిలీ గుడ్లు విక్రయం కలకలం పేరుతో జూన్ 26న ప్రచురితమైన కథనానికి ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారులు స్పందించి శుక్రవారం విస్తృతంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్మార్ట్ పాయింట్ స్టోర్స్‌లో తేదీ ముగిసిన ఆహార ఉత్పత్తులను జోరుగా విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోచంపల్లిలోని రిలేయన్స్ స్మార్ట్ సూపర్ మార్కెట్‌లను ఫుడ్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ ఆఫీసర్ డాక్టర్ ఎం.సుమన్ కళ్యాణ్ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ స్వాతి బృందం తనిఖీ దాడులు జరిపారు. సూపర్ మార్కెట్స్‌ను మొత్తం తిరిగి ప్రతి వస్తువును క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానంగా ఉన్న రాక్స్ సెల్ఫ్‌లలో ఉన్న ఆహార ఉత్పత్తుల నుంచి కొన్ని శాంపిల్స్‌ను తీసుకున్నారు. ఫిర్యాదు ఇచ్చిన బాధిత వినియోగదారుడి నుంచి వివరాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా అధికార బృందం మాట్లాడుతూ ఆహార ఉత్పత్తులను విక్రయాలు చేసే మార్కెట్ నిర్వాహకులు ప్రమాణాలు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అమ్మే ప్రతి ఆహార పధార్థములపై తయారీ సంస్థ తేదీ, ఎక్సైరీ డేట్ తప్పకుండ ఉండాలని, తప్పకుండ ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతి పొంది ఉన్న పదార్థాలను మాత్రమే అమ్మాలని లేనిచో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పలు రాక్స్‌లలో ఉన్న ప్రొడకట్స్ నుండి శాంపిల్స్ సేకరించి హైదరాబాదులోని టెస్టింగ్ ల్యాబ్‌కు పంపించి సేకరించిన ఆహార శాంపుల్స్ కల్తీ అని తేలినట్లయితే చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. ప్రజలకు అందించే ఆహారపదార్థాలు కల్తీ లేకుండా ఆరోగ్యకరంగా ఉండాలని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్స్ హెచ్చరించారు. ఈ తనిఖీలో ఆరోగ్య విస్తరణ అధికారి ఇస్తారి, ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది వారి వెంట ఉన్నారు.

## అక్రమ నిర్మాణం కూల్చివేత



ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్: మున్సిపాలిటి పరిధిలోని 16వ వార్డులో అమ్మ గార్డెన్ ఎదురుగా ఉన్న పెట్రోల్‌బంక్ వెనుక ప్రక్కన బేచ్‌రాగ్ మాదారం సర్వనెం.58/ఇ58/ఉ నందు పడిదల శ్రవణ్‌కుమార్ అనే వ్యక్తి మున్సిపల్ టిఎస్ బిపాస్ 2020 నిబంధనలకు విరుదగా అనుమతి లేకుండా జిప్లస్ 1 భవనాన్ని నిర్మాణం చేయడం పట్ల సదరు యజమానికి నిబంధనలను అనుసరించి షోకాజ్ నోటీస్ నెం.జి/యుసి/11/టిపిఎస్/2024 18052024న, షోకాజ్ నోటీస్ నెంబర్.ఇయం/0413/ఎస్ఆర్‌పిటి/004/3049 23 052024 ద్వారా నోటీస్ జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు.గృహ నిర్మాణానికి అనుమతి లేనందున డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్ కమిటీ సిఫారసు చేయడం జరిగిందన్నారు. టాస్క్‌ఫోర్స్ కమిటీ ఆదేశాల మేరకు అనుమతి లేని భవనాన్ని కూల్చివేయించడం జరిగిందన్నారు. పట్టణ ప్రజలు ఎవరూ కూడా భవన నిర్మాణ అనుమతి లేకుండా గృహాలు నిర్మించవద్దని తెలియజేశారు.

## గ్రామాలభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే మందుల సామేల్



ప్రజాపక్షం/తుంగతుర్తి: గ్రామాలభివృద్ధిలో రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరు భాగస్వాములై తమతమ గ్రామాలను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గుజ్జ దీపికయుగంధర్ రావులు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తూర్పుగూడెం గ్రామపంచాయతీలో నూతన మహిళా సమైక్య భవనం, గ్రంథాలయం భవనం, పాఠశాల టాయిలెట్స్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలభివృద్ధిలో రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు భాగస్వాములైనప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందని అన్నారు. గ్రామాలభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి గుండాగాని కవితరాములుగౌడ్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, గ్రామశాఖ అధ్యక్షుడు గుండాగాని సుధాకర్,ఓరుగంటి సత్యనారాయణ, చింతకుంట వెంకన్న, మురళి, పెండెం రామ్మూర్తి, గుండగాని మహేందర్‌గౌడ్, తొట్ల శ్రీనివాస్‌గౌడ్, దాయం ఝాన్సీరెడ్డి, నల్లు రామచంద్రారెడ్డి, రుద్ర రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

# బడి వైపు గిరిజనం చూపు

మారుతున్న ఛత్తీస్‌గఢ్ ఆదివాసీలు

తుపాకి చప్పుళ్ల మధ్య అక్షరాభ్యాసాలు



ప్రజాపక్షం/చర్ల : ఎప్పుడు చూసినా ఏదో ఒక హడావుడి. పోలీసుల బూట్ల చప్పుళ్లు లేదంటే అన్నల రాకపోకలు. ఎప్పుడు ఎవరిపై ఎవరు దాడి చేస్తారో తెలియని ఒక దయనీయ స్థితి. ఎక్కడో ఓ చోట ప్రతి రోజు వినపడే తుపాకి మోతలు. ఆ అమాయక గిరిజనం ఈ తుపాకి మోతల నడుమ తమదైన అటవీక జీవితానికి అలవాటుపడిపోయారు. కాని మా తరం ఇలా గడిచిపోయింది. వచ్చే తరమైన చదువుకోవాలన్న ఆలోచన ఆదివాసీలలో ఇప్పుడిప్పుడే మొదలైంది. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా పరిధిలోని దుమిరిపాల్ గ్రామం ఇప్పుడు వార్తలకెక్కింది. ఇక్కడ ఇటీవల పోలీసులు జరిపిన కాల్పుల్లో తల్లి చనుపాలు తాగుతున్న ఓ ఆరునెలల బాలుడు మృతి చెందడం ఈ గ్రామం వెలుగులోకి రావడానికి కారణమైంది. దుమిరిపాల్‌లో ఒక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉంది. వేసవి సెలవుల అనంతరం తిరిగి పాఠశాల తెరిచారు. జిల్లా కేంద్రానికి 40 కిలో మీటర్ల దూరంలో ఉండే ఈ పాఠశాలకు వెళ్లేందుకు పిల్లలు నిరాకరించారు. గతంలో అయితే పిల్లలను బడికి పోమ్మని తల్లిదండ్రులు చెప్పేవారే కాదు. తమ వెంట అడవికి తీసుకుపోయి వారి జీవితాన్ని అడవిపాలే చేసేవారు. కాని దుమిరిపాల్ గ్రామాన్ని అధికారులు, మీడియా ప్రతినిధులు సందర్శించడంతో గ్రామ ప్రజల్లో కొంత ఆలోచన ప్రారంభమైంది. తమ పిల్లలను కూడా చదివించాలన్న ఆలోచన మొలకెత్తింది. ఇప్పుడిప్పుడే తమ పిల్లలు బడికి వెళ్లమని మారం చేస్తే బలవంతంగా పాఠశాలకి తీసుకెళ్లి ఉపాధ్యాయులకు అప్పగిస్తున్నారు. ఒక మహిళ తమ కుమారుడు బడికి వెళ్లనని మారం చేస్తే ఈడ్చుకెళ్తున్న ఓ ఫోటో బాగా వైరల్ అయింది. ఇలా ఒకరిని చూసి ఒకరు పాఠశాలకు తమ పిల్లలను పంపిస్తున్నారు. గిరిజనుల్లో వచ్చిన ఈ మార్పు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది. నాగరిక ప్రపంచానికి దూరంగా బతికే ఈ గిరిజనం బడి బాట పట్టడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ మార్పు వస్తేనే అభివృద్ధి చెందుతారంటూ ఆదివాసీలను చైతన్యపరిచే కార్యక్రమంలో ఉన్నారు.

## గ్రీన్ ఫీల్డ్ హైవే డిజైన్ మార్చండి

ఖమ్మం, పాలేరు, మధిర నియోజకవర్గ ప్రజల విజ్ఞప్తి

ప్రజాపక్షం/ ఖమ్మం : ఖమ్మం, దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే డిజైన్ మార్చి బోనకల్ రోడ్డులోని ధంసలాపురం వద్ద (ఎన్‌హెచ్ 356 బిజి) ఎంట్రీ, ఎగ్జిట్ ఏర్పాటు చేస్తూ సర్వీస్ రోడ్లను ఏర్పాటు చేయాలని మధిర, పాలేరు, ఖమ్మం నియోజక వర్గాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎంఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో నగర మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లతో పాటు పలువురు సమావేశమయ్యారు. హైదరాబాద్ వైపు వెళ్లడానికి ఇటు మధిర, విజయవాడ వెళ్లేందుకు కూడా ఇక్కడ ఎంట్రీ, ఎగ్జిట్ అవసరమని సమావేశంలో పాల్గొన్న వక్తలు పేర్కొన్నారు. విలువైన భూములను గ్రీన్ ఫీల్డ్ హైవే కోసం ఇచ్చినప్పటికీ తమకు రోడ్డెక్కే అవకాశం కల్పించక పోవడం శోచనీయమన్నారు. ధంసలాపురం వద్ద ఎగ్జిట్, ఎంట్రీ అవకాశం కల్పిస్తే నాలుగు లక్షల జనాభా ఉన్న ఖమ్మం నగరంతో పాటు బోనకల్, చింతకాని మండలాలు, పాలేరు నియోజక వర్గ ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని వారు తెలిపారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు మేడారపు వెంకటేశ్వర్లు, మందడపు లక్ష్మి మనోహర్, ఆళ్ల నిరీషా అంజిరెడ్డి, మడూరి ప్రసాద్, మందడపు మనోహర్ రావు, మందడపు ప్రభాకర్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి, దేవరపల్లి శ్రీనివాసరెడ్డి, అమరగాని వెంకన్న, బెల్లం మనోహర్ చౌదరి, సిపిఐ నాయకులు రమేష్, బిఆర్ఎస్ నాయకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు మల్లు భట్టివిక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుకు వినతి పత్రాలు అందజేయాలని నిర్ణయించారు.



## ప్రమాదాల నివారణకు చర్యలు



**ప్రజాపక్షం/ కమలాపూర్:** రోడ్డు ప్రమాదాల నివారణకు ఆర్ అండ్ బి అధికారులు ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి ప్రమాదాలు అరికట్టాలని కాజీపేట ఏసిపి తిరుమల్ తెలిపారు. ఈనెల 28న ఏకశిల స్కూల్ వ్యాన్ ను కారు ఢీ కొట్టడంతో స్కూల్ వ్యాన్ బోల్తా పడి కారు నుజ్జు నుజ్జు కావడంతో ప్రమాదంలో ఒకరు మృతి చెందగా పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటన స్థలానికి శుక్రవారం కాజీపేట ఏసిపి తిరుమల్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ హరికృష్ణ, ఎస్ఐ వీరభద్రం రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సిపిని కలిసిన వెస్ట్‌జోన్ డిసిపి



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** ఇటీవల బదిలీపై వచ్చిన వెస్ట్ జోన్ డిసిపి (జనగామ డిసిపి) రాజమహేంద్ర నాయక్ శుక్రవారం మర్యాద పూర్వకంగా వరంగల్ పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝూను కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఇటీవలనే బాధ్యతలు చేపట్టిన రాజమహేంద్రనాయక్ వెస్ట్ జోన్ పరిధిలో శాంతి భద్రతల సమస్యల తలెత్తకుండా చూస్తానన్నారు. శాంత్రి భద్రతలు, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడతో పాటు పలు అంశాల్లో మార్పులు ఉంటాయని హామి ఇచ్చారు. ఈ సందర్భంగా సిపి అంబర్‌కిషోర్ ఝూ వెస్ట్ జోన్ డిసిపి రాజమహేంద్రనాయక్‌ను అభినందించారు.

## పారిశుద్ధ్య పనుల పరిశీలన



**ప్రజాపక్షం/కొల్చారం:** కొల్చారం మండలం కొంగోడ్, అంసాన్ పల్లి, సంగాయి పేట గ్రామ పంచాయతీల యందు నిర్వహిస్తున్న పారిశుధ్యం డ్రై డే పనులను ఎంపీడీవో లక్ష్మీ నర్సింలు పరిశీలించారు. అనంతరం వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి సంగాయిపేట గ్రామ పంచాయతీ సమావేశంలో అవగాహన చేయడం జరిగింది. పైపు లైన్ లీకేజలు లేకుండా చూడడం, మురికి కాలువలు శుభ్రం చేయించడం, పిచ్చి మొక్కలు లేకుండా శుభ్రం చేయడం, మంచినీటి సరఫరా ట్యాంకుల చుట్టూ శుభ్రం చేసుకోవడం, ప్రతి 15 రోజులకు దోమల నివారణకు ఫాగింగ్ చేయించడం, మురికి గుంత లలో ఆయిల్ బాల్స్ వేయించడం అనే కార్యక్రమాలు నిర్వహించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, హెడ్ మాస్టర్, అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## వంగర పోలీస్‌స్టేషన్ తనిఖీ




**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర పోలీస్‌స్టేషన్‌ను కాజీపేట ఎసిపి తిరుమల్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేసారు. ఎస్ఐ గది, సిబ్బంది, రైటర్, రికార్డు రూములతో పాటు బాత్‌రూములను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ రికార్డులు, సన్నిహిత జనరల్ డైరీ, కేడి, డిసి, రౌడీషీట్స్ రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేసారు. సిసి కెమెరాల పనితీరు తనిఖీ చేసి, డ్యూటీలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజల నుండి వచ్చే పిర్యాదుదారులతో మర్యాద పూర్వంగా మాట్లాడి సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా పనిచేయాలన్నారు. దరఖాస్తుదారులను ఎక్కువ రోజులు పోలీస్‌స్టేషన్ చుట్టూ తిప్పకూడదని, అవసరమైన వాటిని చట్టపరంగా కేసులు నమోదు చేయాలన్నారు. ప్రజలతో సత్సంబంధాలు పెంచుకోవాలని సూచించారు. సిబ్బంది శాఖ పరమైన సమస్యలు, రావాలసిన లావాదేవీలు ఉంటే తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి సిఐ ప్రవీణ్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## 18మందికి వైద్య పరీక్షలు



**ప్రజాపక్షం/జనగామ టౌన్:** జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో దృష్టిలోపం, వికలాంగుల సదరం క్యాంప్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం నిర్వహించడం జరిగింది. ఈ క్యాంపుకు 18 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు, అసోసియేట్ ప్రొఫెసర్ డా. జి వసంత, డాక్టర్లు సీహెచ్ సృజన్‌కుమార్, తేజశ్రీ, నాగిణి, శ్రీనాథ్, ఉమాదేవి, సదరం విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డి. వినత,జిల్లా గ్రామీణాభివృద్ధి సిబ్బందిపాల్గొన్నారు.

## బాల్యం నుండే విద్యపై శ్రద్ధ



**ప్రజాపక్షం/చిట్యాల/ మొగుళ్లపల్లి:** ఆసుపత్రులలో డాక్టర్లు గర్భిణీలకు సాధారణ కాన్పులు అయ్యే విధంగా చూడాలని,ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు బాల్యం నుండే విద్యపై మక్కువ చూపే విధంగా ఉపాధ్యాయులు మంచి బోధనలు అందించాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. చిట్యాల, మొగుళ్ళపల్లి మండలాలలో కలెక్టర్ రాహుల్ శర్మ శుక్రవారం పర్యటించారు. ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న మరమ్మతు పనులను, ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవలు, అంగన్వాడి టీచర్లకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. చిట్యాల మండలం జడల్ పేట, గాంధీనగర్, భీష్మనగర్ లోని ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. రామచంద్రపూర్‌లో అంగన్వాడీ టీచర్లకు జరుగుతున్న శిక్షణ తరగతులను పరిశీలించారు. అనంతరం చిట్యాల మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను తనిఖీ చేశారు.అనంతరం మొగుళ్ళపల్లి మండలంలోని అరేపల్లి ప్రాథమిక పాఠశాల,ఇస్సీపేట జిల్లా పరిషత్ ఉన్న త పాఠశాలలో పనులను పరిశీలించి విద్యార్థులతో కొద్ది సేపు ముచ్చటించారు. భవిష్యత్ లో ఏమి అవుతారని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చెప్పిన సమాధానంపై ఆయన మాట్లాడుతూ బాగా చదువుకోవడం వల్ల మీరు చెప్పిన విధంగా వైద్యులుగా, పోలీసులుగా, సాఫ్ట్వేర్ ఇంజినీర్స్ తదితర స్థాయికి చేరుకుంటారన్నారు.

# అర్హులకే ప్రభుత్వ పథకాలు

### పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/మంగపేట :** అర్హులైన పేద ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందుతాయని తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దణసరి సీతక్క అన్నారు. శుక్రవారం మంగపేట మండల కేంద్రంలో నాబార్డ్ నిధులతో 10 గదులు 10 షేట్టర్స్ కు 1కోటి 29 లక్షలు రూపాయలతో నిర్మించిన రైతు సేవ సహకార సంఘం కాంప్లెక్స్ భవనాన్ని తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దణసరి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకరా, టిఎస్ఐటిడిఏ పిఓ చిత్రా మిశ్రాలతో కలసి ప్రారంభించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ రైతులకు కొరత రాకుండా ఎరువులు, మందులు అందించాలన్నారు. అతి త్వరలో మండలంలో బస్టాం డ్ నిర్మిస్తామని ముంపు ప్రాంతాలకు రక్షణనగా కరకట్ట పనులు నాణ్యత లోపించకుండా లేటెస్ట్ టెక్నాలజీ ఉపయోగించి పూర్తి చేస్తామన్నారు. అర్హులైన పేద ప్రజలకు ప్రభుత్వం తరుపున అన్ని పథకాలు అందుతాయని, రైతులకు ఏక కాలంలో 2 లక్షల రుణమాఫీ ముఖ్యమంత్రి రేవంతరెడ్డి చేసి తీరుతారని దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ఇది ప్రజల ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని అన్నారు. పోదుమూరు గ్రామం వద్ద గోదావరి కరకట్ట పనులను పర్యవేక్షించారు. కమలాపురం బిల్ట్‌ను సందర్శించి అక్కడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ తోట రమేష్, సొసైటి జిల్లా అధ్యక్షులు మార్నెని రవీందర్, మాజీ చైర్మన్ వల్లేపల్లి శివయ్య, ఎఎస్పి మహేష్ గితే కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి, బిఆర్ఎస్ అధ్యక్షులు కుడుముల లక్ష్మి నారాయణ, సొసైటీ డైరెక్టర్ లు కాంగ్రేస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మావోయిస్టుల కదలికలపై అప్రమత్తం

**ప్రజాపక్షం/కాళేశ్వరం:** తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కదిలికలపై పోలీసులు అప్రమత్తంగా ఉండాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. కాళేశ్వరం పోలీసు స్టేషన్‌ను శుక్రవారం జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో రికార్డులను, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లాలో మావోల ప్రాబల్యం ఉన్నందున మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో ఈ ప్రాంత పోలీసులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సరిహద్దులోని మహారాష్ట్రలో మావోల కదిలికలు అధికంగా ఉండడంతో గోదావరి నది దాటి జిల్లా ప్రాంతాలకు చేరే అవకాశం ఉన్నందున పటిష్ట నిఘా పెట్టాలని సూచించారు. అలాగే పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు సిబ్బంది, అధికారులు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని దిశానిర్దేశం చేశారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని అన్నారు.

# ఎప్పటికీ పివి జీవితచరిత్ర మార్గదర్శకం

### రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్




**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** భారతదేశ మాజీ ప్రధాన మంత్రి స్వర్గీయ పీవీ నర్సింహారావు మనందరికీ ఆదర్శ ప్రాయుడని, వారి జీవిత చిత్ర మార్గదర్శకత్వం అని తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. భీమదేవరపల్లి మండలం పీవీ స్వగ్రామమైన వంగరలో పీవీ 103 జయంతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పీవీ విగ్రహాలనికి పూలమాల వేసి నివాళులర్పించి పీవీకి అమర్‌హై అంటూ నినాదాలు చేశారు. అనంతరం పీవీ నర్సింహారావు నివాసానికి వెళ్లి అక్కడ పీవీ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం వారి నివాసంలో ఏర్పాటుచేసిన సభలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. వంగరలో పుట్టి పరిజ్ఞానంలో భారతదేశంలోనే కాదు ప్రపంచంలోనే పీవీ నర్సింహారావుని మించి వారు లేరన్నారు. పీవీ నర్సింహారావు జయంతి వేడుకల్లో ఆయన ఇంట్లో పాల్గొనే అవకాశం కలిగింది. వంగర ప్రాంత సమస్యలకు వేదిక ఉంటుందని హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమం కాకుండా ఇక్కడ పాల్గొన్నాను. వంగర ప్రాంతానికి గతంలో ప్రకటించిన అంశాలపై స్థానిక ఎమ్మెల్యేగా శ్రద్ధ వహిస్తా. పీవీ వాటర్ ప్లాంటు, రోడ్లు ఇతర ఏ సమస్యలున్నా పరిష్కరిస్తా. రాజకీయ నాయకుడికి ప్రేమ, పరిపాలనకు సంబంధించి కటువుగా ఉండాలన్నారు. పీవీకి 14 భాషలే కాదు.. మౌనంగా ఉండే 15వ బాష కూడా తెలుసు అన్నారు. ఈ గడ్డ మీద పుట్టిన పీవీ నర్సింహారావు ఇంట్లో ఉండి మాట్లాడటం అదృష్టమన్నారు. భూ సంస్కరణలు, విదేశాంగ విధానం, ఆర్థిక సంస్కరణలు ఇలా ఎన్నో చేశారు. ఇందిరా గాంధీ పీవీ దగ్గర సలహాలు తీసుకునే వారన్నారు. నా రాజకీయ గురువు చొక్కారావుని చొక్కన్న అని పీవీ నర్సింహారావుని పిలిచే వారు. ఓపికగా విని సమస్య పరిష్కారం చేసే వారి దగ్గర శిష్యరికం చేసిన. ఎన్నికలప్పుడు ఒక మాట చెప్పిన హుస్నాబాద్ నిర్లక్ష్యానికి గురైంది. మీ నియోజకవర్గం హుస్నాబాద్ అంటే గౌరవం పెంచుతా అని చెప్పా ఆ దిశగా చేస్తున్నా. మేము పార్లమెంటులో లేకపోతే తెలంగాణ ఏర్పాటయ్యే పరిస్థితి లేదు. సోనియాగాంధీ, మీరాకుమార్, సుష్మాస్వరాజ్ అం దరంకలిసి తెలంగాణఏర్పాటు చేసుకున్నాం. పీవీ కుమార్తె ఎమ్మెల్సీ వాణి అక్కను సెక్రటేరియట్‌లో కలిస్తే ఛాంబర్‌కి తీసుకపోయి సన్మానించుకున్నాం. పీవీ కూతురు, కుమారుడు హైకోర్టు జడ్జిగాఉన్నారు.వారి వారసులు మంచి హోదాలో ఉన్నారు. ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్, మాజీ ఎంపీ రాజయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, పీవీ మదన్‌మోహన్‌రావు, వైస్ ఎంపీపీ మాడుగుల ఎజ్రా, కర్ణకంటి మంజులారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఫైర్‌మన్ శ్యాంసుందర్‌కు సన్మానం

**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండల కేంద్రంలోని అగ్నిమాపక కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న లీడింగ్ ఫైర్ మాన్ శ్యాంసుందర్‌కు ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న సందర్భంగా శుక్రవారం అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం అధికారి (ఎస్ఎఫ్‌వో) శ్రీరాములు, సిబ్బంది శ్యాంసుందర్‌ను ఘనంగా సన్మానించారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన శ్యాం సుందర్ సేవలను సిబ్బంది కొనియాడారు. ఈ కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మాన్ పి కిరణ్‌కుమార్, సిబ్బంది అశోక్, వెంకటేష్, నరసింహ, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



# అంతరాలు లేని విద్య అందించండి

### ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** సమాజంలో రోజు రోజుకు విద్యలో అంతరాలు పెరిగిపోతున్నాయి, దీనిని నిలువరించి అందరికి నాణ్యమైన విద్య అందిస్తూ అంతరాలు లేని విధంగా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉప్పలయ్య పదవి విరణ కార్యక్రమం ఇంఛార్జీ ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి అలుగుబెల్లి నర్సిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులుగా 35 ఏండ్లు సేవలందించి ఎందరికో మార్గదర్శకులుగా నిలిచారన్నారు. పదవి విరమణ తరువాత కూడా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పాటుపడాలని, విద్యారంగ ప్రైయివేటైజేషన్‌లో తెలంగాణ ముందుందని,ఇది మారాలంటే ప్రభుత్వ రంగ విద్య బలపడాలన్నారు. ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించాల్సినబాధ్యత ప్రభుత్వాలదే అన్నారు. డిఈఓ రాము మాట్లాడుతూ ఉప్పలయ్య మంచి ఉపాధ్యాయుడని, ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ పాఠశాల బలోపేతానికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మేకల కళింగరాజు, ఎంఇఓ భగవాన్, ఎంఎన్ఓ రాజేందర్, టిఎస్‌యూటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చంద్రశేఖర్‌రావు, శ్రీనివాసరావు, వార్డు కౌన్సిలర్ మహంకాళి హరిశ్చందర్, ఎఎపిసి ఛైర్మన్ జీవనజ్యోతి, జిల్లా కార్యదర్శి సుధీర్‌రెడ్డి, మండల అధ్యక్ష కార్యదర్శులు శ్రీధర్, శ్రీనివాస్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వెల్దుర్తిలో 100 ధరణి దరఖాస్తులు పెండింగ్

### జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్



**ప్రజాపక్షం/వెల్దుర్తి:** గతంలో రైతులు భూసమస్యల పరిష్కారానికి పెట్టుకున్న దరఖాస్తులు త్వరలో పరిష్కారం అవుతాయని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శుక్రవారం మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంలోని తహసీల్దార్ కార్యాలయంను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను, ప్రాథమిక పశు వైద్య కేంద్రాలను తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డు రూమ్‌ను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని మందులను, రికార్డులను, ప్రాథమిక పశువైద్య కేంద్రంలోని మందులను అందిస్తున్న సేవల గురించి కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ... జిల్లాలో ప్రత్యేక కార్యాచరణ అమలు చేసి వారం రోజుల్లో పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. ఈమేరకు మండల తహసీల్దార్లు రోజువారిగా విభజించుకోని సమస్యలను పరిష్కారించాలని ఆదేశించారు. వెల్దుర్తి మండలంలో100 ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని,చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు సౌజన్యకు కలెక్టర్ సూచించారు. అలాగే పశువులు రోగాల బారిన పడకుండా వైద్యులు సమయపాలన పాటించి, అందుబాటులో ఉండాలని వైద్యురాలు రేఖకు ఆదేశించారు. తహసీల్దార్ తులసీరామ్, ఆర్ఐ జయభరత్ రెడ్డి, ఇంచార్జి ఎంపీడీవో విఘ్నేశ్వర్ ఉన్నారు.

# ధరణి సమస్యలకే ప్రాధాన్యం

### మెదక్ ఆర్డీవో రమాదేవి



**ప్రజాపక్షం/రామాయంపేట:** రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధరణిలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మెదక్ ఆర్డీవో రమాదేవి తహశీల్దార్ రజని కుమారిని ఆదేశించారు. శుక్రవారం రామాయంపేట తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. అనంతరం సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ధరణి సంబందిత పిర్యాదులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలన్నారు. మెదక్ నుండి ఎల్కతుర్తి వరకు కొనసాగుతున్న జాతీయ రహదారి పనులను ఆర్డీవో పర్యవేక్షించారు. మున్సిపాలిటీ పరిదిలో 2.65 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డు నిర్మాణానికి అధికారులు ప్రతిపాదించారు. జంక్షన్ల ఏర్పాటు నక్షను పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు. తహశీల్దార్ రజనికుమారి, ఆర్ఐ రాజుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం





**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి :** మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు లో శుక్రవారం రోజు ఫ్రైడే సందర్భంగా డ్రైడే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ది అజయ్ సారథి రెడ్డి, జిల్లా మలేరియా అధికారి డిఎంఓ సుధీర్ రెడ్డి మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో ప్రజలందరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా అరికట్టాలని పిలుపునిచ్చారు మూరికి గుంటల్లో దోమలు ఈగలు రాకుండా ఆయిల్ బాల్స్ వేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని పిలుపునిచ్చారు. వర్షాకాల నేపథ్యంలో దోమల కారణంగా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ తదితర ప్రమాదకరమైన జబ్బులు రాకుండా ప్రజలందరూ పరిశుభ్రత పాటించి స్వీయ నియంత్రణ అనుసరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కృష్ణ అర్జున్ రావు కె.వి.రాజు, పురుషోత్తం, అశ్విని, మాధవి, రాధ, మల్లీశ్వరి, యశోద, విజయ, రజియా బేగం, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, రేషపల్లి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## నిత్యం ప్రజల క్షేమమే లక్ష్యం

### జిల్లా ఎస్‌పి డాక్టర్ శబరిష్ ఐపిఎస్



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** ఏజెన్సీ గ్రామాలైన పాముసూరు, పెనుగోలు, చెలిమేలగ్రామాలలో బాంబు స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ మావోయిస్టులు తన ఉనికిని చాటుకోవడం కోసం అసాంఘిక కార్యకలాపాలు జరపడం ఉద్దేశ్యంగా మందు పాతరలు అమర్చుతున్నారని తద్వారా ఆదివాసీ ప్రజలు వన్యప్రాణులు ప్రానాలు కోల్పోతున్నారని కాగా మందు పాతరలు అమర్చే అవకాశం ఉన్న అన్ని అనుమానిత ప్రాంతాలను బాంబు స్క్వాడ్ బృందాలచే విశృత తనిఖీలు చేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో తనిఖీలను మరింతగా పెంచి నిఘా వ్యవస్థను మరింతగా బలోపేతం చేస్తామని ఇప్పటికే సాంకేతిక పరికరాలైన డ్రోన్ వంటి వాటిని ఉపయోగించి నిరంతరం నిఘా ఉంచుతున్నామని మావోయిస్టు దుశ్చర్యలను తప్పక అడ్డుకుంటామని,స్వార్థ ప్రయోజనాల కోసం అమాయక ఆదివాసీ ప్రజల ప్రాణాలు తీస్తున్న మావోయిస్టులనుఎదుర్కొంటామని తెలిపారు. ప్రజలు అడవుల లోకి వెళ్లేటప్పుడుజాగ్రత్తలు తీసుకోవాలని, ఎవరూ కూడా మావోయిస్టులకు సహకరించవద్దని, అనుమానిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీస్ వారికి సమాచారం అందించాల్సిందిగా ఎస్పి తెలిపారు.

# జనగామలో మోస్తరు వర్షం..

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** జనగామలో గురువారం రాత్రి మోస్తారు వర్షం కురిసింది. ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో పలు చోట్ల చెట్లు విరిగాయి. క్రిస్టన్ పాఠశాలకు ఎదురుగా హైదరాబాద్‌హన్మకొండ జాతీయ రహదారిపై చెట్టు విరిగడి పడడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. రాత్రి 11 గంటల సమయంలో చెట్టు విరగగా ఎవరు పట్టించుకోలేదు. దీనితో హన్మకొండ నుండి హైదరాబాద్ వెల్లె వాహనదారులకు ఇబ్బందులు తలెత్తాయి. దేవీ థీయేటర్ సమీపంలో నుండి వాహనాలు మళ్లించారు. ఉదయం 5 గంటల సమయంలో చెట్టు తొలగించారు. జిల్లాలో 327.4 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదు కాగా ఓరాల్‌గా 27.3 సెంటీ మీటర్లు నమోదైంది. అత్యధికంగా నర్మెట మండలంలో 69.8 మిల్లీ మీటర్లు కురిసింది. తరిగొప్పులలో 61, చిప్పూర్‌లో 42.8, జఫర్‌గడ్‌లో 20.2 స్టేషన్‌గనపూర్‌లో 36.4. రఘునాథపల్లిలో 23.2, బచ్చన్నపేటలో 14.2, జనగామలో 25.4, లింగాలఘనపురంలో 21.4, దేవరుప్పలలో 3, పాలకుర్తిలో 6.2, కొడకండ్లలో 3.8 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదైంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో పత్తితో పాటు ఇతర పంటలకు మేలు జరిగే అవకాశం ఉండడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే క్రిమినల్ కేసులు

### మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



**ప్రజాపక్షం/వర్ధన్నపేట:** నకిలీ విత్తనాలు అమ్మితే క్రిమినల్ కేసులు పెట్టాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. శుక్రవారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని జ్ఞానాంబిక ఎరువుల దుకాణంలో నకిలీ విత్తనాలు కొని మోసపోయామని ఆందోళనకు దిగిన రైతులకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సంఘీభావం తెలిపారు. వరి విత్తనాలు కొని ఐదు రోజులు గడుస్తున్న మొలకలు రాలేదని నకిలీ విత్తనాలు కొని మోసపోయామని రాయపర్తి మండలం తిరుమలయ్యపల్లి గ్రామానికి చెందిన మహేష్ నాగరాజుని రైతులు ఎర్రబెల్లి ఎదుట వాపోయారు. వారి ఆవేదనను విన్న దయాకర్ రావు జిల్లా కలెక్టర్, వ్యవసాయశాఖ అధికారులతో చరవాణిలో మాట్లాడి అమాయక రైతులకు నకిలీ విత్తనాలు అమ్మిన ఎరువుల దుకాణ యజమానిపై చర్యలు తీసుకోవడంతో పాటు నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టాలని కోరారు. ఇంత జరుగుతున్న అధికారులుగా మీరు ఏం చేస్తున్నారంటూ ఎర్రబెల్లి అధికారులను ఆగ్రహం వ్యక్తం చేశారు. నకిలీ విత్తనాలతో మోసపోయిన రైతులకు నష్టపరిహారంతో చెల్లించడం తోపాటు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేసి కారకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎర్రబెల్లి డిమాండ్ చేశారు.



## పట్టా భూమిలో వెలసిన గుడిసెలు

ప్రజాపక్షం/దండేపల్లి: దండేపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని పట్టా భూమిలో సిపిఐ ఆధ్వర్యంలో శుక్రవారం తెల్లవారు జామున పేదలు చీరెలతో గుడారాలు వేసుకున్నారు. విషయం తెలుసుకున్న దండేపల్లి ఎస్ఐ లింగంపెల్లి భూమేష్ తన సిబ్బందితో వచ్చి గుడిసెలు వేసుకున్న పేదలు, సిపిఐ మండల ప్రధాన కార్యదర్శి పేర్క రాజేష్‌తో చర్చలు జరిపారు. వేసిన గుడారాలు తీయాలని లేనట్లయితే కేసులు తప్పవని ఎస్ఐ తెలుపగా సిపిఐ మండల ప్రధాన కార్యదర్శి పెర్క రాజేష్ మాట్లాడుతూ ఇండ్లు లేక, నిలువ నీడ లేక తాము పలు మార్లు ప్రభుత్వానికి ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని మొర పెట్టుకున్న పట్టించుకోకపోవడం తో గుడిసెలు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. పేదల ఇండ్లకు భూకేటాయింపుకు తహసీల్దార్‌కు వినతిపత్రం ఇవ్వాలని ఎస్ఐ సూచిం చడంతో పేదలతో కలిసి సిపిఐ నాయకులు ర్యాలీగా వెళ్ళి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించి అందజేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రతి ఇంటికి సంక్షేమం ఫలాలు అందించాలని కోరారు.

## కళాశాల నిర్మాణ భవనానికి స్థల పరిశీలన



ప్రజాపక్షం/జగిత్యాలరూరల్ : జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఐటిఐ కళాశాల ఆధునీకరణ పద్ధతిలో స్వంత భవన నిర్మాణం చేపట్టడానికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యో తి లక్ష్మ ణ్, మాజీ మున్సిపల్ చైర్మన్, పిసిసి సభ్యులు గిరి నాగభూషణం, పిసిసి సెక్రటరీ బండ శంకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జున్ను రాజేందర్, ఎంపిపి మహేష్, ధరూర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాపై కొరడా

### నిల్వ ఉంచిన కుప్పలు సీజ్



ప్రజాపక్షం/పెంచికల్‌పేట్: అక్రమంగా ఇసుక దందా చేస్తున్న వారిపై అధికా రులు శుక్రవారం దాడులు నిర్వహించారు. మం డలంలో గలవివిధ ప్రాంతాల (బ్రిక్స్) ఇటిక బట్టిలలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను పట్టుకున్నట్లు మైనిం గ్ ఏడి గంగాధర్ తెలిపారు.ఇటుక తయారీ కోసం, అక్రమ రవాణాకు సిద్ధంగా ఉందని సమాచారంతో అధికారులు దా డులు నిర్వహించారు. మొత్తం సుమారు 225 ట్రాక్టర్లకు పైనే ఇసుక నిల్వ ఉన్న పట్టుకున్నట్లు తెలి పారు. ఇసుక రవాణాకు సరైన పత్రాలు లేని నిల్వలకు ఒక ట్రిప్పుకు 1400 చొప్పున డిడి చెల్లించి చూ పించాలని, డిడిలు చెల్లించని యెడల ఇటుక బట్టిలను సీజ్ చేయడం జరు గుతుందని మైనింగ్ అధికారులు పేర్కొన్నారు. ట్రిప్పుకు ఒక్క డిడి చెల్లించి వందల ట్రిప్పులు కొట్టుకుంటున్నారని, మండల అధికారులు మామూళ్ల మత్తులో చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని అందుకే మండలంలో ఇసుక అక్రమ రవాణా అధికంగా జరుగుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ ఇసుక దాడుల్లో రాయల్టీ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్ రెడ్డి, రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ గోపాల్ లు ఉన్నారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి : జిల్లా కలెక్టర్



ప్రజాపక్షం/ నిర్మల్‌టౌన్ : వర్ష కాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినావ్ అన్నారు.ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని శాంతినగర్,అస్రా కాలనీలో శుక్రవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్,మున్సిపల్ చైర్మన్ గంద్రత్ ఈశ్వర్ పర్యటించారు. దోబలు వృద్ధి చెందకుండా మురుగు కాలువల్లో ఆయిల్ బాల్స్ వేశారు.ప్రతీ ఫ్రైడే డ్రై డే ను పాటంచాలని,డెంగ్యూ,సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు.ఇంటి పరిసారా లలో పాత టైర్లు,కొబ్బరి చిప్పలు,ప్లాస్టిక్ కవర్లు,వాడిన టీ కప్పులు, ఇతర నీటి నిలువలు గత ప్రాతలను ఎప్పటికప్పుడు తొలగించాలని అన్నారు. ఇండ్లలో వాడే కూలర్, ఫ్రీజ్, ఏసీలలో నీరు నిల్వ లేకుండా శుభ్రపరుచుకొనాలని అన్నారు.అనారోగ్యానికి గురైతే వెంటనే ఆసుపత్రిలో వైద్య చికిత్స తీసుకోవాలని కోరారు.ఇందులో మున్సిపల్ చైర్మన్ గంద్రత్ ఈశ్వర్,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్,సానిటరీ ఇన్స్పెక్టర్ దేవిదాస్,స్థానిక కౌన్సిలర్ అన్వర్ పాషా,తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి : అరుణశ్రీ



ప్రజాపక్షం/ముత్తారం : అమ్మ ఆదర్శ పనుల్లో భాగంగా పెండింగ్ ఉన్న పనులను సత్వరమే పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణశ్రీ అన్నారు. ముత్తారం మండలం దరియాపూర్ గ్రామంలోని మోడల్ పాఠశాలను శుక్రవారం అదనపు కలెక్టర్ సందర్శించారు. పాఠశాల పరిసరాలను, మరుగుదొడ్లను, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనంపై విద్యార్థులను అడిగి తెలు సుకున్నారు. విద్యార్థుల సంఖ్య, హాజరు శాతాన్ని రికార్డుల ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పనుల్లో భాగంగా చేపట్టిన పాఠశాల అభివృద్ధి పనుల ను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అం దించాలని సూచించారు. వర్షా కాల దృష్ట్యా పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో సందర్శించారు. గ్రామంలోని సెగ్రిగేషన్ షెడ్, నర్సరీని పరిశీ లించారు. హరితహారంలో భాగంగా ప్రతి ఇంటికి 5 మొక్కలు అందించేలా చర్యలు చేపట్టాలని, గ్రమంలో ఎప్పటికప్పుడు మరుగుదొడ్ల నిర్వహణ, దోమలు ప్రబలకుండా చూసుకోవాలని కార్యదర్శి కి ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఇఇ శ్రీనివాస్, ఎంపిఓ బైరి వేణుమాధవ్, పంచాయతీరాజ్ ఎఈ వరలక్ష్మి, గ్రామ కార్యదర్శి ప్రేమలత తదితరులున్నారు.

# తూతూ మంత్రంగా సిడిపిఒపై విచారణ




ప్రజాపక్షం/నిర్మల్‌ప్రతినిధి : ఖానాపూర్ ఐసిడిఎస్ పరిధిలో సిడిపిఓ సరిత అవినీతి అక్రమాలకు పాల్పడుతుందని ప్రజాపక్షం వార్త కథనాలకు స్పందిస్తూ బాధితుల ఫిర్యాదు మేరకు సరితపై విచారణ మొదలైంది.నిర్మల్ సిడిపిఓ,జిల్లా ఇన్చార్జి విచారణ అధికారిగా కొనసాగుతున్నారు.గురువారం పలువురు అంగన్వాడీ కార్యకర్తలను ఖానాపూర్ కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయానికి పిలిపించుకొని విచారణ అధికారి పలు అంశాలను వారితో విచారించారు.ఈ ప్రక్రియ కొనసాగే అవకాశం ఉంది.కాగా ఈ విచారణ పై పలువురు అనుమానాలు వ్యక్తపరుస్తున్నారు.

ఇక్కడి వరకు విచారణ అంతా బాగానే ఉన్నా విచారణ తూతూ మంత్రంగా సాగుతుంది. అని పలువురు అనుమానాలు వ్యక్తపరుస్తున్నారు.సిడిపిఓ సరితను అక్రమాలపై విచారణ చేపట్టేంచారు.ఒక సిడిపిఓ ను విచారించడానికి మరొక సిడిపిఓ ను విచారించడానికి మరొక సిడిపిఓ ను నియమించడం ఇక్కడ పలు అనుమానాలకు తావిస్తోంది. జిల్లా ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నప్పటికీ వారు కూడా సిడిపిఓ కాబట్టి విచారణ పైపైనే చేపట్టే అవకాశం ఉందని, పూర్తిగా విచారణ చేపట్టే అవకాశం ఉండదేమో అని పలువురు నాయకులు భావిస్తున్నారు. దానికి ఆజ్యం పోసేలా విచారణ పలువురు, కార్యకర్తలను మాత్రమే కార్యాలయానికి పిలిపించుకొని చేయడం కాస్త విడ్డూరంగా కనిపిస్తుందని అంటున్నారు. విచారణ అనేది లోతుగా జరగాలంటే,నిజా నిజాలు బయట పడాలంటే ఉన్నత స్థాయి అధికారులు నియమించాలని పలువురు కోరుతున్నారు.అలా టప్పు డే విచారణ సాధికారికంగా జరుగుతుందని అంటున్నారు.

**విధులలో కొనసాగి-స్తూనే విచా-రణ...!**

అభియోగాలు ఎదుర్కొంటున్న సదరు సిడిపిఓ ను విధులలో కొనసాగిస్తూనే విచారణ చేపట్టడంతో పలువురు విచారణ పారదర్శకంగా జరుగుతుందా అని అనుమానాలు వ్యక్తపరుస్తున్నారు. విచారణ పారదర్శకంగా కొనసాగాలంటే విచారణ పూ ర్తయ్యేంత వరకు సదరు సిడిపిఓ ను విధులకు దూరంగా ఉంచాలని పలువురు భావిస్తున్నారు.విచారణ సమయంలో సదరు సిడిపిఒ విచారణ తనకు అనుకూలంగా జరిగేలా సంబంధిత అంగన్వాడీ కార్యకర్తలను ప్రేరేపిం చే అవకాశం ఉందని,విచారణ పూర్తయ్యే వరకు విధులకు దూరంగా ఉంచాలని పలువురు కోరుతున్నారు.

**అంగన్వాడీ కార్యకర్తలపై ఒత్తిడి...?**

అభియోగాలు ఎదుర్కొంటున్న సిడిపిఒ సరిత విధులను నిర్వర్తిస్తూ ఉండటంతో నిజానిజాలు, వాస్తవాలను చెప్పడానికి అంగన్వాడీ కార్యకర్తలు ముందుకు వచ్చే అవకా శం లేదని పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విచారణ సమయంలో సదరు సిడిపిఓ తనకు అనుకూలంగా చెప్పాలంటూ అంగన్వాడీ టీచర్ల పైన ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.దీంతో అంగన్వాడీ టీచర్ల పరిస్థితి అడకత్తెరలో వక్కలాగా మారింది. వాస్తవాలను చెబితే ఎక్కడ తమను ఇబ్బందులకు గురి చేస్తారో అనే భయాందోళన మొదలైందని పలువురు భావిస్తున్నారు.

**నిజాలు చెప్పడానికి అంగన్వాడీలు ముందుకు వచ్చేనా?**

అభియోగాలు ఎదుర్కొంటున్న సిడిపిఒపై విచారణ అధికారిగా మరొక సిడిపిఓ ను నియమించడం వెనక మతలబు ఏంటో అర్థం కావడం లేదని పలువురు నాయకులు,ప్రజలు అనుమానాలు వ్యక్తపరుస్తున్నారు.విచారణ సమయంలో విచారణ అధికారిగా ఉన్న సిడిపిఓ విచారణ పూర్తయిన తర్వాత ఎవరెవరు ఏం చెప్పారు తదితర విషయాలను అభియోగాలు ఎదుర్కొంటున్న సిడిపివోకు చెబితే తమ భవిష్యత్తు పరిస్థితి ఏంటని అంగన్వాడీలు భయపడుతున్నట్లు సమాచారం.దీంతో విచారణ సమయంలో వారు నిజాలు చెప్పడానికి ముందుకు వచ్చే అవకాశం లేదని పలువురు భావిస్తున్నారు.విచారణ పారదర్శకంగా జరగాలంటే ఇతర జిల్లా వారిని,లేదా ఆపై అధికారిని విచారణ అధికారిగా నియమిస్తే నిజానిజాలు బయటకు వస్తాయని ప్రజలు కోరుతున్నారు.

**బ్యాంకు లావాదేవీలు క్షుణ్ణంగా పరిశీలించాలి**

విచారణ కేవలం మౌఖికంగా కాకుండా పూర్తి క్షుణ్ణంగా జరగాలని ప్రజలు భావిస్తున్నారు.సదరు సిడిపిఓ అంగన్వాడీ టీచర్ల దగ్గర నుండి,ఆయాల దగ్గర నుండి 400 వసూలు చేసిందని,ఫ్లెక్సీల కొరకు వెయ్యి రూపాయలు వసూలు చేసిందని అభియోగాలు ఎదుర్కొంటున్నారు.ఇవ్వని వారిపై కక్ష కట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారు.అని ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో వాస్తవాలు బయటపడాలంటే సదరు సిడిపిఓ,సూపర్వైజర్ల బ్యాంకు లావాదేవీలు,ఫోన్ పే, గూగుల్ పేలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అప్పుడే వాస్తవాలు బయటపడతాయని ప్రజలు, పలువురు నాయకులు డిమాండ్ చేస్తున్నారు.విచారణ మౌఖికంగా నిర్వహిస్తూనే బ్యాంకు లావాదేవీలను పరిశీలించాలని కోరుతున్నారు.విచారణ పూర్తయ్యేంతవరకు సదరు సిడిపిఓ ను విధుల నుండి దూరంగా ఉంచాలని,సిడిపిఓ పై విచారణ అధికారిగా పై అధికారిని నియ మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ఏది ఏమైనాప్పటికీ మరికొన్ని రోజులలో సిడిపిఓ పై ఉన్న ఆరోపణల వాస్తవాలు వెలుగులోకి రానున్నాయి.

## ఆధారాలు ఇచ్చినా..విచారణ చేపట్టరా...?

### ప్రజాసంఘాల మండిపాటు

### ఖానాపూర్ సిడిపిఓను సస్పెండ్ చేసే వరకు ఉద్యమిస్తాం



ప్రజాపక్షం/ఖానాపూర్ : ఖానాపూర్ ఐసిడిఎస్ అధికారిని,సిడిపిఓ సరిత అక్రమాలపై, అన్ని ఆధారాలు జిల్లా, రాష్ట్ర స్థాయి,అధికారులకు అందించినప్పటికీ, సిడిపిఒ, సరితపై విచారణ చేపట్టకపోవడం విడ్డూరంగా ఉందని, నిర్మల్ జిల్లా, ప్రజా సంఘాల నాయకులు మం డిపడ్డారు. ఈ మేరకు, శుక్రవారం, ఖానాపూర్ ఐబిలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సిపిఐ ఎమ్మెల్ మాస్ లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నందిరామయ్య మాట్లాడుతూ ఈ నెల ఆరవ తేదీ సిడిపిఓ అవినీతిపై, అన్ని ఆధారాలతో, ఆశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ, ఎటువంటి చర్యలు లేకపోవడం విడ్డూరమని,గత మూడు సంవత్సరాలుగా, ఎన్నో అక్రమాలకు పాల్పడుతున్న సిడిపిఓపై, పలు ప్రజాసంఘాల నాయకులు, అంగన్వాడీ, కార్యకర్తలు, ఆయాలు, ఫిర్యాదు చేసినప్పటికీ, ఇప్పటికీ విచారణ చేపట్టకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నా రు. సిడిపిఓ కింది స్థాయిలో ఉన్న అంగన్వాడీల్లో, కొందరు సెక్టార్ అధికారులుగా ప్రవర్తిస్తూ,అనేక మంది దగ్గర బలవంతంగా డబ్బులు వసూలు చేయడం, ఆధారాలతో తమ వద్ద ఉన్నాయ, అధికారులకు ఇచ్చినప్పటికీ ఎటువంటి చర్య లు తీసుకోకపోవం, అనుమానాలకు తావిస్తుందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కు మార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్,అధ్యక్షులు పి.గంగామణి, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షుడు విజయ,సెక్టార్ అధ్యక్షులు మనీంద్ర,వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు డాకూర్ తిరుపతి, కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, శంభూ, అంగన్వాడీ టీచర్ రాణి,రాజన్న ఉన్నారు.

## వెంటనే నిధులు మంజూరు చేయాలి




ప్రజాపక్షం/ఆసిఫాబాద్:జిల్లాలో మనఊరు మనబడికి సంబంధించి పెండింగ్ నిధులు వెంటనే మంజూరు చేయాలని ఆసిఫాబాద్ ఎంఎల్‌ఏ కోవలక్ష్మీ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి మల్లి కార్జున్ అధ్యక్షతన నిర్వహించిన చిట్టచివరి మండల సర్వసభ్య సమావేశానికి జడ్‌పిటిసి నాగేశ్వరరావు, సింగిల్ విండో చైర్మన్ అలిబిన్‌అహ్మద్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యా రు. శాఖల మండల స్థాయి అధి కారులు తమ అభివృద్ధి నివేదికలను ప్రవేశపెట్టారు. విద్యాశాఖ నివేదిక సందర్భంలో మన ఊరు మనబడి పెం డింగ్ నిధుల గురించి చర్చ జరిగింది. ఈ సంద ర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ మన ఊరు మనబడి నిధులు పెండింగ్ ఉండగా ప్రస్తుతం అమ్మ ఆదర్శ పాఠశాల పేరుతో పనులు కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్ నిధులు వెంటనేమంజూరు చేయాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. జడ్‌పిటిసి నాగేశ్వరరావు మాట్లా డుతూ ఐదు సంవత్సరాల పరిపాలనలో సాధ్యమైనంత అభివృద్ధి చేశామని తెలిపారు. ఎంపిపి మల్లికార్జున్ మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. సింగిల్‌విండోచైర్మన్ అలిబిన్ అహ్మద్ మాట్లాడుతూ స్థానిక సంస్థల అభివృద్ధి గత పది సంవత్సరాల్లో ఎనలేనంతగా జరిగిందని అన్నారు. అనంతరం చివరి సమావేశం కావడంతో మండల పరిషత్ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాస్, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపిటిసిలు, మండల స్థాయి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## మాకు న్యాయం చేయండి

### కోనరావుపేట ఎస్ఐ వేధిస్తున్నాడు




ప్రజాపక్షం/కోనరావుపేట : రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల ఎస్ఐ ఆంజనేయులు వేధింపులకు గురి చేస్తున్నాడని, చేయని పని ఒప్పుకోమని బెదిరిస్తున్నాడని, జై సేవాలాల్ ఊరుతండా గ్రామానికి చెందిన మాలోతు నరస్ అనే వ్యక్తి తన గోడు వెల్లబోసుకున్నాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం నిమ్మపల్లి గ్రామానికి చెందిన నరస్ అనే వ్యక్తి ట్రాక్టర్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత మంగళవారం రోజున ఎస్ఐ ఆంజనేయులు తన ట్రాక్టర్ తీసుకుని స్టేషన్‌కు రావాలని చెప్పగా, స్టేషన్‌కు తీసుకొని వెళ్లానని, నీవు దర్ర మల్లయ్య పొలం వద్ద రోడ్డును దున్నినావని, కేసు పెట్టి బండిని సీజ్ చేస్తున్నట్లు తెలిపారు. నువ్వు ఈ నేరాన్ని ఒప్పుకోవాలని బలవంతం చేశారన్నారు. తాను ఎలాంటి భూమి దున్నలేదని, నాకు ఆ విషయానికి ఎలాంటి సంబంధం లేదని, గత రెండు మూడు రోజుల నుండి ప్రాధేయపడుతున్నా వినకుండా వేధింపులకు గురి చేస్తున్నాడని వాపోయాడు. తాను జీవనోపాధి నిమిత్తం ఈ బండిని ఫైనాన్స్‌లో కొనుక్కున్నానని, చేయని నేరం నుంచి ఉన్నతాధికారులు తనను కాపాడాలని బాధితుడు వేడుకుంటున్నాడు. ట్రాక్టర్ లోపలికి వెళ్తే నాకు నా కుటుంబానికి ఉపాధి లేదని, అందరం కలిసికట్టుగా చనిపోవాల్సి వస్తుందని, దీనిపై ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేసి, నా ట్రాక్టర్ ఇప్పించాలని వేడుకున్నాడు. ఈ విషయంపై ఎస్సై ఆంజనేయులును పత్రికా విలేఖరులు వివరణ కోరగా, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారమే ట్రాక్టర్‌ను తీసుకురావడం జరిగిందని, ఆధారాలు ఉన్నాయని తెలిపారు. భూతగాదాలలో రెవెన్యూ అధికారులతో సంప్రదించకుండా పూర్తి వివరాలు తెలుసుకోకుండానే అక్రమంగా కేసులు పెడుతున్నారని బాధితులు ఆవేదన చెందుతున్నారు.

# పట్టా భూముల్లో ప్రభుత్వ బోర్డులు

### విచారించి భూములు అప్పగించాలంటూ రైతులు మంత్రులకు వినతి

### భూములను పరిశీలించిన సిపిఐ నేతలు




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : వందల సంవత్సరాలుగా ఆ భూములు మా ఆధీనంలో ఉన్నాయని అక్కడే సుదీర్ఘ కాలం జీవించిన మేము వేరే ప్రాంతంలో ఇండ్లు నిర్మించుకుని జీవిస్తున్నామని కాని ఇప్పుడు ఆ స్థలాలు ప్రభుత్వ భూములని బోర్డులు ఏర్పాటు చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విచారణ చేసి మా పట్టా భూములను మాకు అప్పగించాలని కోరుతున్నారు. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని వెలుగుమట్ల రెవెన్యూలో రాజన్నపేట గ్రామం ఉండేది. 14వ డివిజన్‌లో గల రాజన్నపేట గ్రామ ప్రజలకు మూడు దశాబ్దాల క్రితం గొల్లగూడెం సమీపంలో నివాస స్థలాలను కేటాయించారు. గ్రామం చుట్టూ బురద ఉండడం గ్రామం నుంచి బయటకు వచ్చే పరిస్థితులు ఆనాడు లేకపోవడంతో అప్పటి శాసన సభ్యుడు రజబ్‌అలీ చొరవతో కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు నివాస స్థలాలను కేటాయించారు. పాత రాజన్నపేటలో ఉన్న నివాస స్థలాలకు సంబంధించి రైతుల పేరునే పట్టాదారు పాసుపుస్తకాలు కొనసాగుతున్నాయి. ఇప్పుడు మారిన పరిస్థితుల్లో పాత రాజన్నపేట కు రహదారి సౌకర్యం రావడం ఇదే సమయంలో కుటుంబాలు పెరగడంతో కొందరు కుటుంబ సభ్యులు పాత రాజన్నపేటలోని వారి నివాస స్థలాల్లో జీవించేందుకు రేకుల షెడ్లు నిర్మించుకున్నారు. ఏం జరిగిందో కాని రెవెన్యూ అధికారులు ఆ ఇండ్లను కూల్చేసి ఇది ప్రభుత్వ భూమి అని బోర్డు ఏర్పాటు చేసి చుట్టు పెన్సింగ్ ఏర్పాటు చేశారు. వాస్తవానికి ప్రభుత్వ భూమిగా నిర్ధారించిన దానిలో షేక్ నజీర్ పాషా, షేక్ గోరేబీ, పర్సా సోమయ్య, షేక్ దస్తగిరి సహా చాలా మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నాయి. అనేక సంవత్సరాలుగా భూమి వారి పేరునే రికార్డుల్లో నమోదైంది. 2018లో తెలంగాణ ప్రభుత్వం పట్టాదారు పాసుపుస్తకాలను సైతం అందించింది. బాధితులు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి ని కలిసి తమ పేరున పట్టాలు ఉన్న భూములను తమకే అప్పగించాలని వేడుకున్నారు. కొందరు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ తమను ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు.

**భూములను పరిశీలించిన సిపిఐ నేతలు**

పట్టాదారు భూముల్లో ప్రభుత్వ భూములుగా నమోదు చేసి హద్దులు నిర్ణయించడాన్ని సిపిఐ నాయకులు తీవ్రంగా ఖండించారు. బాధితుల కోరిక మేరకు శుక్రవారం సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యులు ఎస్‌కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ తదితరులు భూములను పరిశీలించారు. ఇప్పటికీ అక్కడ శిథిలావస్థలో ఉన్న ఇండ్లు ఉండటాన్ని వారు గమనించారు. అనేక దశాబ్దాలుగా వారి ఆధీనంలో ఉన్న భూములకు ప్రభుత్వ భూములని బోర్డులు ఏర్పాటు చేయడం సరైంది కాదన్నారు. పట్టాదారు పాసుపుస్తకాలు కలిగిన రైతులకు భూములను అప్పగించాలని ఈ విషయమై మంత్రులకు, ఉన్నతాధికారులకు తెలియజేస్తామని మౌలానా తెలిపారు. చిన్న, సన్నకారు రైతులు ఎక్కువగా ఉన్నారని ప్రభుత్వం ఆలోచన చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వలరాజు, బాధిత రైతులు షరీఫ్, నజీర్, నన్నెమియా, జానిమియా, పర్సా సోమయ్య, రజ్జు తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణీల ఎఎన్‌సి రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష




ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వంద శాతం గర్భిణీ స్త్రీల ఏ.ఎన్.సి. రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కాల్వశ్రీరాంపూర్ మం డలంలోని శ్రీరాంపూర్, కూనారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఆపరేషన్ థియేటర్, జనరల్ వార్డ్, లేబర్ రూమ్, ఫార్మసీ, ల్యాబరేటరిలను పరిశీలించిన కలెక్టర్ ప్రజలకు అందుతున్న వివిధ సేవ ల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి రోజు నమోదవుతున్న ఔట్ పేషెంట్, ఆసుపత్రిలో జరుగుతున్న ప్రసవాల సంఖ్య, పోషకలోపం ఉన్న పిల్లల కేసులు, ఎన్.సి.డి. సర్వే తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గర్భిణీ స్త్రీల ఏ.ఎన్.సి. రిజిస్ట్రేషన్, చెకప్ వంద శాతం జరిగేలా చూడాలని, క్షేత్రస్థాయిలో పని చేసే ఆశా కార్యకర్తలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పని చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కృపాబాయి, కూనారం వైద్యాధికారి డాక్టర్ భావన, శ్రీరాంపూర్ వైద్యాధికారి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**నిరీత గడువులోగా భూ సమస్యల పరిష్కారానికి చర్యలు**

నిర్ణీత గడువులోగా భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కాల్వ శ్రీరాంపూర్ మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. కాల్వ శ్రీరాంపూర్ మండలంలో పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తులు, తదితర అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జీఎల్ఎం లోని కులం, లింగం, తండ్రి పేరు మార్పు, టిఎం 33 మాడ్యూల్, ప్ర భుత్వం సేకరించిన భూముల్లో సమస్యలు, పట్టాదార్ పాస్ పుస్తకం లేకుండా నాలా మార్పు, భూ సమస్యల వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, పెండింగ్ లో ఉన్న ధరణి దరఖాస్తుల నిర్ణిత గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకో వాలన్నారు. ఈ పర్యటనలో కలెక్టర్ తహసీల్దార్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఫోక్సో కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలు



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : ఫోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ కరీంనగర్ ఫోక్సో కోర్టు న్యాయమూర్తి వెంకటేష్ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథ నం మేరకు శంకరపట్నం మండలానికిచెందినమైనర్ బాలిక (17) ఏడవ తరగతి వరకు చదివి ఇంటివద్ద ఉంటూ కూలీ పనులు చేస్తుంది. అదే ప్రాం తంలో ఉంటున్న ఒంగోలు జిల్లా చిలకపాడు గ్రామానికి చెందిన దాస రి అంజి (45) అనే సుతారి పనిచేసే అతనికి పనికి వెళ్లేది. ఆమెకు మాయమాటలు చెప్పి అతని వెంట తీసుకెళ్లగా బాలిక తల్లిదండ్రులు తిరిగి తీసుకువచ్చారు. మళ్లీ 28 నవంబర్ 2016న బాలిక తల్లి దండ్రులు లేని సమయంలో నిందితుడు అంజి ఇంట్లోకి వెళ్లి బాలికను తీసుకెళ్లాడు. ఈ విషయంపై బాలిక తండ్రి కేశవపట్నం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేసిన పోలీసులు కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసులో సాక్ష్యులను పబ్లిక్ ప్రాసిక్యూటర్ జూలూరి శ్రీరాములు విచారించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన ఫోక్సో కోర్టు న్యాయమూర్తి నిందితుడు దాసరి అంజికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

## గంజాయి సేవించి జీవితం నాశనం చేసుకోవద్దు

### ఎస్‌పి అఖిల్ మహాజన్



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : యువత డ్రగ్స్, గం జాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలై వారి భవిష్యత్తుని నాశనం చేసుకోవద్దని జిల్లా ఎస్ పి అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు. దేశ భవిష్యత్తును నిర్ణయించేది యువత అని, అలాంటి యువత గంజాయి, మత్తు పదార్థాలకు బానిస కావడం ద్వారా చాలా వరకు ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో పాటు అనుకోకుండా నేరాలు చేసే అవ కాశం ఉంటుందన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల బారిన పడిన యువ కులు సత్ప్రవర్తనతో మంచి మార్గంలో నడుచుకోవడానికి ఈ కౌన్సిలింగ్ మంచి మార్గమని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవలన్నారు. చెడు వ్యసనాలను దూరం చేసుకుని మంచి ప్రవర్తనతో మెలగాలని లేని పక్షంలో కఠిన ంగా వ్యవహరించడం జరుగుతుదన్నారు. గంజాయికి అలవాటు పడి మానుకో లేని పరిస్థితి ఉన్న వారికి జిల్లాలో ఏర్పాటు చేయబడిన డి అడిక్షన్ సెంటర్‌లో సైకలజిస్ట్,సైకియాట్రిస్ట్ డాక్టర్స్‌తో కౌన్సెలింగ్‌తో పాటుగా వైద్య సదుపాయాలు అందజేయనున్నట్లు తెలిపారు. గంజా యి అక్రమ రవాణా చేయడంతో పాటు మత్తు పదార్థాలు వినియోగాన్ని ప్రోత్సహించే వా రిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయిజి సంబంధించిన సమాచారం పోలీస్ వారికి అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో డిఎస్‌పి చంద్రశేఖర్ రెడ్డి, సిఐలు రఘుపతి, సదన్ కుమార్, ఎస్ఐ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS25F 2460 | UMA GANDU | KUBOTA MU4501 | 2021 |
| 2 | AP20TB 9520 | MD MINHAAZ HUSSAIN | TATA 207 DI SINGLE CAB | 2012 |
| 3 | TS01EP 7208 | RAJASHEKAR CHALLURI | ERTIGA VDI BS4 DIESEL 7 SEATER | 2012 |
| 4 | TS03UA 6675 | RAJU EDDU | TATA ACE | 2015 |
| 5 | AP01TV 3465 | NAVEEN MADIKONDA | G M TAVERA-P | 2009 |

AUCTION DATE : 29-06-2024

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED
H.No :4-316,4-317,4-318, Ground Floor,
Opp : Fire Station, Parkal, Warangl Rural
Cell : 9704123166, 9989766426

## శ్రమదోపిడీకి గురవుతున్న కాంట్రాక్టు కార్మికులు : పల్లా దేవేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డ్ సూపర్‌వైజర్ కార్మికులకు కనీస వేతనాల పెంపుకై జూలై మూడవ తేదీన చలో వైద్య విద్య సంచాలకుల కార్యాలయాన్ని ముట్టడిస్తున్నట్లు తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్ర ఆసుపత్రి వద్ద మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఒ నెంబర్ 60 ప్రకారం వేతనాలు పారదర్శకంగా అందడం లేదన్నారు. కార్మికులు తీవ్రమైన ఆర్థిక దోపిడీకి గురవుతున్నారని ఆరోపించారు. జీవో నెంబర్ 60 సక్రమంగా అమలు కావడం లేదని పేర్కొన్నారు. అప్పటి డిఎంఈ కాంట్రాక్టర్లకు దోచి పెట్టే విధంగా దొడ్డి దారిన తప్పుడు సర్కులర్ విడుదల చేసి కార్మికులను తీవ్రమైన అన్యాయానికి గురిచేశారన్నారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో ఇటీవల తొలగించిన కార్మికులను మానవత దృక్పథంతో విధుల్లోకి తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆయన కోరారు. కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు యాదగిరి, ఎల్లమ్మ, పద్మ, సబిత, మనేమ్మ, మల్లిక, విజయ్, వెంకటమ్మ, శ్రీదేవి, పార్వతమ్మ, మౌలాబి, నాగమణి, అరుణ, విజయ, రేణుక , భాగ్యమ్మ, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు : ఎఐఎస్‌ఎఫ్



**ప్రజాపక్షం/అలంపూర్ :** విచ్చలవిడిగా ప్రైవేట్ పాఠశాలలు ఫీజులు వసూలు చేస్తూ పుస్తకాల దందాలు చేస్తున్నాయని, అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రవీణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో డిఇఒ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తున్న అధికారులు చర్యలు తీసుకోకుండా లేదని ఆరోపించారు. అనేక పాఠశాలల్లో సరైన వసతులు లేవన్నారు. యూనిఫాం, పుస్తకాల పేరుతో పేద విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజుల పేరుతో ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు వేధిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అలాంటి పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున్న ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం డిఇఒకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి హనుమేష్, కాశీం, వెంకటేష్, నరేష్, ఉరుకుందు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పోరాటాలు

సిపిఐ జిల్లా కార్యదర్శి విజయసారథి



**ప్రజాపక్షం/మహబూబాద్ ప్రతినిధి :** ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఐ ముందుండి పోరాటాలు చేస్తుందనిపార్టీ జిల్లా కార్యదర్శి బి.విజయ సారథి అన్నారు. సిపిఐ మహబూబాబాద్ పట్టణ ఆర్గనైజేషన్ కమిటీ సమావేశం రేషపల్లి నవీన్ అధ్యక్షతన స్థానిక వీరభవన్‌లో శుక్రవారం జరిగింది. సమావేశానికి హాజరై విజయసారథి మాట్లాడుతూ మహబూబాద్ మున్సిపాలిటీ పరిధిలో సిపిఐ మాత్రమే స్థిరమైన పోరాటాలు చేస్తుందన్నారు. మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో అనేకసమస్యలపై ఎప్పటికప్పుడు ప్రజల పక్షాన పోరాడుతుందన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి పాలకవర్గంతో అనునిత్యం పోరాటం చేస్తుందన్నారు. మున్సిపల్ సమావేశాలలో వార్డులకు నిధులు కేటాయించాలని, సమస్యలు పరిష్కరించాలని పోరాటాలు చేస్తుందన్నారు. జిల్లా కేంద్రమైన మహబూబాబాద్‌లో అభివృద్ధి చేయాల్సిన పనులు పేరుకపోయి ఉన్నాయన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం మానుకోట మున్సిపాలిటీకి చేసింది శూన్యం అన్నారు. ఎన్నికల నేపథ్యంలో జీవోలు ఇచ్చి ఓట్లు కొల్లగొట్టాలని బిఆర్ఎస్ ప్రభుత్వం చూసిందన్నారు. రూ.50 కోట్లు విడుదల చేయాలని నాటి నుంచి సిపిఐ మానుకోట మున్సిపాలిటీ పరిధిలో అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. మానుకోట మున్సిపాలిటీలో 36 వార్డులకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలన్నారు. పట్టణ అభివృద్ధిలో నిత్యం ప్రజల మధ్యలో ఉండి ఉద్యమిస్తామన్నారు. సమావేశంలో సిపిఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్ సారధిరెడ్డి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, వెలుగు శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## నాసిరకం యంత్రాలతో కార్మికులకు భద్రత కరువు : ఎఐటియుసి



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** నాణ్యతలేని నాసిరకం యంత్రాలతో సింగరేణిలో కార్మికుల భద్రత కరువయిందని ఏఐటియుసి నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి యాజమాన్యం ఎస్‌డిఎల్ యంత్రాలలో ఉపయోగించే ఆయిల్స్‌లో నాణ్యత లేని కారణంగా యంత్రాలు మొరాయించడంతో, ఆపరేటర్లు ఇబ్బందులకు గురవుతున్నారని ఏఐటియుసి డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.వీరభద్రయ్య, ఏరియా బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీ సైదా అన్నారు. శుక్రవారం ఆర్‌కె న్యూటెక్ గనిని సందర్శించి, కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థ న్యాయమైన పనిముట్లను సరఫరా చేయకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే యాజమాన్యం స్పందించి నాణ్యమైన పనిముట్లు, గ్లౌజులు కార్మికులకు సమకూర్చాలన్నారు. కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎ.సంపత్, ఆకుల లక్ష్మణ్, అఫ్రోజ్ ఖాన్, చంద్రమౌళి, సకినాల నర్సయ్య, సిద్ధం అజయ్, షాకీర్, రాజయ్య పాల్గొన్నారు.

# పామాయిల్ సాగు విస్తరణకు ప్రోత్సాహం

### అంకమ్మ చెరువుకు గోదావరి జలాలు

### వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/అశ్వారావుపేట :** రాష్ట్రవ్యాప్తంగా పామాయిల్ సాగు విస్తరణకు ప్రభుత్వం రైతులకు పోత్సాహకాలు ఇస్తుందని వ్యవసాశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. శుక్రవారం ఆయిల్‌ఫామ్ ఎండి యాస్మిన్‌బాష, ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి ఫ్యాక్టరీ ఆవరణలో సుమారు రూ.32 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 25 మెగావాట్ల విద్యుత్ పవర్ ప్లాంట్‌ను పరిశీలించారు. ఎప్పటిలోగా నిర్మాణం పూర్తవుతుందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు స్థిర ఆదాయాన్ని ఇచ్చే పంట ఆయిల్‌ఫామ్ అన్నారు. దేశంలో 10లక్షల మెట్రిక్ టన్నుల ఆయిల్ అవసరాలు ఉన్నాయని, కేవలం 3.96 లక్షల మెట్రిక్ టన్నుల ఆయి ల్ మాత్రమే సమకూర్చుకోగలుగుతున్నామన్నారు. ఇంకా 97.1శాతం ఆయిల్ అవసరాలను దిగుమతులు చేసుకుంటున్నామన్నారు. ఈప్రాంతంలో 35ఏళ్లుగా పా మాయిల్ సాగు చేస్తున్నామన్నారు. అయినప్పటికీ ధర స్థిరీకరణంలో కొంత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయం కారణంగా ఎచ్చుతగ్గులు ఉండటంతో రైతులు సాగు పట్ల ఆలసత్వం చేయకుండా సాగు పెంచేందుకు ధర కనీసం రూ.15వేలకు తగ్గకుండా ఉండేందుకు కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ధర స్థిరీకరణ ప్రయ త్నం చేస్తామన్నారు. కొత్తగూడెం జిల్లాను పామాయిల్ హబ్‌గా మార్చేందుకు కృషి చేస్తామన్నారు. పాత వంగడాలతో చెట్లు ఎత్తుగా పెరగటంతో కోత సమయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయంపై తక్కువ ఎత్తు పెరిగే కొత్త వంగడాలను పరిశీలిస్తున్నామన్నారు. దేశంలో పామాయిల్ సాగు 11లక్షల ఎకరాల్లో సాగు ఉందని, రాష్ట్రంలో ఈ ఏడాది సుమారు 2లక్షల ఎకరాల సాగు చేపట్టేందుకు టార్గెట్‌గా పెట్టుకున్నామన్నారు. ఇప్పటికే రైతులకు ప్రోత్సహం కింద ఎకరాకు రూ.50 వేలు సబ్సిడీ ప్రభుత్వం అందిస్తుందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల వ్యవసాయ మంత్రుల సమన్వయంతో పామాయిల్ సాగు ఫ్యాక్టరీల నిర్మాణాలు తదితర అంశాలపై చర్చించి ముందుకు సాగుతామని తెలిపారు. రెండు ఏళ్లలో గోదావరి జలాలు అంకమ్మ చెరువుకు నేరుగా తెస్తామని ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతం కావటంతో గిరిజనేతర రైతులకు కొన్ని భూముల హక్కు పత్రాల విషయంలో ఇబ్బందులు ఉన్నాయని, సాగులో ఉన్నవారికి పోడు హక్కులు పొందిన వారికి సైతం నీరు, విద్యుత్ సౌకర్యంతో పాటు పామాయిల్ సాగు చేసేందుకు వీలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు సుధాకర్‌రెడ్డి, బాలకృష్ణ, నాగబాబు, కాంగ్రెస్ నాయకులు చెన్నకేశవరావు, జూపల్లి ప్రమోద్, సత్యనారాయణచౌదరి, రాంబాబు, ఆలా నాగేశ్వరరావు, నార్లపాటి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు న్యాయం జరిగే వరకూ పోరాటం

### ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి ముందస్తు అరెస్ట్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** నీట్ పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని, పేపర్ లీకేజీ జరిగినా ప్రధాని మోదీ స్పందించకపోవడాన్ని నిరసిస్తూ శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా బిజెపి ఎంపిల ఇండ్ల ముట్టడి కార్యక్రమం ఉన్న నేపథ్యంలో కరీంనగర్‌లో కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ ఇళ్లు ముట్టడించకుండా కరీంనగర్‌లో పోలీసులు ఉదయాన్నే ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్‌లను ముందస్తు అరెస్ట్ చేసి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సంధర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర బిజెపి ఎంపిలు నీట్ విద్యార్థుల సమస్యపై మాట్లాడాలని, నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని, రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే నీట్ పరీక్షను ఏ రాష్ట్రంలో ఆ రాష్ట్రం వారే నిర్వహించుకునేలా ఎంపిలు పార్లమెంటులో ప్రశ్నించాలని కోరారు. నీట్ విద్యార్థులకు న్యాయం జరిగే వరకు ఎఐఎస్‌ఎఫ్ పోరాటం చేస్తుందని మణికంఠరెడ్డి తెలిపారు.

## స్వీపర్ల సమస్య ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా : కూనంనేని



**ప్రజాపక్షం/ ఖమ్మం :** కరోనా సమయంలో విధుల నుంచి తొలగించిన పాఠశాల స్వీపర్ల సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. 2015లో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా రూ.2,500 కనీస వేతనంతో సర్వీస్ పర్సన్స్ స్వీపర్లను విద్యార్థుల సంఖ్యను బట్టి ప్రభుత్వం నియమించిందన్నారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా 27 వేల మంది స్వీపర్లను గత ప్రభుత్వం తొలగించిందని ఆయన తెలిపారు. శుక్రవారం ఏఐటియుసి ఆధ్వర్యంలో స్వీపర్లను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తూ సంఘం నాయకులు సాంబశివరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ స్వీపర్లను తొలగించడం వల్ల పాఠశాలల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొందని, దీంతో విద్యార్థులు అనారోగ్యాలపాలయ్యే అవకాశం ఉందన్నారు. పాఠశాలల్లో పరిశుభ్రత, పచ్చదనం ముఖ్యమని, ఈ రెండింటి దృష్ట్యా సర్వీస్ పర్సన్స్‌ను విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు, తెలంగాణ సర్వీస్ పర్సన్స్ గౌరవ అధ్యక్షురాలు సిహెచ్ సీతామహాలక్ష్మి , జిల్లా అధ్యక్షురాలు మీరాబీ, జిల్లా కార్యదర్శి రషీద్, మలేకా, అనూష, ఉమా మహేశ్వరి, కృష్ణవేణి, కమలమ్మ తదితరులు వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

## ‘చర్లగూడెం’ భూనిర్వాసితులకు అండగా ఉంటా

### ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/మర్రిగూడ :** చర్లగూడెం ప్రాజెక్టు భూ నిర్వాసితులకు అండగా ఉంటానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం చర్లగూడెం ప్రాజెక్టును సందర్శించి భూనిర్వాసితులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆర్‌అండ్‌ఆర్, ప్యాకేజీ రానివారికి ఇప్పించే బాధ్యత నాదేనన్నారు. కుర్చీ వేసుకుని రెండేళ్లలో చర్లగూడెం ప్రాజెక్టు పూర్తి చేస్తానని చెప్పిన మాజీ సిఎం కెసిఆర్ తన పదేళ్ల పదవీ కాలంలో ప్రాజెక్టు పూర్తి చేయలేదని మండిపడ్డారు. చర్లగూడెం ప్రాజెక్టుపై గత ప్రభుత్వం చేసిన తొందరపాటు చర్యల వల్ల నిర్వాసితులు రోడ్డున పడ్డారన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని ఏదుల ప్రాజెక్టు పూర్తి అయితేనే ఇక్కడికి నీళ్లు వస్తాయని, కానీ ఇప్పటివరకు అక్కడ ప్రాజెక్టు పూర్తి కాలేదన్నారు. ఇప్పటికే ప్రభుత్వం చర్లగూడెం ప్రాజెక్టు కోసం రూ.6వేల కోట్లు ఖర్చు చేసిందని, ఇప్పుడు పనులు ఆపాలంటూ భూనిర్వాసితులు అడ్డుకోవడం వల్ల ఉపయోగం ఉండదన్నారు. సిఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి చర్లగూడెం ప్రాజెక్టు భూనిర్వాసితులకు ఇబ్రహీంపట్నంలో లేదా చింతపల్లి మండలంలో ఇంటి స్థలాలు ఇప్పించటానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రాందాస్ శ్రీనివాస్. హరికృష్ణ, వెంకటంపేట బాలయ్య, ముద్దం జంగయ్య. సత్తిరెడ్డి, అయిత గోని వెంకటయ్య, నాంపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏ.నవీన్ కుమార్. సబ్ ఇన్స్పెక్టర్ రంగారెడ్డితో పాటు అధికారులు ఉన్నారు.

## జలదిగ్బంధంలో ఢిల్లీ

(మొదటి పేజీ తరువాయి)

గురయ్యారు. భారీవర్షాల కారణంగా ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని విద్యుత్ డిస్కమ్ అధికారులు తెలిపారు. వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు, స్తంభాలు కూలిపోయాయని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు మరమ్మతు పనులు చేపడుతున్నామని వెల్లడించారు. కరెంట్ షాక్ ఘటనలు జరగకుండా ముందస్తుగా విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేసినట్లు పేర్కొన్నారు. ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్‌లోని పలుప్రాంతా ల్లో గురువారం నుంచి ఉరుములు, మెరుపులతో కూ డిన భారీవర్షాలు కురుస్తున్నాయి. వర్షం వేసవి వేడి నుంచి ఉపశమనం కలిగించినప్పటికీ సరితా విహార్, కన్నాట్ ప్లేస్, పాలం విమానాశ్రయం, ధౌలాకువాన్‌తో సహా పలు ప్రాంతాల్లో రోడ్లపైకి వరద నీరు చేరింది. దీంతో వాహనదారులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ఢిల్లీలో తాజా పరిణామాలపై ప్రభుత్వం అప్రమత్తమైంది. పరిస్థితిని సమీక్షించేందుకు అత్యవసర సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి ఢిల్లీ మంత్రులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. మరోవైపు, ఢిల్లీలో భారీవర్షాల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులపై లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అధికారులతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. మరోవైపు, తీవ్రమైన వేడివాతావరణం తర్వాత ఎట్టకేలకు నైరుతి రుతుపవనాలు ఢిల్లీలోకి ప్రవేశించాయని భారత వాతావరణ విభాగం(ఐఎండి) తెలిపింది. ఢిల్లీలో రాబోయే ఏడురోజుల్లో గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది.

### కూలిన టెర్మినల్ పైకప్పు ప్రదేశాన్ని పరిశీలించిన కేంద్రమంత్రి

కాగా, ఢిల్లీలోని విమానాశ్రయంలో టెర్మినల్1 పైకప్పులో కొంతభాగం కూలి, ట్యాక్సీలు సహా పలు కార్లపై పడిన సంగతి తెలిసిందే. పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు స్వయంగా ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈసందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ఇది చాలాతీవ్రమైన ఘటన అని వ్యాఖ్యానించారు. ‘ఇక్కడ మీకు ఒక విషయం స్పష్టత ఇవ్వాలనుకుంటున్నాను. ఈరోజు తెల్లవారుజామున కూలినది పాత భవనంలోని పైభాగం. దానిని 2009లో ప్రారంభించారు. ప్రధాని మోదీ ప్రారంభించిన భవనం అవతలివైపు ఉంది’ అని వెల్లడించారు. కూలిన భాగంలోని కొన్ని బీమ్‌లు తుప్పుపట్టి ఉన్నాయని ప్రశ్నించగా.. ‘దీని గురించి ఇప్పుడే మాట్లాడటం తొందరపాటు చర్య అవుతుంది. దీనిపై తనిఖీ చేయమని విమానాశ్రయ అధికారులను ఆదేశించాం. మంత్రిత్వ శాఖ, డిజిసిఏ విడివిడిగా దర్యాప్తు చేస్తుంది’’ అని వెల్లడించారు.

కాగా, విమానాశ్రయంలో జరిగిన ఘటనపై కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ఆ కూలిన టెర్మినల్‌ను ఇటీవలే ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారని హస్తం పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నాయకురాలు ప్రియాంకాగాంధీ ఆరోపించారు. ‘గత పదేళ్ల కాలంలో మోదీ ప్రభుత్వంలో చోటుచేసుకున్న అవినీతి, నేరపూరిత నిర్లక్ష్యం ఈ దుస్థితికి కారణం’’ అని దుయ్యబట్టారు.

### మృతుడి కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం

ఈ ఘటనపై కేంద్రమంత్రి తీవ్ర విచారం వ్యక్తంచేశారు. ప్రభుత్వం తరఫున మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. గాయపడినవారికి ఒక్కొక్కరికి రూ.3 లక్షలు ఇస్తామని వెల్లడించారు. అలాగే సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల్ని ఆయన పరామర్శించారు.

## ఇంటి నిర్మాణానికి నిధులు



**ప్రజాపక్షం/ఆలేరు :** అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కోసం రూ.ఐదు లక్షల ఇవ్వాలని, అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆలేరు నియోజకవర్గ కేంద్రంలో పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఇచ్చిన ఏ హామీని తమ పదేళ్ల పాలనలో బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. ఆ ప్రభుత్వం ప్రజలకు ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టారన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు తొమ్మిది నెలలు అవుతున్నప్పటికీ ఇంతవరకు ఇచ్చిన ఏ హామీని అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలను గాలికి వదిలేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలలను వెంటనే అమలు చేయాలని ఆయన కోరారు. లేనిచో సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామన్నారు. మహిళలకు రూ.2500 ఆర్థికసాయం అందజేయాలని, అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు కట్టించాలని, నిరుద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయాలని, రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలని ఆయన కోరారు. నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఐ మాత్రమే పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమం లో సిపిఐ ప్రజాసంఘాల నాయకులు రవి, ఆంజనేయులు, జానమ్మ, పూలమ్మ, నాగమణి, ఆంజనేయులు, జాంగిర్, రాజిరెడ్డి, బిక్షపతి, బాలమణి, లక్ష్మి , యాదమ్మ, మల్లమ్మ, సరళ, కిష్టయ్య, జాంగిర్ తదితరులు పాల్గొన్నారు.

## హేమంత్ సోరెన్‌కు బెయిల్

(మొదటి పేజీ తరువాయి)

కూడా లేవని కోర్టు గుర్తించింది. అందుకే ఆయనకు బెయిల్ ఇస్తున్నాం’ అని ధర్మాసనం ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. కాగా, బెయిల్ రావడంతో దాదాపు 5 నెలల అనంతరం బిర్సా ముండా జైలు నుంచి విడుదలయ్యారు. తనను తప్పుడుగా ఇరికించారని.. రాజకీయ నేతలు, సామాజిక కార్యకర్తల గొంతు నొక్కుతున్నారని.. జైలు నుంచి విడుదలైన అనంతరం హేమంత్ ఆరోపించా రు. సోరెన్‌ను చూసేందుకు జెఎంఎం శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున జైలు వద్దకు తరలివచ్చారు. పార్టీ కార్యకర్తలు ఆయనకు అనుకూలంగా నినాదాలు చేశారు. ఆ తర్వాత తన తండ్రి, జెఎంఎం అధినేత శిబు సోరెన్ నుంచి ఆశీస్సులు తీసుకున్నారు. మద్దతు తెలిపిన వారికి, న్యాయవ్యవస్థకు హేమంత్ సతీమణి కల్పనా సోరెన్ ధన్యవాదాలు తెలిపారు. భూ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఝార్ఖండ్ ముక్తిమోర్చ కార్యనిర్వాహక అధ్యక్షుడు హేమంత్ సోరెన్‌ను ఈ ఏడాది జనవరి 31న ఈడీ అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అప్పటినుంచి ఆయన బిర్సా ముండా జైల్లో ఉన్నారు. అరెస్టుకు కొన్ని గంటల ముందే ఆయన నాటకీయ పరిణామాల నడుమ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయగా.. నూతన సిఎం గా చంపయీ సోరెన్ బాధ్యతలు చేపట్టారు.

## కెసిఆర్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ ఎక్కడా వివాదాలకు పోలేదని తెలిపారు. విద్యుత్ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి పక్షపాత ధోరణితో వ్యవహరించలేదని కోర్టుకు వివరించారు. విలేకరుల సమావేశంలో ఆయన ఎక్కడా వివాదాస్పద అంశాలు మాట్లాడలేదని చెప్పారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం.. విచారణను ముగించి తీర్పును రిజర్వ్ చేసింది.









Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com

## జలమండలిలో నేడు 'డయల్ యువర్ ఎండి'

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జలమండలిలో నేడు 'డయల్ యువర్ ఎండి' కార్యక్రమం నిర్వహించనున్నారు. ఎండి అశోక్‌రెడ్డి వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వయంగా స్వీకరించనున్నారు. ఖైరతాబాద్ ప్రధాన కార్యాలయంలో శనివారం సాయంత్రం 5 గంటల నుంచి 5.30 గంటల వరకు ఎండి అశోక్‌రెడ్డి ఫోన్‌లో అందుబాటులో ఉంటారు. వివిధ డివిజన్, సర్కిల్ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న మంచినీటి సరఫరా, సీవరేజీ, మీటర్, బిల్లింగ్, నల్లా కనెక్షన్, రెవెన్యూ, ఇతర అంశాలకు సంబంధించిన సమస్యలను వినియోగదారులు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. 040 23442881, 23442882, 23442883 నెంబర్‌లకు కాల్ చేసి, తమ క్యాన్ నెంబరు కానీ, ఇంటి నెంబరు కానీ, మొబైల్ నెంబరు కానీ చెప్పాల్సి ఉంటుందని అధికారులు చెప్పారు. డయల్ యువర్ ఎండి కార్యక్రమం జరిగే సమయంలో బోర్డు డైరెక్టర్లు సహా, అన్ని సర్కిల్, డివిజన్ ఉన్నతాధికారులు పాల్గొంటారని తెలిపారు.

## సెయిలింగ్ పోటీల నిర్వహణ అభినందనీయం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లో జాతీయ స్థాయి సెయిలింగ్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిషనర్ ఎవి రంగనాథ్ అన్నారు. జులై 1నుంచి నిర్వహించనున్న సెయిలింగ్ వీక్ కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ రంగనాథ్‌ను బుద్ధభవన్‌లోని ఆయన కార్యాలయంలో మేముసైతం మిత్రమండలి చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ పసునూరి భాస్కర్, గమన్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల చైర్మన్ నందకిషోర్ యర్రంశెట్టి, బయాన్ కంపెనీ మార్కెటింగ్ జిఎం ముంగి గిరిధర్, ఆర్మీ మేజర్ కిరణ్ సారథ్యంలోని బృందం కలిసి కోరింది. ఈ సందర్భంగా సెయిలింగ్ పోటీల కోసం రూపొందించిన టీ షర్ట్‌ను రంగనాథ్ ఆవిష్కరించారు.

# బల్దియాపై డిజిటల్ పేమెంట్ ఎఫెక్ట్

### పడిపోయిన ఆస్తిపన్ను చెల్లింపులు
### సిఎస్‌సి కేంద్రాలలో తొలగించిన నగదు చెల్లింపులు
### ఇబ్బందులు పడుతున్న వయోవృద్ధులు, సామాన్యులు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉన్నతాధికారుల అనాలోచిత నిర్ణయాలు సామాన్యులకు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ప్రజల సౌలభ్యం కోసం ప్రవేశపెట్టె సంస్కరణలు ఆసౌకర్యానికి గురి చేస్తున్నాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన ప్రతి ఒక్కరూ వినియోగించుకోలేని పరిస్థితులు దేశంలో ఉన్నాయి. ఇదే కోవలో ఘనత వహించిన బల్దియా అధికారులు ముందు వెనక ఆలోచించకుండా ఆలోచన వచ్చిదే తడువుగా నగదు చెల్లింపులను నిలిపేశారు. నగదు రహిత చెల్లింపు విధానం కాస్త బల్దియా ఖజానాపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి)పై డిజిటల్ పెమెంట్స్ ఎఫెక్ట్ పడింది. నగదు రూపంలో లావాదేవిలు నిలిపేయడంతో ఆస్తిపన్ను చెల్లింపులు మందకొండిగా సాగుతున్నాయి. ఆస్తిపన్ను, ఇతరాత్ర చెల్లింపులను గత కమిషనర్ రోనాల్డ్ రోస్ డిజిటలైజ్ చేశారు. ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు జరపాలని ఆదేశాలు జారీ చేశారు. రోనాల్డ్ రోస్ ఆదేశాలతో ఈనెల 7వ తేదీ నుంచి నగదు చెల్లింపులను నిలిపేశారు. దీనితో జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంతో పాటు సర్కిల్ కార్యాలయాల్లోని 31 పౌరసేవ కేంద్రాలు(సిఎస్‌సి)లలో నగదు చెల్లింపులు బంద్ అయ్యాయి. అలాగే మీసేవ, ఈసేవ కేంద్రాలలో కూడా నగదు చెల్లింపులను నిలిపేశారు. దీంతో ఆన్‌లైన్ చెల్లింపులలో అవగాహన లేనివారు ఇబ్బందులు పడుతున్నారు.

### ఆన్‌లైన్ చెల్లింపులతో వెనుతిరుగుతున్న వయోవృద్ధులు, సామాన్యులు..

స్మార్ట్‌ఫోన్ లేనివారు, డిజిటల్ బ్యాంకు ఖాతాలను వినియోగించని వారు నగదురూపంలోనే చెల్లింపులు జరుపుతారు. ప్రధానంగా వయోవృద్ధులు, సాధారణ ప్రజలు చాలా మంది ఆన్‌లైన్ చెల్లింపులపై అవగాహన లేకపోవడంతో సిఎస్‌సి కేంద్రాలకు చెల్లింపుల కోసం వచ్చి, తిరిగి వెళ్లుతున్నారు. నగదు చెల్లింపులను పూర్తిగా తొలగించడంతో ఇలాంటి వారు ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. ఫోన్‌పే, గూగుల్ పే లాంటివి కూడా సిఎస్‌సి కేంద్రాలలో లేకపోవడంతో ఊసురుమంటు చాలామంది ఆస్తిపన్ను చెల్లించకూడానే వెనుతిరిగిపోతున్నారు. దీంతో సిఎస్‌సి కేంద్రాల ద్వారా స్వీకరించే ఆస్తిపన్ను మొత్తం తగ్గుముఖం పట్టింది. ప్రతి రోజు రూ.2 నుంచి 3 కోట్ల వరకు వచ్చే ఆదాయం కాస్త లక్షల్లోకి పడిపోయింది. నగదు రూపంలో పన్నులు స్వీకరించకపోవడంతో సిఎస్‌సి సిబ్బందితో పన్ను చెల్లింపుదారులు వాగ్వాదానికి దిగుతున్నారు. కనీసం ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా కూడా చెల్లింపులు జరపకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు ఆన్‌లైన్ విధానంలో చెల్లింపులపై అవగాహన లేదని, నగదు రూపంలో ఎందుకు తీసుకోవడం లేదని సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు. ఆస్తిపన్ను చెల్లింపుదారుల ప్రశ్నలకు సిఎస్‌సి సిబ్బంది సమాధానం చెప్పలేకపోతున్నారు. చాలామంది పన్ను చెల్లింపుదారులు నగదురూపంలోనే చెల్లిస్తామని పట్టుబడుతున్నారని, లేదంటే తమను దుర్భాషలాడుతున్నారని ఒక సిఎస్‌సి కేంద్రం ఉద్యోగి వాపోయాడు.

### సిఎస్‌సి కేంద్రాలలో తగ్గిన చెల్లింపులు..

ఇప్పటికే పీకల్లోతు ఆర్థిక కష్టాల్లో ఉన్న జిహెచ్‌ఎంసికి డిజిటల్ పెమెంట్ రూపంలో చెల్లింపులతో వచ్చే ఆదాయం మందగించింది. అప్పుల చెల్లింపుతో పాటు నిర్వహణ పనులు, సిబ్బంది వేతనాల కోసం ప్రతినెల జిహెచ్‌ఎంసి అధికారులు వెతుక్కోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. డిజిటల్ పేమెంట్ విధానం కాస్త జిహెచ్‌ఎంసిపై ములిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా మారింది. గతంలో ఆస్తిపన్నును బిల్ కలెక్టర్లు, జిహెచ్‌ఎంసి పౌర సేవ కేంద్రాలు, ఈసేవ, మీసేవ కేంద్రాల ద్వారా స్వీకరించేవారు. అయితే బిల్ కలెక్టర్‌ల ద్వారా వసూలైన నగదను సకాలంలో ట్రెజరీలో జమ చేయడం లేదనే కారణంతో సిఎస్‌సి, ఈసేవ, మీసేవ కేంద్రాలలో సైతం చెల్లింపులను నిలిపేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పౌరులకు సేవలు అందించడం ఆహ్వానించాల్సిన పరిణామమే. అయితే అందుబాటులో ఉన్న సర్వీసులను నిలిపేయడంతో సామాన్యులకు చిక్కులు ఎదురవుతున్నాయి. డిజిటల్ పేమెంట్‌తో పాటు నగదు స్వీకరణను కూడా కొనసాగిస్తే సామాన్యులకు ఇబ్బందులు లేకుండా ఉంటుందనే అభిప్రాయాలు సర్వత్ర వ్యక్తం అవుతున్నాయి. సిఎస్‌సి, ఈసేవ, మీసేవ కేంద్రాల ద్వారా నగదు రూపంలో ఆస్తిపన్ను చెల్లింపులు స్వీకరించాలని కోరుతున్నారు.

## ఆరోగ్యకర సమాజ నిర్మాణమే ధ్యేయం


### ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి/కొత్తూరు:** ఆరోగ్యకర సమాజ నిర్మాణమే ధ్యేయం అని ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలంలోని పలు రేషన్‌షాపులు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలలను ఫుడ్ కమిషన్ చైర్మన్ నేతృత్వంలోని సభ్యుల బృందం శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేసింది. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అంగన్వాడి కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం, రేషన్‌షాపుల ద్వారా ఆహారభద్రత కార్డుదారులకు పంపిణీ చేస్తున్న బియ్యం, ఇతర సరుకులు, పాఠశాలల్లో విద్యార్థులకు సమకూరుస్తున్న మధ్యాహ్న భోజనం, ఆసుపత్రుల్లో రోగులకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను కమిషన్ ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పలుచోట్ల సమస్యలు లోటుపాట్లను గమనించిన కమిషన్ సభ్యులు, వాటిని సరిదిద్దుకోవాలని, తప్పులు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని, రాజ్యాంగం ద్వారా కల్పించబడిన హక్కు పకడ్బందీగా అమలయ్యేలా పర్యవేక్షించేందుకు రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఏర్పాటు అయ్యిందన్నారు. ఇది చట్టబద్ధత కలిగిన కమిషన్ అయినందున ప్రజల హక్కులకు భంగం కలిగినప్పుడు చర్యలు చేపట్టే అధికారం కమిషన్‌కు ఉందని స్పష్టం చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ సివిల్ సప్లయిస్, రెవెన్యూ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి చౌకధర దుకాణాల ద్వారా తెల్ల రేషన్ కార్డు కలిగిన లబ్దిదారులకు పంచదార, గోధుమలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు ఆనంద్, గోవర్ధన్ రెడ్డి, శారద, భారతి, జ్యోతి, డిఆర్‌ఓ సంగీత, పిడి డిఆర్‌డిఎ శ్రీలత, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి పద్మజా రమణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, జిల్లా విద్యా శాఖ అధికారి సుశీందర్‌రావు, జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ ఉదయ్‌కుమార్, కొత్తూరు జెడ్‌పిటిసి శ్రీలత, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపిడిఓ అరుంధతి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి కృషి

### కాంగ్రెస్ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి:** కొండాపూర్ డివిజన్ పరిధిలోని అంజయ్య నగర్ శ్మశానవాటికను కాలనీ వాసులతో కలిసి శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ వి.జగదీశ్వర్ గౌడ్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో సయ్యద్ గౌస్, నందు, విక్రమ్, యాదయ్యగౌడ్, వినోద్ యాదవ్, చంద్రకాంత్, మురళి, నర్సింహ, ఆంజనేయులు, సాగర్, చెన్నయ్య, సుమన్, శివ, రాము, సురేష్, బాలరాజు, శివరాం, రవి పాల్గొన్నారు.

## కోట్ల రూపాయలు పెట్టి కొన్న వాహనాలపై నిర్లక్ష్యం

### కౌన్సిల్ సమావేశంలో సభ్యుల ఆగ్రహం



**ప్రజాపక్షం/అబ్దులాపూర్‌మెట్ :** పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీలో కోట్ల రూపాయలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన వాహనాలను మూలకు పడివేయడంపై కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చేవుల స్వప్న చిరంజీవి అధ్యక్షతన శుక్రవారం కౌన్సిల్ సమావేశం జరిగింది. మున్సిపాలిటీ వార్డుల వారీగా పారిశుద్ధ్య కార్మికులను కేటాయించకుండా వివక్ష చూపడంపై సమావేశంలో సభ్యులు అధికారులను నిలదీశారు. హరితహారం కోసం ప్రత్యేకంగా అవుట్ సోర్సింగ్ కింద్ర ఓవ్యక్తిని నియమించుకొని నెలకు రూ.40 వేలు చెల్లించడం మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొట్టటడమేనన్నారు. ప్రతి వార్డుకు రూ,50 లక్షల నిధులు అభివృద్ధి పనుల కోసం కేటాయించినట్టు చైర్‌పర్సన్ స్వప్న తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ చామ సంపూర్ణరెడ్డి, మునిసిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు దేవిడి గీత వేణుగోపాల్‌రెడ్డి, చేవుల హరిశంకర్, పబ్బతి లక్ష్మణ్, సిద్దెంకి క్రిష్ణారెడ్డి, చల్లురి మురళీధర్‌రెడ్డి, పాశం అర్చన, పడుగుల జయశ్రీ, వద్దేపల్లి విధ్యావతి, జోర్క గీతతో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత



**ప్రజాపక్షం/కేశంపేట:** కేశంపేట మండలం వేములనర్వలో మట్టిని తలిస్తున్న రెండు ట్రాక్టర్లను శుక్రవారం ఎస్ఐ లింగం పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకుండా ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తుండగా సమాచారం తెలుసుకున్న ఎస్ఐ లింగం తమ సిబ్బందితో గ్రామానికి చేరుకుని ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలిస్తుండగా, గ్రామ ప్రజల అవసరాల కోసం తరలిస్తున్న ట్రాక్టర్లను వదిలివేయాలని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. అనుమతి లేకుండా మట్టిని తరలించడం నేరమని ప్రజలకు సముదాయించి ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా కాంట్రాక్టర్లు, వ్యాపారులు మట్టిని తరలించకుండా చర్యలు చేపట్టాలని, రైతులు, నిరుపేదల అవసరాల కోసం మట్టి తవ్వకాలకు అనుమతులు ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్‌కు గ్రామస్తులు వినతపత్రం అందజేశారు.

## హుక్కా సెంటర్‌పై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి : 9 మంది అరెస్టు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పంజగుట్టలోని 'మియామీ గాలీ కేఫ్' హుక్కా సెంటర్‌పై వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడి చేశారు. హుక్కా నిర్వాహకులతో పాటు 9 మంది ఉద్యోగులను అరెస్టు చేసి హుక్కా సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డిసిపి వైవిఎస్ సుదీన్ద్రా కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పంజగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో మియామీ గాలీ కేఫ్ ముసుగులో హుక్కా సెంటర్ నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు వెస్ట్‌జోన్ ఇన్‌స్పెక్టర్ ఇ.జంగయ్య, ఎస్ఐలు ఎన్.రంజిత్‌కుమార్, జి.నవీన్, బి.అరవింద్‌గౌడ్ దాడి చేశారు. దాడిలో హుక్కా సెంటర్ యజమానులు టోలిచౌకికి చెందిన మొహమ్మద్ అబ్దుల్ లతీఫ్ ఖాన్ (25) పార్సిగుట్టకు చెందిన మద్దె శ్యామ్ సుందర్(36), రెయిన్‌బజార్‌కు చెందిన మెనేజర్ మొహమ్మద్ అష్వాక్ (35), మెహదీపట్నంకు చెందిన హుక్కా పార్లర్ చెఫ్ మొహమ్మద్ అస్లాం (34), మక్తాకు చెందిన నంద్ కిషోర్ ధన్ (23),మాల్య కుమార్ ధన్ (25), దీపక్ సాహూ (20),మెహదీపట్నంకు చెందిన అల్తాఫ్ రెజా, (25), మక్తాకు చెందిన మహిళా ఉద్యోగి రాణి ఖోస్లో (22) అదుపులోకి తీసుకున్నారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం నిందితులను పంజగుట్ట పోలీసులకు అప్పగించారు. పోలీసులు సిఒపిటి చట్టం కింద కేసు నమోదు చేశారు.

## మొహర్రంకు అన్ని ఏర్పాట్లు చేయాలి

### మైనారిటీ నేతలతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మొహర్రం పవిత్ర మాసంలో నిర్వహించే కార్యక్రమాలకు అసౌకర్యం కలుగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని రవాణా, బి.సి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మొహర్రం పవిత్ర మాసం ఏర్పాట్లపై శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్‌అలీతో కలిసి వివిధ శాఖల అధికారులు, షియా మత పెద్దలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. మొహర్రం కార్యక్రమాలు నిర్వహించే ఆశుర్ ఖానాల వద్ద పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఆశుర్ ఖానాల పరిసర ప్రాంతాలలో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, రోడ్ల మరమ్మత్తు పనులను వెంటనే పూర్తి చేయాలని, అన్ని చోట్ల హైమాస్ట్ విద్యుత్ లైట్లను ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. ఏనుగు ప్రధాన ఊరేగింపు రోజున ఊరేగింపు జరిగే మార్గాలలో విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని, వాటర్ బోర్డ్ అధికారులు త్రాగునీరు అందించాలని, జి.హెచ్.యంసి అధికారులు పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని అన్నారు. మొబైల్ టాయిలెట్స్ తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మొహర్రం ఊరేగింపు సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఏనుగు ప్రధాన ఊరేగింపు ప్రారంభం కానున్న బీబీకాఆలం పరిసరాల ప్రాంతంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సంతాపం తెలిపెందుకు ఆశుర్ ఖానాలకు వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌళిక వసతులు కల్పించాలని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ సూచించారు. వారి కోసం మినీ బస్సులను కూడా ఏర్పాటు చేయాలన్నారు. వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లను కూడా అందుబాటులో ఉంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, మీర్జా రియాజ్ ఉల్ హాసన్ ఎఫెండి, మీర్జా రహమత్ బేగ్, ఎమ్మెల్యేలు జాఫర్ హుస్సేన్ మెరాజ్, కౌసర్ మొహియుద్దీన్, మీర్ జుల్ఫేకర్ అలీ, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి తఫ్సీర్ ఇక్బాల్ , వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబైదుల్లా కొత్వాల్, వైస్ చైర్మన్ ఫహీమ్ ఖురేషి, హైదరాబాద్ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి , జిహెచ్‌ఎంసి కమీషనర్ ఆమ్రపాలి కాట, హైదరాబాద్ పోలీస్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తున్న కార్పొరేట్ కళాశాలలు

### రంగారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ కార్యాలయం ముందు ఎఐవైఎఫ్ ధర్నా




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇంటర్ బోర్డ్ నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా తరగతులు నడిపిస్తున్న శ్రీ చైతన్య, నారాయణ, రిసోనెన్స్, వశిష్ట కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ కార్యాలయం ముందు ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి శుక్రవారం ధర్నా నిర్వహించారు. నోటీసులతో సరిపెడుతున్న రంగారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాకాధికారుల తీరును నిరసిస్తూ బషీర్‌బాగ్‌లోని జిల్లా ఇంటర్మీడియట్ కార్యాలయం ముందు ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ ధనార్జనే ధ్యేయంగా విద్యార్థులను వారి తల్లిదండ్రులను మోసం చేస్తూ ఇంటర్ బోర్డ్ నిబంధనలు ఉల్లంఘించి అనధికారకంగా నారాయణ, శ్రీచైతన్య జూనియర్ కళాశాలను నడిపిస్తూ విద్యార్థులను మోసం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కళాశాలలలో లక్షలాది రూపాయలు ఫీజుల రూపంలో వసూళ్లు చేస్తున్న విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. విద్యార్థులకు నాణ్యత లేని ఆహార పదార్థాలను ఇస్తున్నారని , సరైన మరుగుదొడ్లు కూడా లేవని ఆరోపించారు. కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు ఆయా కళాశాలల యాజమాన్యాలకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి శ్రీదేవి వారికి హామీ ఇస్తు.. ఇంటర్ బోర్డ్ గుర్తింపు లేకుండా నడుస్తున్న కళాశాలలను మూసివేస్తామని చెబుతూ ధర్నాను విరమింపజేశారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, సభ్యులు మాజీద్ అలీ ఖాన్, కళ్యాణ్, అనిల్ కుమార్, బాలు, వంశీ తదితరులు పాల్గొన్నారు.



మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనురాగ్ జయంతి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు.

## గ్లాస్ కంపెనీ ఘటనా స్థలంలో సహాయక చర్యలు

### కలెక్టర్ కె.శశాంక




**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పరిధిలోని బూర్గులగ్రామ శివారులో ఉన్న సౌత్ గ్లాస్ ప్రైవేటు కంపెనీలో జరిగిన ప్రమాదఘటనపై జిల్లా కలెక్టర్ కె.శశాంక దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనేహుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయకచర్యలను పర్యవేక్షించారు. తనతో పాటు జిల్లా అధికారులు, పోలీసులు, అధికార యంత్రాంగం చేరుకుని తక్షణ సహాయక చర్యల్లో నిమగ్నమయ్యిందన్నారు. గాయపడిన కార్మికులను ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించేలా చర్యలు తీసుకున్నామని, తొమ్మిది మంది షాద్ నగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, పరిస్థితి కొంత విషమంగా ఉన్న మరో కార్మికుడిని శంషాబాద్ ఆసుపత్రికి తరలించామని తెలిపారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలను ముమ్మరం చేశామన్నారు. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, కార్మిక శాఖ, పరిశ్రమలు, వైద్య శాఖ బృందాలు ఘటనా స్థలంలోనే ఉండి సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయన్నారు. ప్రస్తుతం పరిస్థితి సాధారణ స్థాయిలోనే ఉందని తెలిపారు. అనంతరం కలెక్టర్ శశాంక షాద్ నగర్ ఆసుపత్రిని సందర్శించి, గాయపడిన కార్మికులను పరామర్శించారు. క్షతగాత్రులను కలిసి ధైర్యం చెప్పారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారిని కలెక్టర్ ఆదేశించారు. మృతుల కుటుంబీకుల వివరాలను సేకరించి, వారికి ప్రమాద ఘటన గురించి సమాచారం తెలియజేయాలని అధికారులను ఆదేశించారు.

## ఫిర్యాదు చేసిన 14నిముషాల్లోనే...

### రూ.18 లక్షలు రికవరీ చేసిన పోలీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయామని ఏ చిన్న అనుమానం కలిగినా వెంటనే ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న మన డబ్బులు వెంటనే తిరిగి మన బ్యాంక్ అకౌంట్‌లోకి చేరుతాయనే సత్యాన్ని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు నిరూపించి శభాష్ అనిపించుకున్నారు. ఈ ఘటనను శుక్రవారం హైదరాబాద్‌లో చోటుచేసుకుంది. సైబర్ నేరగాళ్ల బెదిరింపులకు భయపడిన ఓ వ్యక్తి తన అకౌంట్‌లో ఉన్న రూ.18 లక్షలను నిందితులకు బదిలీ చేశాడు. వెంటనే మేలుకొన్న సదరు వ్యక్తి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో 14 నిముషాల్లోనే ఆ డబ్బును పోలీసులు వెనక్కి రప్పించి తిరిగి బాధితుడి అకౌంట్‌కు బదిలీ చేయించారు. వివరాలు ఇలా ఉన్నాయి. అంబర్‌పేటకు చెందిన ఓ వ్యక్తి (31) ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. గురువారం సదరు వ్యక్తికి సైబర్ క్రైమ్ నేరగాళ్లు ఫోన్ చేశారు. మీ పేరుపై ముంబాయి నుంచి ఇరాన్‌కు అక్రమంగా డ్రగ్స్ సరఫరా అయిందని, వెంటనే స్కైప్ ద్వారా ముంబాయి సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించాలని చెప్పాడు. దీంతో భయపడిన ఆ వ్యక్తి తనను కేసులో ఇరికిస్తారనే భయాందోళనకు గురయ్యాడు. కొద్ది సేపటికే తిరిగి సైబర్ నేరగాళ్లు అతగాడికి ఫోన్ చేసి పెద్ద మొత్తంలో డబ్బులు ఇస్తే కేసు లేకుండా చేస్తామన్నారు. దీంతో ఆ వ్యక్తి సైబర్ నేరగాళ్ల అకౌంట్‌లోకి తన ఐసిఐసిఐ బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ.18లక్షలను బదలీ చేశాడు. వెంటనే అనుమానం వచ్చిన బాధితుడు అదే రోజు రాత్రి 7 గంటలకు బషీర్‌బాగ్‌లోని సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌ను సంప్రదించి జరిగిన మోసాన్ని తెలిపాడు. అక్కడ డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ ఎన్.శ్రీకాంత్ నాయక్ వెంటనే స్పందించి ఆరా తీశాడు. బ్యాంక్ అధికారులతో వెంటవెంటనే మాట్లాడి కేవలం 14 నిముషాల వ్యవధిలోనే నిందితుల అకౌంట్‌కు బదిలీ అయిన రూ.18 లక్షలను వెనక్కి వచ్చేలా చేసి తిరిగి బాధితుడి అకౌంట్‌కు చేర్పించాడు. బాధితుడిని కాపాడిన కానిస్టేబుల్‌ని సైబర్ క్రైమ్ డిసిపి కవిత అభినందించారు.

**వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి: డిసిపి కవిత**



సైబర్ నేరగాళ్ల చేతిలో డబ్బులు మోసపోయిన వెంటనే బాధితులు ఫిర్యాదు చేయాలని సైబర్ క్రైమ్ డిసిపి కవిత తెలిపారు. బాధితులు ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ముందుగా 1930కు ఫోన్ చేయాలన్నారు. త్వరగా ఫిర్యాదు చేయడం ద్వారా నిందితుల అకౌంట్‌లో ఉన్న డబ్బును వెనక్కి రప్పించుకునే అవకాశాలు ఉన్నాయన్నారు. ఫిర్యాదు ఆలస్యం చేయడం ద్వారా నిందితులు డబ్బులు డ్రా చేసుకునే అవకాశాలు ఉంటాయన్నారు.

# విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను జెన్‌కోనే నిర్మించాలి

## సిఎండికి పవర్ ఎంప్లాయిస్ జెఎసి వినతి డిప్యూటీ చీఫ్ మినిస్టర్ భట్టితో మాట్లాడుతానని హామీ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను జెన్‌కో చేతనే నిర్మించాలని కోరుతూ తెలంగాణ స్టేట్ జాయింట్ యాక్షన్ కమిటి నేతలు విద్యుత్ సౌధలో ట్రాన్స్‌కో, జెన్‌కో సిఎండి రోనాల్డ్ రోస్‌ను శుక్రవారం కలిసి ఈ సందర్భంగా ఒక వినతిపత్రం అందజేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం టిజి జెన్‌కోకి చెందిన రామగుండం థర్మల్ పవర్ స్టేషన్‌ను మూసివేసి సుమారుగా 580 ఎకరాల స్థలాన్ని సింగరేణికి అప్పగించి సింగరేణిచేత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నిర్మించాలని ఆలోచిస్తు న్నారని, దీంతో విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న వేలాది మంది ఉద్యోగులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారని తెలిపారు. నూరు శాతం ప్రభుత్వ రంగ సంస్థ అయిన జెన్‌కోను నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం పూర్తిగా బలపరచాలని ప్రభుత్వం నిర్మించబోయే నూతన ప్రాజెక్టులను అన్నింటిని జెన్ కో ద్వారానే నిర్మించాలని విద్యుత్ ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారని రోనాల్డ్ రాస్ దృష్టికి తీసుకువచ్చారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రైవేట్ పరం అవుతుందనుకున్న విద్యుత్ సంస్థలైన ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్ట్రిబ్యూషన్ కంపెనీలను గత కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రభుత్వ రంగంలో కొనసాగించి ప్రజలకు మేలు చేసిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పలు సంస్కరణల్లో భాగంగా విద్యుత్ శాఖను ట్రాన్స్‌కో, జెన్‌కో డిస్ట్రిబ్యూషన్ కంపెనీలుగా ఏర్పాటు చేసిందన్నారు. కాగా తెలంగాణ జెన్‌కో మాత్రం తన ఆధ్వర్యంలో జల,థర్మల్ విద్యుత్ కేంద్రాలు విజయవంతంగా నడుపుతూ దేశవ్యాప్తంగా ఎన్నో అవార్డులను స్వంతం చేసుకున్నాయన్నారు. కావున ప్రభుత్వం చేపట్టబోయే అన్ని థర్మల్, జల విద్యుత్తు, సోలార్ విద్యుత్తు ప్రాజెక్టులను ప్రభుత్వ రంగంలోని జెన్‌కో ద్వారా నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని తెలంగాణ విద్యుత్ జేఏసీ చైర్మన్ జి. సాయి బాబు, వైస్ చైర్మన్‌లు వజీర్ , అనిల్ కుమార్, జేఏసీ నాయకులు పి.సదానందం, ఏ.వెంకట నారాయణ రెడ్డి, ఈశ్వర్ గౌడ్ , నెహ్రూ, ఎన్. సురేష్ కుమార్, పి.వీ. రావు, వేణుగోపాల్, కుమార స్వామి, మోసెస్ తదితరులు సిఎండికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సిఎండి రొనాల్డ్ రోస్ స్పందిస్తూ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను జెన్‌కో చేతనే నిర్మించే విషయమై డిప్యూటి సిఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లుతో రి తో మాట్లాడుతానని జేఏసీ నాయకులకు హామీ ఇచ్చారు.



# సంస్కరణలతో దేశ ప్రగతిని పరుగులు పెట్టించిన పివి

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**ప్రజాపక్షం / హైదరాబాద్:** సంస్కరణలతో దేశ ఆర్థిక ప్రగతిని పరుగులు పెట్టించిన ఘనత మాజీ ప్రధానమంత్రి పి.వి.నరసింహారావుకే దక్కుతుందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కొనియాడారు. మాజీ ప్రధానమంత్రి పి.వి.నరసింహారావు జయంతిని పురస్కరించుకుని ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో పి.వి.చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్రంలో వివిధ శాఖల మంత్రిగా, ప్రధాన మంత్రిగా పివి చేసిన సేవలు మరువరానివని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోదాడ ఎంఎల్‌ఎ ఎన్.పద్మావతి రెడ్డి పివి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



# ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు పివి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** దేశంలో ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన ఘనత మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు కే దక్కిందని డీసీసీ మీడియా సెల్ కన్వీనర్ సిజే బెనహర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీవీ జయంతి జరుపుకున్నారు . పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బెనహర్ మాట్లాడుతూ తాను నమ్మిన సిద్ధాంతం కోసం ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఓర్చుకున్నారని అన్నారు. బహుభాష కోవిదుడైన పీవీ నరసింహారావు ప్రపంచ స్థాయి నాయకుల్లో చెప్పుకోదగ్గ వారని అన్నారు. పీవీ ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల ఫలితాలు ప్రస్తుతం దేశ ప్రగతికి కీలకంగా మారాయని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఫహీం, ఏర్పుల నాగరాజు, ఎండి. తాహెర్, కృష్ణయ్య, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.



# 'సింగరేణి' ప్రైవేటీకరణ ఆపాలి

**ప్రజాపక్షం/జడ్చర్ల :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బొగ్గు గనుల వేలం ఆపాలని నేరుగా సింగరేణికే కేటాయించాలని ప్రభుత్వం యొక్క ఆధీనంలోనే ఉండాలని రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేయాలని సిపిఎం జడ్చర్ల మండల కమిటీ ఆధ్వర్యంలో సిగ్నల్ గడ్డ తెలంగాణ చౌరస్తా అంబేద్కర్ కూడలిలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ సిపిఎం జిల్లా నాయకులు మండల నాయకులు సత్తయ్యలు మాట్లాడుతూ, మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను కేంద్ర బిజెపి ప్రభుత్వం వేలం వేయాలని చూస్తున్నది. రాష్ట్రంలో బిజెపి నుండి 8 మంది శాసనసభ్యులు మరో ఎనిమిది మంది పార్లమెంటు సభ్యులు ఉండి కూడా తెలంగాణకు ఇంత అన్యాయం జరుగుతుంటే నోరు మెదపడం లేదు. సింగరేణికి చెందిన 22 బొగ్గు బావుల్లో బొగ్గు నిల్వలు అడుగంటుతున్నాయి. కొత్త బ్లాకుల్లో తవ్వకాలు ప్రారంభించాలి. కానీ కేంద్ర బిజెపి ప్రభుత్వం ఎందుకు అనుమతించడం లేదు వేలం పాట ద్వారా ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టాలని ప్రయత్నిస్తున్నదని అటువంటి ఆలోచనను కేంద్రం ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని వారు డిమాండు చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వితని పత్రాన్ని తాహసిల్దార్ సత్యనారాయణ రెడ్డి కి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కార్యకర్తలు ఎండి మున్నా, బి జయరాములు, ఇ యాదయ్య, బి కృష్ణయ్య, సంధ్యారాణి, కృష్ణవేణి, లలిత సువార్త నాగమణి, హన్మయ్య నాయక్ తదితరులు ఉన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి ఆల పరామర్శ

**ప్రజాపక్షం/అడ్డాకుల :** మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం అడ్డాకుల మండలం శాఖపూర్ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సత్యరెడ్డి ఇటీవలే మరణించారు. విషయం తెలుసుకున్నదేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గ్రామానికి చేరుకుని వారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ అలాగే గ్రామంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న డ్రైవర్ పట్నం సాయిరాం ని పరామర్శించి మనోధైర్యాన్ని నింపుతూ త్వరలోనే కోల్కుంటారని ఆయన అన్నారు. ఆయన వెంబడి అడ్డాకుల జడ్పిటిసి రాజశేఖర్ రెడ్డి అధ్యక్షులు టీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచు జయన్న గౌడ్, భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.

# గద్వాల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌గా ధనలక్ష్మి



**ప్రజాపక్షం/మల్దకల్ :** గద్వాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌గా జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండల కేంద్రానికి చెందిన యు ధనలక్ష్మి నియమితులయ్యారు. వైస్ చైర్మన్‌గా కేటిదొడ్డిమండలం చింతలకుంట గ్రామం చెందిన కురువ గోవర్దన్ ను నియమించారు. ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, జిల్లా మంత్రి కృష్ణరావు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లు వీరి నియమకానికి ఆమోద ముద్ర వేశారు. అధికారికంగా ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. ప్రభుత్వం కొన్ని నెలల క్రితం మార్కెట్ కమిటీలను రద్దు చేసింది. గద్వాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవిని బిసి జనరల్ కేటాయించారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు చైర్మన్ సీటు దక్కించుకోవడానికి పోటిపడ్డారు. కాంగ్రెస్‌లో రెండు వర్గాలు ఉండడంతో ఏ వర్గానికి ప్రధాన్యం దక్కుతోందని నాయకులు రెండు వైపులా ప్రయత్నాలు చేశారు. వివిధ నాయకుల పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే గద్వాల నియోజకవర్గ ఇంచార్జిగా ఉన్న సరిత ప్రతిపాదనలకే ప్రాధాన్యం ఉంటుందని మంత్రి దామోదర, జూపల్లి ముందు నుంచి చెబుతున్నారు. అందుకు అనుగుణంగా ఆమె ప్రతిపాదించిన వారికి చైర్‌పర్సన్ , వైస్ చైర్మన్ పదవి దక్కుతాయి. వారితో పాటు 15మంది డైరెక్టర్లు కూడా నియమించారు .

# ప్రతి ఎకరాకు సాగునీరే ప్రభుత్వధ్యేయం

## మంత్రి జూపల్లికృష్ణారావు



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని, మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకంద్వారా ఖరీఫ్‌కు ప్రతి ఎకరానికి సాగునీరు అందించాలని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటకశాఖమంత్రి జూపల్లికృష్ణారావు ఇరిగేషన్‌శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, ఇరిగేషన్ అధికారులతో కలిసి కొల్లాపూర్ ప్రాంతంలోని నార్లాపూర్‌వద్ద పాలమూరు ప్రాజెక్టు పనులు, మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పంపుల పురోగతిని పరిశీలించారు. అనంతరం ఇంజనీరింగ్‌శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాలమూరు ప్రాజెక్టు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని, కెఎల్‌ఐద్వారా ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ప్రతి ఎకరానికి సాగునీరును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోఅందించాలన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. ప్రాజెక్టుకట్టడం ఎంతముఖ్యమో ప్రతిరైతు యొక్క పొలంలోకి సాగునీరందించడమే ప్రభుత్వ లక్ష్యమని, చివరి ఆయకట్టుకుసాగునీరందించడానికి చిత్తశుద్ధితో రాష్ట్రప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రాజెక్టు కెనాల్స్‌ను పరిశీలించి వారంరోజుల్లో పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. కెనాల్స్ పూడికపిచ్చి మొక్కలను తొలగించేందుకు వ్యయ అంచనాలు రూపొందించి పనులను వెంటనే ప్రారంభించి పూర్తిచేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఫీల్డ్ చానల్స్‌కు రైతులు సహకరించాలని సూచించారు. ఫీడల్ కెనాల్‌ను పూడ్చివేస్తే సంబంధిత రైతులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాలమూరు రంగారెడ్డి లిఫ్టు ఇరిగేషన్ స్కీమ్‌ను త్వరగా పూర్తిచేయాలని, కృష్ణా జలాలనుంచి మన పూర్తిస్థాయివాటాను ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. మోటార్లు త్వరగా బిగిం చి పనులు త్వరగా పూర్తిచేయాలని , పనుల పురోగతి కంట్రోల్ రూమ్‌ను ఆయన పరిశీలించారు. నార్లాపూర్‌నుంచి మిషన్ భగీరథ పనులు, పంప్‌హౌస్ పనులను వెంటనే పూర్తిచేయాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ప్రాజెక్టుకింద కోల్పోయిన గ్రామాల ప్రజలకు ఆర్‌అండ్‌బిఆర్ ద్వారా బోడబండ, సున్నపు తండా, అంజనగిరితండా, ఒడ్డెగుడిసెలు, దుల్యానాయక్‌తండా పునరావాస గ్రామాలకు పునరావాస సౌకర్యాలు, రహదారులు ఎల్లూరు నుంచి నార్లాపూర్ ఎల్లూరు నుంచి మొలచింతలపల్లి రహదారుల ఇండ్లస్థలాలకు మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. మంత్రివెంట సీఈ విజయభాస్కర్‌రెడ్డి, ఎస్‌ఈ సత్యనారాయణరెడ్డి, ఈఈలు శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, మురళి, శ్రీకాంత్, పార్థసారథి పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

## ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః** తెలంగాణ రాష్ట్ర విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో జరిగిన ఇంపాక్టు ఆఫ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ ఆన్ తెలంగాణ ఎకనామి సెమినార్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సావనీర్ ను ఆవిష్కరించి మాట్లాడారు. గత పది సంవత్సరాలు తెలంగాణలో విద్యకు సరియైన న్యాయం జరగలేదని, పూర్తిగా విద్యావ్యవస్థను మరుగున పడేశారని ఆయన ఆరోపించారు. గత పది సంవత్సరాలలో బిఆర్ఎస్ ప్రభుత్వం 19 వేల కోట్ల పెట్టుబడులు తెస్తే, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దావోస్ వెళ్లిన ముఖ్యమంత్రి మరియు ఇండస్ట్రీ మినిస్టర్ 40 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చారని ఆయన స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి మన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి విద్యను అభ్యసించేందుకు విద్యార్థులు అధికంగా వస్తున్నారని, విద్యార్తులు డిగ్రీ పూర్తి చేసినప్పటికి ఆ డిగ్రీ వల్ల సరియైన ఉపాధి అవకాశాలు లభించడం లేదని ఆయన చెప్పారు. ప్రపంచానికి సరిపోయే నైపుణ్యాలు మీలో ఉన్నాయని, మీరు ఏ లక్ష్యాలను సాధించాలని అనుకుంటున్నారో ఆ లక్ష్యాలను అనుగుణంగా మీ నైపుణ్యం అభివృద్ధి చెందకపోగా, నిర్లక్ష్యం చేయబడిందని, కోలుకోలేని విధంగా గత పది సంవత్సరాలుగా మన భావి పౌరుల భవిష్యత్తు సైతం పడిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయాలు 80 అపైన ట్రేడ్ ల్లో శిక్షణ ఇవ్వగలమని అందుకే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని ఆయన చెప్పారు. ఎన్నడూ లేని విధంగా గత 10 సంవత్సరాల తర్వాత వేల సంఖ్యలో ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి వారి జీవితాలలో ఆనందాన్ని నింపిన ఘనత మన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని ఆయన చెప్పారు. నేడు ఎనుముల రేవంత్‌రెడ్డి ఆలోచనా విధానం చాలా గొప్పగా ఉందని, అందుకు అనుగుణంగానే విద్యా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పాఠశాల ప్రారంభం రోజునే విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు యూనిఫాం పంపిణీ చేసి విద్యావ్యవస్థలో నిజమైన లక్ష్యం చేరామని గర్వంగా చెప్పగలమని ఆయన స్పష్టం చేశారు. అందులో భాగంగానే దక్షిణ భారతదేశంలోనే రెండవ విశ్వ విద్యాలయం పాలమూరు విశ్వ విద్యాలయానికి 100 కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం నుంచి తెచ్చుకున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రో.బి.సుధాకర్ రెడ్డి, డైరెక్టర్ ఐసిఎస్ఎస్ఆర్ డా.మధుసూదన్‌రెడ్డి, రిజిస్ట్రార్ పాలమూరు యూనివర్సిటీ డా.విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల నాగలక్ష్మి కన్వీనర్, సుధాకర్‌రెడ్డి హెచ్‌ఓడి , డా.ఉషా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ పాలనలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం

**ప్రజాపక్షం / మహబూబ్‌నగర్ ప్రతినిధి :** బీఆర్ఎస్ పాలనలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయిందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రాత్రికేయుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏడు లక్షల కోట్ల రూపాయల అప్పును నెత్తిన వేసి పోయిందని అందుకు నాలుగు నెలల కిస్తులు కింద రూ. 38వేల కోట్లను కట్టడం జరిగిందని ఆయన చెప్పారు. ఆర్థిక క్రమ శిక్షణ గత ప్రభుత్వం పాటించలేదని, కానీ మా రేవంత్ రెడ్డి సారథ్యంలో ఆర్థిక క్రమ శిక్షణ పాటిస్తూ అత్యవసరమైన పనులను మాత్రమే చేపట్టతున్నట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వంలో పేపర్ల మీద ఆర్డర్లు జరిగినవి తప్ప పనులు జరగలేదని, అధికారులతో చర్చించి ఎట్టకేలకు కొన్ని ప్రాజెక్టులు పూర్తి చేయడం జరిగిందన్నారు. 37 కోట్లతో మున్సిపాల్టీలోని డ్రైన్లను సిసి రోడ్లను క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసిన తర్వాత అతి త్వరలోనే టెండర్లు పిలుస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇంకా 47 కోట్లతో ప్రభుత్వానికి ప్రపోజల్స్ సిద్దం చేసి పంపించడం జరుగుతుందని ఆయన తెలిపారు. 260 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీను మెగా కంపెనీ లెటర్ ఆఫ్ ఇండెంట్ టెండర్ దక్కించుకుందని, ఇంకా 600 కోట్లతో ప్రపోజల్స్ తయారు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించామని, కేంద్ర ప్రభుత్వం స్కూటిని కింద పెట్టడం జరిగిందని అన్నారు. పాఠశాలలో నిర్వాహణకు మహిళా సంఘాల సభ్యులకు బాధ్యతలు అందించామని విరి చేతిలో ఉం టే విద్యావ్యవస్థ బలపడుతుందని ముఖ్యమంత్రి ఎంతో ఆలోచించి సరైన నిర్ణయం తీసుకొన్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ , సిరాజ్ ఖాద్రీ , లక్ష్మ ణ్ యాదవ్ , సిజె బెనహర్ , సాయిబాబా పాల్గొన్నారు.



# పైరవీకారుల మాటలు నమ్మొద్దు

## జూలై మాసం తర్వాత కళ్యాణ లక్ష్మీ చెక్కుతో పాటు తులం బంగారం : ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**ప్రజాపక్షం / పెద్దమందడి :** కళ్యాణ లక్ష్మి చెక్కులను ఇప్పిస్తామని చెబుతూ డబ్బులు వసూలు చేసే పైరవీ కారులను నమ్మకూడదని నేను కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రతి పని పారదర్శకంగా జరుగుతోందని ఎక్కడ ఎవరికి ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పెద్ద మందడి మండల పరిధిలోని కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ లబ్దిదారులకు మంజూరైన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్దిదారులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 36 మందికి షాదీముబారక్ , కళ్యాణ లక్ష్మి చెక్కులు మంజూరయ్యాయని, పెండింగ్‌లో ఉన్న మరో 105 చెక్కులను త్వరలోనే అందిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమమెల్యే మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలలోని ఆడబిడ్డల ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్క లబ్దిదారునికి ఉండాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రఘు ప్రసాద్ , జడ్పిటిసి రఘుపతిరెడ్డి, వైస్ ఎంపిపి భారతి, సింగిల్‌విండో అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీడీఓ సద్గుణ, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

**హైదరాబాద్:** కరెంటు కొనుగోళ్లు, భద్రాద్రి విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వ నిర్ణయంలో లోటుపాట్లను సమీక్షించడానికి జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి కమిషన్ ఏర్పాటుపై మాజీ సిఎం, బిఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు దాఖలు చేసిన పిటిషన్ విచారణ ముగిసింది. కెసిఆర్ పిటిషన్‌కు విచారణ అర్హత ఉందా లేదా అనే దానిపై సిజె ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. ఈ కేసుకు సంబంధించి ప్రభుత్వం తరఫున ఎజి సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. కెసిఆర్ పిటిషన్‌కు విచారణ అర్హత లేదని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ ఎక్కడా వివాదాలకు పోలేదని తెలిపారు. విద్యుత్ కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి పక్షపాత ధోరణితో వ్యవహరించలేదని కోర్టుకు వివరించారు. విలేకరుల సమావేశంలో ఆయన ఎక్కడా వివాదాస్పద అంశాలు మాట్లాడలేదని చెప్పారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం.. విచారణను ముగించి తీర్పును రిజర్వ్ చేసింది.



# 'మహేశ్వరం కెజిబివి' నిర్మాణం, మౌలిక వసతులకు హెచ్‌ఎఎల్‌తో అవగాహన ఒప్పందం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహేశ్వరంలోని కస్తూర్బ గాంధీ బాలిక విద్యాలయ(కెజిబివి) నిర్మాణానికి, మౌలిక వసతుల అభివృద్ధి కోసం హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిటిటెడ్ సంస్థ(హెచ్ఎఎల్)తో ఎడ్యుకేషన్ వెల్ఫర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఇడబ్ల్యుఐడిసి) పరస్పర అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ మేరకు ఇడబ్ల్యుఐడిసి, ఎం.డి, సమగ్ర శిక్ష ఎస్‌పిడి డాక్టర్ మల్లయ్య భట్టు, హెచ్ఎ ఎల్ జనరల్ మేనేజర్ ఎం.సత్యనారాయణ హైదరాబాద్‌లో శుక్రవారం పరస్పర అవగాహన ఒప్పందం పత్రాలపై సంతకం చేశారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత(సిఎస్ఆర్)లో భాగంగా హెచ్ఎల్ సంస్థ రూ. 2 కోట్లను ఖర్చుపెట్టనుంది. ఈ కార్యక్రమంలో హెచ్ఎఎల్ ఎజిఎం ఎ.వి.మురలీకృష్ణ, హెచ్ఆర్ సూర్యకాంతరావు, ప్రహ్లాద్,రామ్‌కిశోర్,రంగారెడ్డి ఇఇ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

## మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం వీపనగండ్ల తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. ప్రజాపాలనలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ విధంగా ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తామని, ఇప్పటికే మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం, సబ్సిడిపై పై గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించటం, ఆరోగ్యశ్రీ ద్వారా 10 లక్షల వరకు ఉచిత వైద్యం అమలు చేయడం జరిగిందని, ఆగస్టు 15వ తేదీ లోగా 2 లక్షల వరకు రైతు రుణ మాఫీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణమూర్తి, ఆర్ఐ కురుమయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోదల బీరయ్య, పాన్‌గల్ సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గంగిరెడ్డి, మండల రైతు బంధు సమితి మాజీ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, బొల్లారం సుదర్శన్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి, పెద్ద రాంబాబు, లోడుగు రాజు, వెంకటస్వామి, నక్క విష్ణు, రామిరెడ్డి, గోపి, రవిందర్ రెడ్డి, ముంత రాజు, కృష్ణా తదితరులు ఉన్నారు.



# మధ్యాహ్నభోజన కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

## ఎఐటియుసి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ జిల్లావ్యాప్తంగా మధ్యాహ్న బోజనవర్కర్స్‌కు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఎఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తూ డ్రాపవుట్ తగ్గించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు 2001 సంవత్సరంలో ప్రారంభించిన మధ్యాహ్నబోజన పథకం విజయవంతంకావడంలో కార్మికులపాత్ర కీలకమన్నారు. కాని వంటచేసే కార్మికులకు ఏమాత్రం ప్రభుత్వాలు కనీస వేతనాలు చెల్లించకుండా రోజుకు రూ.33ఇస్తూ అది కూడా ఆరునెలలకు ఒకసారి ఇస్తూ శ్రమదోపిడి చేస్తున్నారని అన్నారు. 2022 సంవత్సరం జనవరి, ఫిబ్రవరి, మార్చిమాసాలలో 68రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా వంటలుబంద్‌చేసి సమ్మెచేసిన సందర్భంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ 2022న అసెంబ్లీలో వంటకార్మికులకు చెల్లిస్తున్న నెలజీతం 3వేలు పెంచుతున్నామని కానినేటికి అమలుకావడంలేదన్నారు. పెండింగ్‌బిల్లులు, పెండింగ్ వేతనాలు , కోడిగుడ్ల బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. వంటకార్మికులకు నియామకపత్రాలు అందించి గుర్తింపుకార్డులు అందజేయాలన్నారు. కొత్తమెనూ ప్రకారంవంట చేయాలంటే కనీసం రోజువేతనం 600లు చెల్లించాలన్నారు. ప్రమాదబీమా, పిఎఫ్, ఇఎస్ఐ , సామాజికభద్రత, సౌకర్యాలు కల్పించాలన్నారు. వంటకార్మికులను గుర్తించి కనీస వేతనం 26వేలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎఐటియూసి తెలంగాణ మధ్యాహ్న బోజనవర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి చిన్నపాగశ్రీనివాసులు, మధ్యాహ్న బోజనకార్మికులు నాగమ్మ, వరమ్మ, బాలపీరు పాల్గొన్నారు.

# వనపర్తిని మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా మారుద్దాం : కలెక్టర్

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** వనపర్తి జిలాను మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి నార్కోటిక్ కమిటీసమన్వయ సమావేశం నిర్వహించగా కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో ఇప్పటి వరకు ఉన్న గంజాయి సాగు కేసులు, మాదక ద్రవ్యాలు వాడుతున్న వారి కేసులపై ఆరా తీయగా డిఎస్పీ కృష్ణ కిషోర్ వివరాలు తెలిపారు. 2016 నుండి జిల్లాల్లో 3 గంజాయి సాగు చేస్తున్న వారిపై కేసులు ఉన్నాయని వాడిన వారు 17 కేసులు నమోదు అయినట్లు తెలిపారు. స్పందించిన జిల్లా కలెక్టర్ గంజాయి సాగుపై వ్యవసాయ విస్తీర్ణాధికారుల ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సాగును గుర్తించాల్సిన బాధ్యత ఏఈఓలపై ఉందన్నారు. ఎక్కడైనా మాదక ద్రవ్యాల ఉత్పత్తి కానీ వాడకం కానీ జరిగినట్లు తెలిస్తే 8712671111 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత గంగ్వార్ , డిఎఫ్ఓ నవీన్ రెడ్డి, ఆర్డీఓ పద్మావతి, డిఎస్పీ కృష్ణ కిషోర్ , అబ్కారీ శాఖ సూపరింటెండెంట్ ప్రభువినయ్ , రవాణా శాఖ అధికారి మానస, విద్యాశాఖ అధికారి గోవిందరాజులు, సంక్షేమ శాఖ అధికారులు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## జిహెచ్ఎంసి కమిషనర్‌ను కల్సిన ఉప్పల్ ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/మేడ్చల్‌ప్రతినిధి :** ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి పనులకు గాను అవసరమైన నిధులు కేటాయించటంతో పాటు జాప్యం లేకుండా పూర్తి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలిని కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌తో శుక్రవారం కలిసారు.

ప్రజాపక్షం
మహానగరి
మేడ్చల్ మల్కాజ్‌గిరి — వికారాబాద్
కరీంనగర్ | శనివారం | 29 జూన్, 2024 | 11

## పారిశుద్ధ్య కార్మికుడిని ఢీకొట్టిన కారు

**ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట:** మితిమీరిన వేగంతో అజాగ్రత్తగా కారు నడిపి రహదారి పక్కన విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ కార్మికుని ఢీకొట్టి తీవ్రంగా గాయపరిచిన సంఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. గాజులరామారం సర్కిల్ పారిశుద్ధ్య విభాగంలో శాంతారావు విధుల్లో భాగంగా చెత్త సేకరణ చేస్తున్న సందర్భంలో ఐడిపిఎల్ నుంచి చింతల్ వైపుకు వెళ్తున్న ఉబర్ క్యాబ్ టీఎస్ జీరో సెవెన్ యు ఎంజీరో ఫైవ్‌జీరో సెవెన్ వాహనంవేగంతో వెళ్తున్న కారు డ్రైవర్ బి.నాగాంజనేయ, శాంతరావును ఢీకొట్టాడు. దీంతో కార్మికుడు ఎగి రి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని గుద్దుకొని కింద పడిపోయాడు దీంతో స్థానికులు తీవ్రంగా గాయపడికి కార్మికుడిని చికిత్స నిమిత్తం ఎర్రగడ్డ ఈఎస్ఐ ఆసుపత్రికి తరలించారు. కార్మికుడికి రెండు కాళ్లు తీవ్రంగా గాయపడ్డాయి. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను జీడిమెట్ల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## సమస్యలను పరిష్కరించడమే లక్ష్యం

### కొలను హన్మంతరెడ్డి



**ప్రజాపక్షం/నిజాంపేట్:** నిరుపేద ప్రజల సమస్యలను పరిష్కరించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సుభాష్ నగర్ డివిజన్ ఉషోదయ టవర్స్ కాలనీకి చెందిన సత్యనారాయణ కుమారుడు సుదీప్ గుండె వ్యాధితో బాDపడుతు నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి స్పందించి రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబుతో మాట్లాడుతూ రూ. 2.50 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఎల్ఓసిని మంజూరు చేయించారు. ఈ సందర్భంగా బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సుదీప్ కుటుంబ సభ్యులకు ఎల్ఓసీని కొలను హన్మంత రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, పాలకృష్ణ, రషీద్, సిద్ధయ్య, సంజీవరెడ్డి, పాల్గొన్నారు.

## బోరు మరమ్మతు పనులు



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** ప్రజల సౌకర్యార్థం వెంకటాపురం డివిజన్ కార్పొరేటర్ సబితా అనీల్ కిషోర్ సొంత నిధులతో బోరు పంపు మరమ్మ తు పనులు చేపట్టారు. ఇందిరానగర్ మీ సేవా కేంద్రం వద్ద చెడి పోయిన హ్యాండ్ బోర్ పంపు మరమ్మత్తు పనులు చేపట్టాలని అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లినా పట్టించుకోవటం లేదని, ఈ కారణంగానే తాను రూ.6 వేలతో మరమ్మత్తు పనులు చేపట్టి అందుబాటులోకి తీసుకొని వచ్చానని ఆయన తెలిపారు. మరమ్మత్తు పనులు చేసిన బోర్ పంపును తిరిగి ప్రారంభించిన ఆయనతో పాటు సంపత్, సురేష్ తదితరులు ఉన్నారు.

## ట్రాఫిక్ సమస్య తీర్చాలని మౌనదీక్ష



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** ఆల్వాల్ చౌరాస్తాలోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద ట్రాఫిక్ రద్దీ సమస్య పరిష్కరించాలంటూ మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర రెడ్డి శుక్రవారం మౌనదీక్ష చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఆల్వాల్ సర్కిల్‌లో ఉన్న ఇందిరాగాంధీ విగ్రహ ప్రాంతం చౌరాస్తా ప్రాంతం ఒక పక్క కరీంనగర్, రామగుండం వైపు రాజీవ్ గాంధీ హైవే, మరో వైపు నాగపూర్ హైవేవైపు వెళ్లే మార్గాలకు కీలకంగా మారటంతో పాటు నివాస ప్రాంతాలు అధికంగా ఉండటంతో నిత్యం రేయింబవళ్లు ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలు, కార్లు, ద్విచక్ర వాహనాలు వేలాది సంఖ్యలో సంచరిస్తుండటంతో రద్దీ తీవ్రమయి ప్రమాదాలకు దారి తీస్తోందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి గాను ప్రత్యామ్నాయ మార్గాలు చేపట్టి ట్రాఫిక్‌ను నియంత్రించాలని పలు సార్లు తాను అధికారుల దృష్టికి తీసుకొని వచ్చినా ఫలితం లేక పోయిందన్నారు. ఈ సమస్యను తాను ప్రభుత్వ దృష్టికి తీసుకొని వెళ్లేందుకే మౌన దీక్ష చేపట్టానన్నారు.

## సమస్యలను పరిష్కరించాలని వినతి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** వాణినగర్ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ స్థానిక కార్పొరేటర్ మేకల సునీతా రాము మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖరరెడ్డిని శుక్రవారం కల్సి వినతిపత్రం సమర్పించారు. గత కొద్ది కాలంగా రోడ్డు పనులు, డ్రైనేజి మరమ్మత్తు పనులు పెండింగ్‌లో ఉన్నాయని కార్పొరేటర్ తెలిపారు. కాలనీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సిద్దయ్య, నరసింగరావు, కమిటీ సభ్యులు రాము యాదవ్, వెంకన్న తదితరులు ఆమె వెంట ఉన్నారు.

## ఇంకుడు గుంతలు తప్పనిసరి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** ప్రతి ఇంటి ప్రాంగణంలో తప్పని సరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని గౌతం నగర్ కార్పొరేటర్ మేకల సునీతా రాము యాదవ్ సూచించారు. డివిజన్‌లోని భవానినగర్‌లో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలను ఆ ప్రాంత సంక్షేమ సంఘ అధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి శశి కుమార్, కాలనీకి చెందిన రామారావు, అనిల్ కుమార్‌లతో కల్సి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఇంకుడు గుంతల వల్ల వేసవి కాలంలో బోరు బావులు ఎండి పోకుండా ఉంటాయన్నారు.

## పేరు వచ్చే విధంగా పనిచేయాలి

### జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్‌లోని శిక్షణ కేంద్రంలో శిక్షణ పొం దుతున్న శిక్షణ పోలీస్‌లతో జిల్లా ఎస్‌పి నారాయణరెడి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ పోలీస్‌కు మంచి పేరు వచ్చే విధంగా పని చేయాలని ,అభ్యర్థులు ప్రతి రోజు ఒక మంచి విషయం నేర్చుకోవాలని,ఎవ్వరు కూడా చెడు వ్యసానలకు వెళ్లకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, శిక్షణ కాలంలో యోగ, మెడిటేషన్ ,వ్యాయామం లను శిక్షణ అనంతరం కూడా కొనసాగిస్తూ ,ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు. అనంతరం డీటీసీలోని తరగతి గదులు లైబ్రరీ కంప్యూటర్ ల్యాబ్ బ్యారక్‌లు ,కిచన్ రూమ్‌లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీటీసి ప్రిన్సిపల్ మురళిధర్ ,డిఎస్‌పి విజయ్‌కుమార్ , వీరేష్ , వెంకట్రాం తదితరులు పాల్గొన్నారు.

## పదవి ఉన్నా లేకున్నా అభివృద్ధికి సహకరించాలి : ఎంపిపి

**ప్రజాపక్షం/ కొడంగల్ :** పదవి ఉన్న లేకున్న ప్రతి ఒక్కరు అభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ అన్నారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యా లయంలో సర్వసాదారణ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతు వచ్చే నెల 4వ తేదీతో ఎంపిటిసిల పదవి కాలం ముగుస్తుందని, ఇదే చివరి సమావేశం కావడంతో ప్రజాప్రతినిధులకు, అధికారులకు పలు కీలక అంశా లను సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిసొంత నియోజకవర్గం కావడంతో నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధికి పుష్కలంగా నిధులు వస్తున్నాయన్నారు. అనంతరం మండల ఇన్‌చార్జి ఎంఈవో రాంరెడ్డి మాట్లాడారు. అనంతరం ఎం పీటీసీలు, అధికారులు ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎంపీపీ ముద్దప్పకు శాలువలు, పూలమాలాలతో సత్కరించారు.

# రహదారి ఇలా... ప్రయాణించేది ఎలా..?

### నీటితో నిండిన రోడ్డు ప్రమాదాల బారిన వాహనాదారులు, పాదచారులు మొద్దు నిద్రలో అధికారులు



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మండల కేంద్రంలోని ప్రధాన రహదారి గుంతల మయంగా మారి నీటితో నిండి ప్రమాదకరంగా మారింది. మూడుచింతలపల్లి నుంచి ఉద్దెమర్రి వెళ్లే రోడ్డు మార్గంలో ఉన్న కల్వర్టు వద్ద రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో చిన్న చినుకు పడితే చాలు రోడ్డు మొత్తం నీటితో నిండిపోయి ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రతియేటా వర్షాకాలంలో ఇలా రోడ్డుపై నీళ్లు నిలువడంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ గుంతల్లో పడి పాదచారులు, వాహనాదారులు ప్రమాదాల బారిన పడిన సంఘటనలు ఉన్నా యి. గతంలో ఇక్కడ ఉన్న కల్వర్టు కింద ఉన్న పైపుల్లో నుంచి వర్షపు నీరు వెళ్తుండేవని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం రోడ్డు పక్కన నిర్మాణాలు చేపట్టడంతో నీళ్లు వెళ్లడానికి వీలులేకుండా పోయిందని ప్ర జలు వాపోతున్నారు. ప్రస్తు తం ఏలాంటి పైపులు లేకపోవడంతో నీళ్లు నిలిచి గుంతలు ఏర్పడి ప్ర మాదాలకు నిలయంగా మా రిందని, నీళ్లు ఎక్కువగా నిలిచినప్పుడు వాహనాదారులు ప్రమాదాల బారిన పడకుండా చెట్ల కొమ్మలను అడ్డుగా పెడుతున్నారు. ఈ రోడ్డుకు ఎదురుగా ఉన్న వైన్స్‌షాపులో మందు బాబులు మద్యం సేవించి ఈ గుం తల్లో పడిన సందర్భాలు చాలా ఉన్నాయన్నారు. రానున్నది వర్షాకాలం కాబట్టి అధికారులు ప్రత్యే క దృష్టి సారించి రోడ్డుపైన నిలిచే నీటిని కాలువలోకి మళ్లించే దిశగా శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# కాలనీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



**ప్రజాపక్షం/ఫేట్‌బషీరాబాద్ :** కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద కొంపల్లి మున్సిపాలిటీ అవని గార్డెన్స్ సంక్షేమ సంఘం నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కేపీ వివేకానందని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులు కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు భాగస్వాములు అయినపుడే కాలనీ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి, అధ్యక్షులు వై. రాజా రమణ గౌడ్, ప్రధాన కార్యదర్శి శేశవ రావు, కోశాధికారి కె.శ్రీకాంత్, ఉపాధ్యక్షులు సతీష్, కమిటీ సభ్యులు రాజు, గోవర్ధన గౌడ్, నారాయణరెడ్డి, గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు.

### పెండింగ్‌లో పనులను త్వరితగతిన పూర్తి చేస్తా

**జగద్గిరిగుట్టలో:** కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన జగద్గిరిగుట్ట డివిజన్ మైసమ్మ నగర్ బిసెక్షన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే కేపీ వివేకానంద ని కలిసి కాలనీలో సీసీ రోడ్డు పనులను చేపట్టాలని వినతి పత్రం అందజేశారు.ఎమ్మెల్యే కేపీ.వివేకానంద మాట్లాడుతూ ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయి న అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తామని తెలియజేశారు. అనంతరం శ్రీశ్రీశ్రీ బొడ్రాయి (నాభిశిల) గ్రామదేవత పునః ప్రతిష్ట మహోత్సవానికి ఎమ్మెల్యేని ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికను అందజేశారు. మైసమ్మనగర్ ఏఅండ్‌బిబ్లాక్ అధ్యక్షులు బ్రహ్మానందం చారి, పిల్లి ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శులు ముఖేష్ నేత, బండారు రవీందర్ రెడ్డి, కోశాధికారి జమేదార్ సంతోష్, కమిటీ సభ్యులు పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**నిజాంపేట్‌లో:** కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని సుభాష్ నగర్ డివిజన్ ఎస్ఆర్ నాయక్ నగర్‌లో జరుగుతున్న ఇండోర్ స్టేడియం పనులను స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద పరిశీలించారు. స్టేడి యం పనుల పై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి వివేక్ మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాల్లో భా గంగా కాలనీలలో ఉన్న ఖాళీ స్థలాల్లో పార్కులు, స్టేడియంలు, ఓపెన్ జిమ్ తదితర పనులను చేపట్టన్నారు. అదేవిధంగా ఎస్ఆర్ నాయక్ నగర్‌లో చేపట్టిన ఇండోర్ స్టేడియం పనులను సాధ్యమైనంత త్వరగా క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో నాయకులు సోమేష్ యాదవ్, లక్ష్మీ నారాయణ, యూసుఫ్, ప్రభాకర్, శ్రీనివాస్ రావు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## జాప్యం లేకుండా ధృవీకరణ పత్రాలు జారీ



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** కుల, నివాస, ఆదాయంలాంటి ధృవీకరణ పత్రాలు జారీ చేయటంలో ఎలాంటి జాప్యం చేయవద్దంటూ మల్కాజిగిరి ముదిరాజ్ సంఘం మల్కాజిగిరి తహసీల్దార్ సీతారాంను కల్సి శుక్రవారం వినతిపత్రం అందించారు.సంఘ నాయకులు చెరుకు సాంబశివరాజు ముదిరాజ్, గౌరవ అధ్యక్షుడు రొయ్యల కృష్ణమూర్తిలు మాట్లాడుతూ విద్య, ఉద్యోగాలు, ప్రభుత్వ సబ్సిడీ బ్యాంకు రుణాలు, ఉపాధిలాంటి పనుల నిమిత్తం తహసీల్దార్ కార్యాలయం నుండి జారీ చేసే ధృవీకరణ పత్రాలను వీలైనంత తొం దరగా అవసరమైతే నిబంధనల మేరకు క్షేత్ర స్థాయి పరిశీలనల్లో ఎలాంటి జాప్యానికి ఆస్కారం లేకుండా జారీ చేయాలని వారు కో రారు. సంఘ కోశాధికారి దండు ప్రసాద్, ఉపాధ్యక్షుడు కటికల భిక్షపతి ముదిరాజ్, ప్రచార కార్యదర్శులు ఆంజనేయులు, బతికె మల్లయ్య, తదితరులు ఉన్నారు.

## సిబ్బంది కొరత లేకుండా చూడాలి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** పారిశుధ్య పనులకు సంబంధించి సిబ్బంది కొరత లేకుండా చూడాలని మౌలాలి కార్పొరేటర్ సునీతా శేఖర్ యాదవ్ కోరారు. పారిశుద్యం విషయంలో తమ బాధ్యతగా పరిగణించాలని కోరారు. పారిశుద్ధ్యరహిత ప్రాంతంగా మౌలాలి ప్రాంతాన్ని తీర్చి దిద్దేందుకు శానిటేషన్ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని, లేని పక్షంలో రానున్న వర్షాకాలంలో ప్రజలు అనారోగ్యాల పాలవుతారన్నారు. శుక్రవారం కార్పొరేటర్ కార్యాలయంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, యుసిడి ఇన్‌చార్జి పుష్ప, రాంకీ ఇన్‌చార్జి దయానంద్, సిఎన్‌డి ఇన్‌చార్జి శశాంక్ రాజకుమార్ ఆర్పీలతో కార్పొరేటర్ సమావేశమయ్యారు.

## సజావుగా పరీక్షల నిర్వహణ

### జిల్లా కలెక్టర్ గౌతం



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** తెలంగాణా రాష్ట్ర సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30 నుండి జూలై 4 వరకు జరుగనున్న డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ నియామక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు ప్రణాళికాయుక్తంగా ఏర్పాట్లు చేయాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతం సూచించారు. పరీక్షల నిర్వహణ నిమిత్తం శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో సంబంధిత శాఖాధికారులు, సిబ్బందితో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు అవసరమైన మౌళిక వసతులు కల్పించాలని, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. అవసరమైన విధంగా అదనపు బస్సులను ఏర్పాటు చేయాలని ఆయన ఆర్టీసీ అధికారులకు సూచించారు.

## డిగ్రీ,పిజి మహిళా కళాశాలలో దరఖాస్తులు

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజి కళాశాల జగద్గిరిగుట్ట (శామీర్‌పేట) కళాశాలలో చేరేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్ తెలిపారు. శుక్రవారం పత్రికా ప్రకటనలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ డిగ్రీ, పీజి కళాశాలలో బికామ్ బిఏ, బికామ్‌సిఏ, ఎంపిసి, ఎంఎస్‌సిఎస్, ఎంజడ్‌సి, బిజడ్‌సి, ఎంఎస్‌డిఎస్, బిఎస్సిలలో విద్యార్థులకు నచ్చిన కోర్సుల్లో చేరవచ్చని తెలిపారు. ఇందుకుగాను ఇంటర్ ఉత్తీర్ణులై ఉన్న ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన విద్యార్థినిలు నేరుగా కళాశాలకు విచ్చేసి నచ్చిన గ్రూపులో చేరవల్సిందిగా తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ ప్రకటనలో కోరారు.

## నీటిసంపులో పడి బాలుడు మృతి



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి బాలుడు మృతి చెందిన సంఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం మధ్యప్రదేశ్ నుంచి బతుకు దెరువుకు వలస వచ్చిన కుటుంబం తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్లో నిర్వహిస్తున్న నర్సరీల్లో పని చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. శుక్రవారం యధావిధిగా బాలుడి తల్లిదండ్రులు పనిలో నిమగ్నమయ్యారు. కాన(2) అనే బాలుడు నర్సరీ పక్కనే ఉన్న సంపు వద్ద ఆడుకుంటు ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి మృతి చెందాడు. గమనించిన కుటుంబీకులు 108 అంబులెన్స్‌కు ఫోన్‌చేయగా అప్పటికే మృతి చెందాడని తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఎంపి ఈటల ఇంటి ముట్టడి

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** అవకవతకలతో నిర్వహించిన నీట్ ప్రవేశ పరీక్షతో వేలాది మంది విద్యార్థులు నష్టపోయిన విషయాన్ని లోకసభలో మాట్లాడక పోవటాన్ని నిరసిస్తూ యువజన, విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ సమితి శుక్రవారం మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్ ఇంటి ముట్టడి చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ యాదవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు మహేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంతోష్, గిరిబాబు, వినయ్, నాగరాజు, ప్రీతమ్, కిరణ్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పరీక్ష అవకవతవకలకు బాధ్యుడిగా కేంద్ర విద్యా శాఖ, మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌ను బర్తరఫ్ చేయాలని వారు డిమాండ్ చేసారు.

# కొడంగల్‌లో యుద్ధ ప్రతిపాదికన పనులు

### జిల్లా కలెక్టర్‌లు ప్రతిక్‌జైన్, సిక్తా పట్నాయక్

**ప్రజాపక్షం/ కొడంగల్ :** కొడంగల్ నియోజకవర్గంలోని మంజూరైన నిధులతో యుద్ధ ప్రతిపాధికన పనులను ప్రారంబించాలని వికారాబాద్ ప్రతిక్‌జైన్ , నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌లు అన్నారు. శుక్రవారం కొడంగల్ కడ కార్యాల యంలో ఆయా శాఖల అధికారులతో కలిసి సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి అభివృద్ధి పనులపై పలు కీలక సూచనలు చేశారు. కొడంగల్ నియోజకవర్గంలో కొడంగల్, దౌల్తాబాద్, బోంరాస్‌పేట మండలాలు వికారాబాద్ జిల్లాలో ఉండటం, కోస్గి, మద్దూర్ మండలాలు నారాయణపేట జిల్లాలో ఉండటంతో ఇరు జిల్లాల కలెక్టర్‌లు కడ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో మాట్లాడుతు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి పనులకు టెండర్ల ప్రక్రియను వేగవంతం చేసి పనులకు ప్రారంబించాలన్నారు. రోడ్ల విస్తరణ, కొత్త రోడ్లు, పంచాయతీ రాజ్, అర్ఆండ్‌బి శాఖల ఇంజనీర్లు ప్రత్యేక దృష్టి సారించి భూసేకరణ విషయంలో ఏదైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై ప్రతి వారము నిర్వహించే సమీక్షలో ప్రోగ్రెస్ ఉండేలా అధికారులు చర్యలు తీసుకుని శ్రద్ధతో ముందుకు వెళ్లాలని సూచించారు. పట్టణంలోని కమ్యూనిటి హాస్పేటల్‌ను ఆకస్మికంగా తనిఖీలు చేసి ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య పరీక్షలపై ఆరా తీశారు. వీరితో పాటు కడ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు, డిసిఎచ్ఎస్ ప్రదీప్‌లతో పాటు తదితరులున్నారు.

## మిషన్‌భగీరథలో మురుగు నీరు



ఆవేదన వ్యక్తం చేస్తున్న కొడంగల్ వాసులు

**ప్రజాపక్షం / కొడంగల్ :** కొడంగల్ నియోజకవర్గంలో గత వారం రోజులుగా మిషన్ భగీరథ ద్వారా అందించే మంచినీటికి బదులుగా మురుగునీరు వస్తుందని పట్టణ ప్రజలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ ద్వారా వేల కోట్ల రూపాయలను వెచ్చించి మంచినీళ్లు ఇవ్వాలనే సంకల్పం నీరుగారుతుందని ప్రజలు వాపోతున్నారు. గత రెండు నెలల క్రితం అధికారులు శ్రీశైలం బ్యాక్ వాటర్ కాకుండా తాండూర్ కాగ్నా నది వాగు నుంచి ప్రత్యేక మోటర్‌లతో కొడంగల్‌కు నీరందిస్తున్నారు. కాని ఈ నీళ్లు ఫిల్టర్ చేస్తున్నారో లేదా అలాగే వాటర్ అందిస్తున్నారో అంటు ప్రజలు అనేక ప్రశ్నలు వేస్తు అధికారుల తీరుపై భగ్గుమంటున్నారు. అనేక సార్లు అధికారులకు ఫిర్యాదులు ఏ అధికారి పట్టించుకున్న పాపాన పోలేదని వాపోతున్నారు. కొడంగల్‌లో ప్రజలు నీళ్లవల్ల అనేక ఇబ్బందులకు గురి అవుతున్న అధికారులు గాని, ఇటు రాజకీయ నాయకులు గాని ప్రజల ఆరోగ్యాలపై ఎందుకు పట్టించుకోవడం లేదని తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైన స్పందించి మురుగు నీళ్లకు బదులుగా మంచినీళ్లు అందివ్వాలని లేని పక్షంలో ఆందోళన చేయక తప్పదని హెచ్చరిస్తున్నారు.

## ప్రజా సమస్యలను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి** వికారాబాద్ మండల సర్వసభ్య సమా వేశం ఎంపిపి చంద్రకళ కామల్‌రెడ్డి అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గత 5సంవత్సరాలుగా ఏ పనులు సరిగ్గా చేయలేక పోయామన్నారు. వైస్‌ఎంపీపీ రాములు మాట్లాడుతూ సర్వసభ్య సమావేశంలో మదన్‌పల్లి గ్రామంలో నిరుపేద రైతుల భూములు, ఫారెస్టులో ఉన్న భూముల సమస్య, అసైన్డ్ భూ సమ స్యలు అలాగానే ఉండిపో యాయని, రైతులకు పట్టపాసు బక్ లేనందువలన రైతుబీమా , రైతుబంధు , బ్యాక్ రుణలను కోల్పోతున్నారని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారని పలు సమస్యలు ఎంపీపీ సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యను వేంటనే పరిష్కరించాలని తహసీల్దార్‌ను కోరారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి జ్యోతి మాట్లాడుతూ వ్యవసాయనికి అవసరమైన విత్తనాలు ,ఎరువులు అందు బాలో ఉంచాలన్నారు. అనంతరం ఎంపిటిసి గౌస్ మాట్లాడుతూ కోట్‌పల్లి రోడ్డు పనులను వేంటనే ప్రరంభించాలని అధికారులకు సుచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి ప్రమోదిని , ఎంపిడిఓ వినయ్‌కుమార్ , తహసీల్దార్ లక్ష్మి నారాయణ, యంఇఓ బాబుసింగ్ ,యంపిటిసిలు గౌస్ , గోపాల్ ,పుస్పలత, జాఫార్ , తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంబాలను ఏర్పాటు చేయండి



**ప్రజాపక్షం/పరిగి :** తుప్పు పట్టిన విద్యుత్ స్థంబాలను తొలగించి కొత్త విద్యుత్ స్థంబాలను ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికా రులకు విన్న వించారు. శుక్రవారం పుదూర్ మండల పరిధిలోని చెన్‌గోముల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్‌నాయకులు జిల్లా ఏడి సత్యనారా యణకు పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు గ్రామంలో గత కొన్ని సంవత్స రాలుగా తుప్పు పట్టిన విద్యుత్ స్థంబాలతో తీవ్ర ఇబ్బందులకు గురి కావడమే కాకుండా పలు ప్రమాదాలకు నీలయంగా మారాయని వాపోయారు. దీనిపై స్థానిక ఎంఎల్‌ఏ దృష్టికి తీసుకువెళ్లగా వారి లెటర్‌తో మీ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. వెంటనే కొత్త విద్యుత్ స్థంబాలను ఏర్పాటు చేయాలని కోరారు. వీరితో పాటు లింగప్ప, యాదగిరిగౌడ్, సుధాకర్‌గౌడ్, నవీన్‌కుమార్ తదితరులున్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు

### జిల్లా ఆసుపత్రి అకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/తాండూరు :** ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే రోగులకు మెరుగున వైద్య సేవలు అందించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ వైద్యులను ఆదేశించారు. శుక్రవారం తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ అకస్మీకంగా తనిఖి చేశారు. ముందుగా ఆసుపత్రిలోని ప్రతి వార్డును సున్నితంగా పరిశీలించి అక్కడి పరిస్థితులు, రోగులకు అందిస్తున్న వైద్య సేవలను క్షుణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచే వైద్యులు, సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఆసుపత్రిలో ఎంత మంది వైద్యులు ఉన్నారని, ప్రతి రోజు ఎంత మంది రోగులు వస్తారని పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ సమస్యలతో వచ్చే పేషంట్లకు వెంటనే మెరుగైన చికిత్సలు అందించే విధంగా డాక్టర్‌లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మహిళా, పురుషుల వార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చే ఔట్ పేషంట్స్, ఇన్ పేషంట్స్ నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల పట్ల వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ అకస్మీక తనిఖిలో కలెక్టర్ వెనుక ఆర్డిఒ శ్రీనివాస్‌రావు, జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ ప్రదీప్‌రావు ఉన్నారు.

## రైతుబంధుపై ప్రజాభిప్రాయ సేకరణ

**ప్రజాపక్షం/తాండూరు :** తట్టేపల్లి పిఏసిఎస్ ఆద్వర్యాంలో రైతు బంధుపై ఆయా గ్రామాల రైతులతో ప్రజాభిప్రాయ సేకరణ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పిఎసిఎస్ చైర్మన్ లక్ష్మారెడ్డి తెలిపారు. తట్టేపల్లి రైతు వేధికలో శనివారం మధ్యాహ్నం 2గంటలకు సమావేశాన్ని నిర్వహించన్నుట్లు పేర్కొన్నారు. ఈ సమావేశాన్ని జిల్లా సహకార సంఘం అధికారి ఆదేశాల మేరకు నిర్వహించనున్నామని తెలిపారు ఈ ప్రజాభి ప్రాయ సేకరణ సమావేశానికి రైతు వేధిక పరిధిలోని వివిధ గ్రామాల్లోని రైతులు అధిక సంఖ్యలో హజరై అభిప్రాయాలను తెలుపాలని సూచించారు.

## క్రీడ

# షఫాలీ వర్మ @200




టీమ్ఇండియా మహిళల జట్టు యంగ్ బ్యాటర్ షఫాలీ వర్మ వరల్డ్ రికార్డ్ క్రియేట్ చేసింది. చెన్నై వేదికగా సౌతాఫ్రికాతో జరుగుతున్న టెస్టు మ్యాచ్‌లో మహిళల క్రికెట్‌లోనే అత్యంత వేగవంతమైన డబుల్ సెంచరీ సాధించింది. షఫాలీ 194 బంతుల్లోనే 200 మార్క్ అందుకుంది. ఈ క్రమంలో ఆసీస్ బ్యాటర్ అనబెల్ (248 బంతుల్లో) రికార్డ్‌ను షఫాలీ బ్రేక్ చేసింది. కాగా, టీమ్ఇండియా నుంచి టెస్టుల్లో డబుల్ సెంచరీ సాధించిన రెండో బ్యాటర్‌గా నిలిచింది. 2002లో అప్పటి భారత కెప్టెన్ మిథాలీ రాజ్ ఈ మార్క్ అందుకుంది. అంటే దాదాపు 22ఏళ్ల తర్వాత మహిళల క్రికెట్‌లో టీమ్ఇండియా బ్యాటర్ డబుల్ సాధించింది. ఇక షఫాలీ ఓవరాల్‌గా ఉమెన్స్ క్రికెట్‌లో టెస్టు డబుల్ సెంచరీ సాధించిన 10వ బ్యాటర్‌గా నిలిచింది.

**స్మృతి జస్ట్ మిస్**

ఈ మ్యాచ్‌లో మరో ఓపెనర్ స్మృతి మంధాన కూడా రఫ్ఫాడించింది. షఫాలీతో కలిసి స్కోర్ బోర్డును ముందుకు నడిపించింది. ఈ మ్యాచ్‌లో మంధాన 149 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. ఒక్క పరుగు తేడాతో కెరీర్‌లో తొలి 150 మిస్ చేసుకుంది. వీరిద్దరు తొలి వికెట్‌కు 292 పరుగుల భారీ భాగస్వామ్యం నిర్మించారు. ఇది మహిళల టెస్టు క్రికెట్‌లో అత్యధిక తొలి వికెట్ పార్ట్‌నర్‌షిప్. ఇక మ్యాచ్‌విషయానికొస్తే, తొలి రోజు ఆట ముగిసేసరికి టీమ్ఇండియా 5254 భారీ స్కోర్ చేసింది. క్రీజులో హర్మన్‌ప్రీత్ సింగ్ (42 పరుగులు), రిచా ఘోష్ (43 పరుగులు) ఉన్నారు. ఓపెనర్లు షఫాలీ వర్మ (205), స్మృతి మంధాన (149), జెమీమా రోడ్రిగ్స్ (55 పరుగులు) రాణించారు. సౌతాఫ్రికా బౌలర్లలో దెల్మి టక్కర్ 2, డి క్లర్క్ 1 వికెట్ పడగొట్టారు. అందులోనూ రికార్డే మహిళల టెస్టులో ఒక రోజులో అత్యధిక పరుగులు చేసిన జట్టుగానూ టీమ్ఇండియా రికార్డు సృష్టించింది. 2002లో బంగ్లాదేశ్‌పై శ్రీలంక (5099 స్కోర్) రికార్డు బద్దలైంది. ఈ మ్యాచ్‌లో భారత్ తొలి రోజే 525 పరుగులు చేసింది.

# భారత్ 11ఏళ్లు, సౌతాఫ్రికా 26ఏళ్లు




**న్యూఢిల్లీ :** టీ20 వరల్డ్‌కప్ ఫైనల్ ఫైట్ భారత్ సౌతాఫ్రికా మధ్య జరగనుంది. బర్బాడోస్ వేదికగా జూన్ 29న ఈ ఫైనల్ జరగనుంది. ఈ అవకాశం కోసం చాలా కాలంగా నిరీక్షిస్తున్నాయి. టైటిల్‌కు ఒక్క అడుగు దూరంలో ఉన్న ఇరుజట్లు ఛాంపియన్‌గా నిలవాలని ఆశిస్తున్నాయి. అయితే సౌతాఫ్రికా ఐసిసి ట్రోఫీ గెలిచి దాదాపు 26ఏళ్లు కాగా, టీమ్ఇండియా 11ఏళ్ల నుంచి ఐసిసి ఈవెంట్‌లో ఛాంపియన్‌గా నిలువడానికి ఎదురుచూస్తోంది.

**26ఏళ్ల నుంచి సౌతాఫ్రికా వెయిటింగ్**

సౌతాఫ్రికా చివరిసారి 1998 ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ టైటిల్ గెలిచింది. బంగ్లాదేశ్ ఢాకా వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన ఫైనల్లో సౌతాఫ్రికా 4వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 245 పరుగులకు ఆలౌటైంది. అనంతరం ఛేజింగ్‌కి దిగిన సౌతాఫ్రికా 6 వికెట్లు కోల్పోయి 248 పరుగులు చేసింది. 37 పరుగులు, 5 వికెట్లతో అదరగొట్టిన ఆల్‌రౌండర్ జాక్వెస్ కలిస్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు. ఇదే సౌతాఫ్రికా గెలిచిన ఏకైక ఐసిసి టైటిల్ కావడం గమనార్హం. సౌతాఫ్రికా జాబితాలో ఒక్క వన్డే, టీ20 ప్రపంచకప్ కూడా లేదు. దాదాపు 26 ఏళ్లుగా సౌతాఫ్రికా ఐసిసి ట్రోఫీ కోసం ఎదురు చూస్తోంది. ఈ మధ్య కాలంలో పలుమార్లు ఐసిసి ఈవెంట్లలో సెమీస్‌కు చేరినా అక్కడ సఫారీలకు నిరాశ తప్పలేదు. ఇక గతేడాది జరిగిన వన్డే వరల్డ్‌కప్‌లో అద్భుత ప్రదర్శనతో సౌతాఫ్రికా సెమీస్ చేరింది. కానీ, సెమీస్‌లో ఆస్ట్రేలియాను ఢీకొట్టిన సౌతాఫ్రికా ఓడింది. దీంతో మరోసారి సౌతాఫ్రికా భంగపడింది. అయితే ఈసారి ఇంకో అడుగు ముందుకేసి తొలి వరల్డ్‌ప్ ఫైనల్ ఆడబోతోంది. ఈసారి ఎలాగైనా టైటిల్ సాధించాలని పట్టుదలతో ఉంది.

**11ఏళ్లుగా టీమ్ఇండియా**

2013 ఛాంపియన్స్ ట్రోఫీ నెగ్గిన టీమ్ఇండియాకు అదే ఆఖరి ఐసిసి టైటిల్. 2013 నుంచి టీమ్ఇండియా ఐసిసి ట్రోఫీ కోసం ఎదురు చూ స్తోంది. అప్పటి నుంచి ఐసిసి కప్పు కోసం భారత్ ప్ర యత్నిస్తూనే ఉంది. ఈ 11ఏళ్ల కాలంలో పలు సందర్భాల్లో ఐసిసి ఈవెంట్లలో ఫైనల్ చేరినప్పటికీ తృటిలో కప్పు చేజార్చుకుంది.

**ఏడాదిలో మూడోసారి**

అయితే ఏడాది కాలంలో టీమ్ఇండియా మూడోసారి ఐసిసి టోర్నీ ఫైనల్‌కు చేరుకుంది. గతేడాది జరిగిన 2023 డబ్ల్యుటిసి, 2023 వన్డే వరల్డ్‌కప్‌ల్లో ఫైనల్ చేరిన టీమ్ఇండియా తాజాగా పొట్టికప్‌లోనూ తుదిపోరుకు అర్హత సాధించింది. గతేడాది రెండు ఫైనల్స్‌లోనూ ఆస్ట్రేలియాతో పోరాడి ఓడిన భారత్, శనివారం సౌతాఫ్రికాను ఎదుర్కోనుంది. అంటే ఇప్పుడు ప్రత్యర్థి మారింది. దీంతో ప్రత్యర్థే కాదు, ఫలితం కూడా మారాలని టీమ్ఇండియా ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. దశాబ్ద కాలం నిరీక్షణకు ఈ టోర్నీ విజయంతో తెర పడాలని ఆశిస్తున్నారు.



## రీల్

# నాగ్ అశ్విన్ నటించిన సినిమాలు

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన తాజా చిత్రం 'కల్కి 2898 ఎడి' ప్రస్తుతం దేశవ్యాప్తంగా సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఈ సినిమాకు అన్ని చోట్ల పాజిటివ్ రెస్పాన్స్ రావడంతో ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపించేందుకు సిద్ధమైంది. దర్శకుడు నాగ్ అశ్విన్ ఈ సినిమాను డైరెక్ట్ చేయడంతో ఇప్పుడు అందరూ ఆయన్ను ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. దర్శకుడు నాగ్ అశ్విన్ 'ఎవడే సుబ్రహ్మణ్యం' సినిమాతో దర్శకుడిగా పరిచయమైన సంగతి తెలిసిందే. ఆ తరువాత మహానటి, కల్కి సినిమాలను తెరకెక్కించారు. అయితే, దర్శకుడిగా మారక ముందు నాగ్ అశ్విన్ కొన్ని సినిమాల్లో నటించిన సంగతి చాలా తక్కువ మందికి తెలుసు. మంచు మనోజ్ నటించిన 'నేను మీకు తెలుసా?' సినిమాతోపాటు శేఖర్ కమ్ముల తెరకెక్కించిన 'లీడర్', 'లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్' సినిమాల్లో చిన్న పాత్రల్లో కనిపించారు నాగ్ అశ్విన్. శేఖర్ కమ్ముల దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన నాగ్ అశ్విన్, ఇప్పుడు కేవలం మూడు సినిమాలతోనే టాప్ డైరెక్టర్‌గా మారిపోయాడు. ఇక కల్కి సినిమాను సైన్ ఫిక్షన్ మూవీగా నాగ్ అశ్విన్ రూపొందించాడు.

# 'టాక్సిక్' మరో హీరోయిన్

కేజీఎఫ్ మూవీతో కన్నడ హీరో యశ్ ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేశాడో అందరికీ తెలిసిందే. రాఖీ భాయ్ పాత్రలో తన నటనతో ఆడియెన్స్‌ను ఆకట్టుకున్నాడు ఈ హీరో. ఇక ఆ సినిమాకు సీక్వెల్‌గా వచ్చిన 'కేజీఎఫ్2' తో ఇండియన్ బాక్సాఫీస్ దగ్గర వసూళ్ల వర్షం కురిపించాడు. ఇప్పుడు 'టాక్సిక్' అనే సినిమాను రెడీ చేస్తున్నాడు యశ్. ఈ సినిమాను పూర్తి యాక్షన్ ఎంటర్టైనర్‌గా చిత్ర యూనిట్ రూపొందిస్తోంది. ఈ సినిమాలో అందాల భామ కియార అద్వాని హీరోయిన్‌గా నటించనుంది. అయితే, ఇప్పుడు ఈ సినిమాలో మరో హీరోయిన్ కూడా జాయిన్ కానుందట. బాలీవుడ్ లో పలు సినిమాల్లో నటించి మెప్పించిన హుమా ఖురేషి, 'టాక్సిక్' మూవీలో ఓ కీలక పాత్రలో నటించనుందట. అయితే, ఈ సినిమాలో ఆమె పాత్ర ఎలా ఉండబోతుందా అనేది తెలియాల్సి ఉంది. ఇక ఈ సినిమాను గీతూ మోహన్ దాస్ డైరెక్ట్ చేస్తుండగా వెంకట్ కె నారాయణతో కలిసి యశ్ ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 10, 2025లో రిలీజ్ చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.





# భయపెట్టేందుకు సిద్ధమైన రష్మిక

నేషనల్ క్రష్ రష్మిక మందన్న 'పుష్ప' చిత్రంతో దేశవ్యాప్తంగా ఎలాంటి క్రేజ్ తెచ్చుకుందో అందరికీ తెలిసిందే. అందం, అభినయంతో తనకంటూ ఓ ప్రత్యేక ఇమేజ్‌ను క్రియేట్ చేసుకున్న ఈ బ్యూటీ, వరుసగా సినిమాలు చేస్తూ అభిమానులను అలరిస్తోంది. కేవలం సౌత్‌లోనే కాకుండా 'యానిమల్' మూవీతో నార్త్ లోనూ సాలిడ్ ఇంపాక్ట్ క్రియేట్ చేసింది. ఇక ఇప్పుడు తన అభిమానులను భయపెట్టేందుకు సిద్ధమవుతోందట ఈ బ్యూటీ. బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానాతో కలిసి ఓ హారర్ కామెడీ మూవీలో నటించేందుకు రష్మిక రెడీ అవుతోందట. ఈ సినిమాను 'స్త్రీ', 'భేడియా', 'ముంజ్యా' వంటి హారర్ చిత్రాలను తెరకెక్కించిన నిర్మాత దినేష్ విజన్ ప్రొడ్యూస్ చేయనున్నారు. ఇప్పటికే దర్శకుడు ఆదిత్య సత్పోదర్ కథను రెడీ చేయగా, ఈ ప్రాజెక్ట్ కోసం రష్మికను ఓకే చేశారట మేకర్స్. ఆయుష్మాన్ ఖురానాతో తొలిసారి జతకడుతున్న రష్మిక, మునుపెన్నడూ చూడని పాత్రలో కనిపించబోతున్నట్లుగా తెలుస్తోంది. ఇక ఈ సినిమాకు 'వాంపైర్స్ ఆఫ్ విజయ్ నగర్' అనే టైటిల్ ను పరిశీలిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమాను మేకర్స్ అఫీషియల్ గా అనౌన్స్ చేస్తారట.

# లారీని ఢీకొట్టిన వ్యాన్

13 మంది దుర్మరణం, మరో నలుగురికి గాయాలు

కర్నాటకలోని హవేరిలో ఘటన

రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన సిఎం సిద్ధ రామయ్య




**హవేరి :** కర్నాటకలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శుక్రవారం ఉదయం బ్యాదగీ తాలూకాలోని గుండెనహల్లి క్రాస్ వద్ద ఓ వ్యాను లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు సహా 13 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు తెలిపారు. మరో నలుగురు గాయపడ్డారన్నారు. మృతి చెందిన చిన్నారుల వయస్సు ఏడేళ్ల లోపే ఉందన్నారు. ఘటన పట్ల ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరి చొప్పున రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. కాగా, హవారి జిల్లాలోని బ్యాదగీలో 48వ జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న లారీని శుక్రవారం ఉదయం 3.45 గంటల ప్రాంతంలో ఓ వ్యాన్ వెనుక నుంచి ఢీకొట్టిందని పోలీసులు వెల్లడించారు. ప్రమాద సమయంలో వ్యాన్‌లో 17 మంది ప్రయాణిస్తున్నారని, అందులో 11 మంది అక్కడిక్కకడే మృతి చెందగా, మరో ఇద్దరు ఆసుపత్రికిలో చికిత్స పొందతూ చనిపోయారని చెప్పారు. క్షతగాత్రులైన నలుగురిలో ఇద్దరు ఐసియులో ఉన్నారన్నారు. బాధితులంతా చించోలి మయమ్మ దేవస్థానానికి వెళ్లి తమ స్వస్థలమైన శివమొగ్గజిల్లా యెమెహట్టి గ్రామానికి వెళ్తుండగా ప్రమాదం వాటిల్లిందన్నారు. లారీ రోడ్డు పక్కన ఆగి ఉండగా వెనుక నుంచి వ్యాన్ ఢీకొట్టిందని ఎస్‌పి తెలిపారు. వ్యాన్ డ్రైవర్ నిద్రమత్తులో ఉండడం వల్లే ప్రమాదం జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనలో వ్యాన్ నుజ్జునుజ్జు అయిందని, శిథిలాల్లో చిక్కుకున్న బాధితులను వెలికి తీసేందుకు అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు క్లిష్టతరంగా మారిందన్నారు.

# నేతలకూ తప్పని తిప్పలు

**న్యూఢిల్లీ :** భారీ వర్షాలతో దేశరాజధాని ఢిల్లీలో జనజీవనం అస్తవ్యస్తమవుతోంది. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల కోసం ఎంపిలంతా ప్రస్తుతం నగరంలోనే ఉన్నారు. ఈ వర్షాలతో వారి నివాసాలు కూడా నీటిలో చిక్కుకుపోయాయి. నీటి ఎద్దడి పరిష్కరించాలంటూ ఇటీవల నిరాహారదీక్ష చేసిన ఆప్ నేత, ఢిల్లీ జలమంత్రి ఆతిశీ ఇల్లు కూడా వాటిల్లో ఉంది. తన ఇంట్లోని సామాన్లన్నీ పాడైపోయాయని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ ఎక్స్(ట్విటర్) వేదికగా వెల్లడించారు. 'నేను నిద్రలేచేసరికి అన్ని గదులు నీటితో నిండిపోయాయి. కార్పెట్స్, ఫర్నిచర్ సహా నేలమీద ఉన్న సామాన్లన్నీ పాడైపోయాయి. డ్రైనేజీలు మూసుకుపోవడంతో వర్షపు నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. ఈ సమయంలో కరెంట్ షాక్‌లను నివారించేందుకు ఉదయం ఆరు గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేశారు'' అని కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ వెల్లడించారు. ఈ పరిస్థితుల్లో తాను పార్లమెంట్‌కు సమయానికి వచ్చానని చెప్పారు. ఈ వర్షాలతో సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రామ్ గోపాల్ యాదవ్‌కు ఇబ్బందికర పరిస్థితి ఎదురైంది. లోథి ఎస్టేట్ ప్రాంతంలోని నివాసం వద్ద నీరు నిలవడంతో సిబ్బంది ఆయన్ను ఎత్తుకొని కారులో కూర్చోపెట్టారు. పార్లమెంట్‌కు వెళ్లేందుకే ఇదంతా అని యాదవ్ వెల్లడించారు. తన ఇల్లంతా నీటితో నిండిపోయిందని, రెండు రోజుల క్రితం చేసిన ఫ్లోరింగ్ అంతా పాడైపోయిందని చెప్పారు. ఫ్లోరింగ్ కోసం వెచ్చించిన సొమ్మంతా వృథా అయిందన్నారు. నీటిని తోడేందుకు తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బందికి ఫోన్ చేసిన ప్రయోజనం లేకపోయిందన్నారు. ఈ పరిస్థితులపై ఢిల్లీ కౌన్సిలర్, బిజెపి నేత రవీందర్ సింగ్ నేగి మాట్లాడుతూ.. ''అన్ని కాలువలు పొంగిపొర్లుతున్నాయి. వర్షాకాలానికి ముందు వాటిలో పేరుకుపోయిన చెత్తను తీయకపోవడమే ఈ పరిస్థితికి కారణం'' అని ఆరోపించారు.

# మాజీ ప్రధాని పివికి పలువురు రాష్ట్ర నేతల ఘన నివాళి



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** భారత మాజీ ప్రధాని, భారతరత్న పివి నరసింహారావు 103వ జయంతి వేడుకలు రాష్ట్రంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా హైదరాబాద్‌లోని పివి జ్ఞాన భూమిలో నిర్వహించిన జయంతి వేడుకల్లో పలువురు పాల్గొని పివి చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ నివాళులు అర్పించారు. బహుభాషా కోవిదుడిగా, నూతన ఆర్థిక విధానాల రూపశిల్పిగా ఆయనకు పేరుందని వారు కొనియాడారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రభృతులు పాల్గొనగా , రాష్ట్రంలో హైదరాబాద్‌లోని పివి ఘాట్‌లోనూ, గాంధీ భవన్‌లోనూ, వివిధ రాజకీయ పార్టీల కార్యాలయాల్లోనూ పలువురు పివికి ఘనంగా నివాళులు అర్పించారు. భారత మాజీ ప్రధాని పివి సేవలను తెలుగు జాతి ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. పివి నరసింహారావు జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్ పివి ఘాట్‌లో నివాళులు అర్పించిన అనంతరం అనంతరం కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు. పివి నరసింహారావు సంస్కరణలు అమలు చేయకపోయి ఉంటే దేశం ఇవాళ ఈ స్థితిలో ఉండేదే కాదన్నారు. ఆయన మేధావి కాబట్టే అద్భుతమైన పాలన అందించారన్నారు. ఓ తెలుగుబిడ్డగా, తెలంగాణ ముద్దుబిడ్డ అయిన పివికి శ్రద్ధాంజలి ఘటిస్తున్నానన్నారు. అంతకు ముందు తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్‌మాట్లాడుతూ సోషలిస్టు భావాలు కలిగిన నేత పివి నరసింహారావు అని కొనియాడారు. ఆయన అమలు చేసిన భూసంస్కరణలు ఆంధ్రప్రదేశ్ రాజకీయ మౌళిక స్వభావాన్నే మార్చేశాయన్నారు. అనంతరం మాజీ హోం మంత్రి కుందూరు జానారెడ్డి మాట్లాడుతూ భారత మాజీ ప్రధాని పివి నరసింహారావు ఆర్థిక సంస్కరణల స్ఫూర్తిని తరువాత వచ్చిన ప్రధానులు కొనసాగించారన్నారు. దీనిని బట్టి చూస్తే ఆర్థిక సంస్కరణల్లో ఆయన పాత్ర ఏ స్థాయిదో అర్థం చేసుకోవచ్చని జానారెడ్డి గుర్తు చేశారు. కాంగ్రెస్ ఎంఎల్‌సి సురభి వాణీదేవి మాట్లాడుతూ మన పివి దేశానికి చేసిన సేవలను తెలుగు జాతి ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని, తొలి తెలుగు ప్రధానిగానూ ఆయన చరిత్ర సృష్టించారన్నారు. కాగా గాంధీ భవన్‌లోనూ భారత రత్న పి.వి నర్సింహారావు 103 జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ మేరకు శుక్రవారం గాంధీ భవన్‌లో పి.వి చిత్ర పటానికి పలువురు నివాళులు అర్పించారు. మరో వైపు బిఆర్‌ఎస్ రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లోనూ భారత మాజీ ప్రధాని, భారత రత్న పివి నరసింహారావు 103వ జయంతి కార్యక్రమంలో బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ పాల్గొని ఆయన దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు.

# శాసనసభా సమావేశాలు నిర్వహించి 'నీట్' పై తీర్మానం చేయాలి

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** 'నీట్'పై రాద్ధాంతం జరుగుతోందని, ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి నీట్ రద్దు కోసం ఏకగ్రీవ తీర్మాణాన్ని ప్రవేశపెట్టాలని బిఆర్‌ఎస్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. 'నీట్'పై దేశవ్యాప్తంగా నిరసనలు ఉధృతమవుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయని నీట్ పేపర్ లీకేజీపై దేశవ్యాప్తంగా ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని విద్యార్థులు ఆందోళనగా, ఆసక్తిగా ఎదురుచూస్తున్నారన్నారు. 'నీట్'ను రద్దు చేయాలంటూ చేసిన ఏకగ్రీవ తీర్మానాన్ని తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన నేపథ్యంలో తమిళనాడులోని ఎంకే స్టాలిన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వినోద్ కుమార్ స్వాగతించారు. నీట్ విషయంలో తమిళనాడు ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు యావత్ దేశానికే ఆదర్శనీయంగా నిలుస్తున్నదన్నారు. రాష్ట్రాల విన్నపాలను కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెడితే సుప్రీంను ఆశ్రయించి, రాష్ట్రాలు తమ హక్కులను సాధించుకోవాలని ఆయన సూచించారు.

# బోనాల పండుగకు టిజి ఎస్‌పిడిసిఎల్ సంసిద్ధత

కోతలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా

నాణ్యమైన , విశ్వసనీయమైన విద్యుత్ అందిస్తాం

అధికారులతో సమీక్షలో

సిఎండి ముషారఫ్ ఫరూఖీ వెల్లడి

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** వచ్చే నెల జూలై 7 నుండి ఆగస్టు 3వ తేదీ వరకు జరగనున్న బోనాల పండుగను దృష్టిలో ఉంచుకుని, దక్షిణ తెలంగాణా విద్యుత్ పంపిణి సంస్థ, నాణ్యమైన , విశ్వసనీయమైన విద్యుత్ సరఫరాను అందించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నదని, సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ ఐఏఎస్ తెలిపారు. చీఫ్ ఇంజనీర్లు , సూపరింటెండింగ్ ఇంజనీర్లతో హైదరాబాద్ లోని ఖైరతాబాద్ సమీపంలోని కార్పొరేట్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో టిజి ఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ ఫరూఖీ ఈ క్రింది ఆదేశాలు జారీ చేశారు. బోనాలు పండుగకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పండుగ ప్రారంభానికి ముందే పూర్తి చేయాలన్నారు. జూలై నెల 02 నాటికి సంబంధిత సిఈలు, ఎస్ఈలందరూ బోనాల పండుగ రోజు కంటే ముందు ఆలయాలు వాటి ప్రాంగణాలను సందర్శించి 24X7 విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రతి దేవాలయానికి నోడల్ అధికారి, ఏఈని కేటాయించాలని, విధుల్లో నిర్లక్ష్యం చేస్తే తీవ్రంగా పరిగణిస్తామని ముషారఫ్ ఫారూఖీ హెచ్చరించారు. రోడ్లు భవనాల శాఖ, ఆలయ కమిటీలతో సమన్వయం చేసుకోవాలని, డిటిఆర్‌లు నెట్‌వర్క్‌లలో ఏర్పాటు చేయబడిన అదనపు తాత్కాలిక లైట్లు, ఎయిర్ కండిషనింగ్, సౌండ్ సిస్టమ్ మొదలైన వాటితో సహా లోడ్ చేయడానికి సజావుగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరాను అలాగే ప్రమాద రహితం కోసం పండుగ ప్రారంభం నుండి పూర్తి అయ్యే వరకు అధికారులు సిబ్బందిని 24 గంటలు విధులకు కేటాయిస్తున్నామన్నారు. అవసరమైన చోట ప్రత్యామ్నాయ సామాగ్రిని ఏర్పాటు చేయాలన్నారు. ఫీల్డ్ సిబ్బందికి తగిన మెటీరియల్‌లు అన్ని సంఘటనలను ఎదుర్కోవటానికి టి అండ్ పి ఉండేలా చూసుకోవాలన్నారు. వీటితో పాటు అన్ని విద్యుత్ స్తంభాలు ముఖ్యంగా ప్రధాన రహదారులు, లేన్‌లు బై లేన్‌లలో పెద్ద సంఖ్యలో ప్రజలు గుమిగూడే చోట పోల్ షాక్‌లు రాకుండా తనిఖీ చేయాలని, ఎక్కడ కూడా విద్యుత్ లీకేజీలు ఉండకూడదని ఆయన ఆదేశించారు. అన్ని ముఖ్యమైన ప్రదేశాలలో అన్ని రకాల విద్యుత్ పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్‌ల టోంగ్ టెస్టర్ రీడింగ్‌లను విధిగా ఈ పండుగ సమయంలో ప్రతి గంటకు తీసుకోవడంతో పాటు వాటిని రికార్డు చేసుకోవాలన్నారు. విద్యుత్ కోతల్లో ఏదైనా అసాధారణత కపిపిస్తే వెను వెంటనే సరిదిద్దాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు నందకుమార్, డాక్టర్ నర్సింహులు, చీఫ్ ఇంజనీర్లు కె సాయిబాబా, ఎల్ పాండ్య, వి శివాజీ, పి బిక్షపతి, పి ఆనంద్, సిజిఎం కృష్ణారెడ్డి, సూపరింటెండింగ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# మోదీని నెహ్రూతో పోల్చలేం

**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్రమోదీకి సాటి ఎవరూ లేరని, నెహ్రూతో ఆయనను పోల్చలేమని బిజెపి ఎంపి సుధాంశు త్రివేది అన్నారు. రాష్ట్రపతి ప్రసంగంపై రాజ్యసభలో శుక్రవారం నాడు ధన్యవాద తీర్మానంపై చర్చను ఆయన ప్రారంభించారు. ప్రతిపక్షాలు నెహ్రూతో మోదీని పోల్చరాని అంటున్నాయని, మోదీతో ఎవరినీ పోల్చలేమని, నెహ్రూతో పోలిక లేదని, ఆయనకు ఎవరూ సాధించలేని విజయాలు సాదించారని తెలిపారు. నెహ్రూ ధనిక కుటుంబం నుండి వచ్చారని, మోదీ సాధారణ కుటుంబం నుండి వచ్చారని చెప్పారు. రాజ్యాంగం కాంగ్రెస్ హయాంలోనే ప్రమాదాలను ఎదుర్కొన్నదని అన్నారు. అయోధ్య ఉన్న ఫైజాబాద్‌లో బిజెపి ఓడిపోవడంపై ప్రతిపక్షాలు ఉత్సాహంగా ఉన్నాయని, కనీసం ఇప్పటికైనా వారు రాముడి ఉనికిని గుర్తించారని అన్నారు.

# స్పృహ తప్పిపడిపోయినా సభ నడుపుతారా?



**న్యూఢిల్లీ :** ఒక సభ్యుడు సభలో స్పృహతప్పి పడిపోయినా కూడా రాజ్యసభ కార్యకలాపాలను కొనసాగించడంపై ప్రతిపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ఒక సభ్యుడి పట్ల కనీస ఆందోళన కూడా లేదని విమర్శించారు. ఎంపి ఫులో దేవి నేతం స్పృహ తప్పి పడిపోతే ఆసుపత్రికి తరలించారు. అయినప్పటికీ సభను వాయిదావేయాలని రాజ్యసభ చైర్మన్‌ను కోరినప్పటికీ, తిరస్కరించడంతో విపక్షాలు సభ నుండి వాకౌట్ చేశాయి. నీట్ అంశంపై చర్చ జరగాలని కోరుతూ ప్రతిపక్ష సభ్యులంతా నిరసన వ్యక్తం చేస్తున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. చత్తీస్‌గఢ్‌కు చెందిన కాంగ్రెస్ రాజ్యసభ సభ్యులు నేతం నిరసన చేస్తున్న సమయంలోనే స్పృహ తప్పి పడిపోయారు. ఆమె బిపి 214/140కకి పెరిగిందని వైద్యులు చెప్పారని, వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించి ఐసియులో చేర్చారని రాజ్యసభ సభ్యులు తెలిపారు. ఒక పార్లమెంటు సభ్యురాలు సభలో పడిపోతే, ఆసుపత్రికి తరలించారని, అయినప్పటికీ సభను కొనసాగిస్తున్నారని, సభ్యుల జీవితానికి విలువ లేదా అని కాంగ్రెస్ ఎంపి రేణుకా చౌదరి ప్రశ్నించారు. ప్రజాస్వామ్యమంటే ఇదేనా? మానవత్వరం, సామాజిక గౌరవం లేదా? అని నిలదీశారు. డిఎంకె ఎంపి తిరుచ్చి శివ మాట్లాడుతూ తామంతా సభ వాయిదా వేయకపోవడంతో బలవంతంగా వాకౌట్ చేయాల్సి వచ్చిందని అనానరు.